ఆంధ్రప ... వారపత్రిక

ఆదర్శాలు-అంతర్యాలు

బహుమతి నవల ప్రారంభం





చెరసాల బ్రతుకు

ఫోటో: వి. కుటుంబరావు (మద్రాసు)

ఉత్తరాలు

కథ కాని కథ

28—6—61 తేదీ పత్రికలో శ్రీ జాకబ్ హిల్‌గారు రాసినట్టు ‘మరూరు’ గారు మాయాబజారు కథను గురించి వ్రాసిన పాయింటు తప్పే అయినా కథ అసందర్భంగానే ఉంది.

ఎందుకంటే కథ రాసినాయన బాపట్ల ఎప్పుడూ రానట్టుంది. అందుకనే ‘మాయాబజారని అడిగితే ఇరుకైన గొందిముందు ఆపాడు’ అని రాశారు. కాని బాపట్లలో మాయాబజా రనేది ఒక గొంది కాదు. అది ఒక పేట. ఊరిలోకల్లా బాగుంటుంది. వీధులు చాలా విశాలంగా ఉంటాయి. కాగా మాయాబజారని అడిగితే ఏవీధి అని వెంటనే అడుగుతారు. ఎందుకంటే చాలా పెద్ద పేట అవబట్టి రెండు చివరలకు రెండురేట్లున్నాయి.

బి. ఎల్. నరసింహమూర్తి
కె. రాజశేఖరరావు (బాపట్ల)

* * *

కార్టూనులు

28 వ తేదీ సంచికలోని ఊమెన్ కార్టూన్ మద్య నిషేధ ప్రచారం గురించి వేసినది అసభ్యముగా వున్నది.

టి. లక్ష్మీనరసింహారావు (సూర్యాపేట)

* * *

జి. గణేశ్ గారు వేసిన కార్టూను ఏమాత్రం సందర్భోచితంగా లేదు. నిజంగా శివుడే ప్రత్యక్షమవుతే ఆ మునికి తెలుస్తుంది. ఆ దేవుడే తెలియునట్లి వస్తాడు. ఇది కేవలం హేళనగా ఉంది. దేవుడే గణేశన్‌గారికన్న అంత తక్కువవాడై పోయాడా ? ఎంత కార్టూనయినా కొంత సందర్భోచితంగా ఉండాలి. హేళనకైనా పరిమితి ఉండాలి.

ఎస్. సుబ్రహ్మణ్యం (పెద్దాపురం)

రేఖా చిత్ర కథ

బంగారం—సింగారం ‘రేఖ చిత్ర’ కథ నాకు ఎంతో బాగా నచ్చినది. చదువుతూంటే కథ మంచి ఉత్సాహంగా ఉన్నది.

కె. వెంకటరత్నం (హుజూరాబాద్)

* * *

ఆంధ్ర సచిత్ర వారపత్రికలో ఇటీవల కేవలం దక్షిణాదివారి రచనలకే ప్రాధాన్యం లభిస్తున్నది. కాని ఉత్తరాదివారి రచనలకు ప్రాధాన్యం లభించటం లేదు. అందుచేత ఇటుపైన ఉత్తరాదివారి రచనలను ప్రచురించి పత్రికను మరింత ఉన్నత స్థితిలోనికి తెస్తారని ఆశిస్తూ.

తనికెళ్ల సూర్యప్రకాశరావు (రాజాం)

కథలు

“పేరయ్య భావి” అనే కథ చదివిన తరువాత నా మనస్సులో అనేకవిధమైన సంచలనం కల్గింది.

తెలుగు పత్రికలన్నిటికన్న ‘ఆంధ్ర సచిత్ర వారపత్రిక’ సర్క్యులేషన్ అధికమైనది

దీని తర్వాత 'పునరావృతం' చదివినప్పుడు నాకు అదో రకమైన బాధ కల్గింది. ఈ సంచికలోని అన్ని కథలు 'ఆణిముత్యాలు'. "మూసిన తలుపులు" అర్థంకాలేదు. ఇన్ని మంచి కథలు ఒకే సంచికలో ఉన్నందుకుగాను 'సంపాదకుని' మెచ్చుకోకుండా ఉండలేను.

బి. మోహన్ (నెల్లూరు)

* * *

శ్రీ రంగధామ్‌గారు రచించిన దైవబలము కథ

ఉత్తరాలు

చాల భక్తిరసముగా, చదువుటకు చాల యింపుగా ఉన్నది. ఆ కథ చదువుతున్నంతసేపూ మా తల్లిగారు కూడ భక్తిపారవశ్యములో తేలిపోయినారు.

పి. ఎస్. దేవి (గూడూరు)

* * *

రాజారాంగారు వ్రాసిన "చేదు నిజం" కథలో రాధాపతిగారు రబ్బరుగాజు గురించి ఒక కథను కల్పించి ప్రకాశానికి చెప్పారు. కథ కల్పితమని చివరకు ఆయనే చెప్పారు. కనుక ఆయన జేబులోకి గాజు ఎలా వచ్చిందో తెలియలేదు. రాజారాంగారు ఇంత చిన్న పొరబాటు చేశారంటే నమ్మ శక్యం కావడంలేదు.

యర్రంశెట్టి శాయి (మచిలీపట్నం)

కథ మళ్లీ చదివితే మీ అనుమానం తీరుతుంది!

ఆంధ్రసచిత్ర వారపత్రిక

★

వ్యవస్థాపకులు:
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు

స్థాపితము
1908

★

ముఖ్య సంపాదకుడు:
శివలెంక శంభుప్రసాద్

★

సంపాదకుడు:
శివలెంక రాధాకృష్ణ

★

సంపుటము 53
సంచిక 45

19-7-61
బుధవారం

ప్లవ సం॥ ఆషాఢ శుద్ధషష్ఠి

★

విడిప్రతి వెల 25 న. పై.
సంవత్సర చందా 13-0-0

★

ఆంధ్రపత్రిక కార్యాలయము
7, తంబుచెట్టివీధి,
మదరాసు-1.


విషయానుక్రమణిక

ముఖచిత్రం: నూతన్

వచ్చేవారం

తెలిసిన విలువలు (కథ)
యదనపూడి సులోచనారాణి.

జీతంలేని పరిచారిక (వ్యాసం)


ఎందుకండో ఈ చీపురు!
కాంగ్రెసు తిరుగుబాటు దారులను తుడిచి వేసేందుకు
కక్షలు మర్చిపోదాం
కక్షలు మర్చిపోదాం
రెండూ ఒకదాన్నొకటి మింగేస్తే చక్కగా ఉండదూ!
ముస్లిం మతతత్వం
హిందూ మతతత్వం
కువైట్
దాంగుడు మూంతలు
BOMMAN

శ్రీకృష్ణ

ఢిల్లీలో విద్యుత్ కొరతకు కారకులు: మాలిన్యానికి నిలయమైన కేంద్రసచివాలయం

ఈ వారమంతా ఢిల్లీలో విపరీత వర్షాలు కురిశాయి. పాపం చాలామంది వర్షాకాలం వచ్చిందనే అనుకున్నారు. కానీ, మళ్ళీ జూన్ వాతావరణం రావటంతో, వారిఅనుమానాలు తల్లక్రిందయ్యాయి.

స్టేట్స్‌మన్, టైమ్స్ ఆఫ్ ఇండియాలలో కన్పించే ఒక రిద్దరు పత్రికా రచయితలు తప్ప, మిగిలిన పత్రికా రచయితలందరూ ఢిల్లీ విషయాలకు ఆధారపడేది నిజమైన సమాచారంచెప్పే ప్రభుత్వోద్యోగులపైనగాదు, ప్రచారకులు సమాచారంపైన ఆధారపడతారు. ఉదాహరణకు ఒక్క విషయం పరిశీలిద్దాం. గత పది సంవత్సరాలుగా రాజకుమారి అమృతకౌర్‌కు కేంద్ర పబ్లిక్ వర్క్స్ శాఖకు మధ్య, భూగర్భ నీటి సమస్యపైన యుద్ధం జరుగుతోంది. భూగర్భ నీటి మట్టం పెరుగుతోందని రాజకుమారి అమృతకౌర్ అభిప్రాయపడ్డారు. అది అబద్ధం అని కేంద్ర పబ్లిక్ వర్క్స్ ఇంజనీరింగ్ శాఖ నిపుణులు అన్నారు. రాజకుమారి కౌర్ మంత్రి పదవినుండి తప్పుకున్నా, ఈ భూగర్భ నీటి సమస్య రగులుతూనే వుంది. నీటిమట్టం పెరుగుతూనే వుంది. బాగా ఎదిగిన చెట్లు అకారణంగానే ఎండి పోవటం ప్రారంభించాయి. పరిశోధనలు చేశారు. ఇలా ఎండిపోవటానికి కారణం భూగర్భ నీటి మట్టం పెరుగుతుండటమేనని పరిశోధనవల్ల తేలింది.

ఏమైనా పబ్లిక్ వర్క్స్ శాఖ తప్పులో పడకూడదుగా! అందుకని, ఈ నీటిని బైటకు తీసేందుకు వెంటనే గొట్టపు బావులు నిర్మించాలని నిశ్చయించుకుంది. ఒక వృత్తాకార ప్రహరీలో ఈ గొట్టపు బావులను సుమారు 700 లు నిర్మించారు. నీటిని చూస్తే అనహ్యానికి ప్రతి రూపాలనిపిస్తుంది. ఈ వికృతి రూపాలను ఒక పత్రికా విలేఖరికి చూపించి, ఈ కట్టడాలను "భూతల స్వర్గంగా" చేయబోతున్నామని హడల గొట్టారు. పాతకొత్తలతో సహా పబ్లిక్ వర్క్స్ శాఖ ఇంజనీర్లందరి విగ్రహాలు వాళ్ళ జీవిత చరిత్రలు, వారి వారి బ్యాంకు నిలువలు ఇలాంటి వివరాలతో సహా, ఈ 'భూతల స్వర్గంలో' ప్రతిష్ఠించటం ఇంకా బాగుంటుంది. సరే అదలా వుంచండి. అన్నిటికన్న ముఖ్యమైనది విద్యుచ్ఛక్తి సమస్య. అనలిప్పటికే విద్యుచ్ఛక్తి తక్కువ సరఫరా అవుతోంది. విద్యుచ్ఛక్తి పూర్తిగా ఆగిపోని రోజంటూ వుండటమే కష్టంగా వుంది. అనుభవజ్ఞులైన, పి. డబ్ల్యు. డి. ఇంజనీర్లు గొట్టపు బావులు నిర్మించటం ద్వారా ఇంకా విద్యుచ్ఛక్తి కొరతకు కారణమయ్యారు. గొట్టపు బావులు సక్రమంగా పని చేయటానికి ఎంత విద్యుచ్ఛక్తి, ఇప్పుడు లభ్యమవుతున్న దానికన్నా ఎక్కువ గాలో అంచనా వేసినట్లు లేదు. ఈ రహస్యాలు మాత్రం, న్యూఢిల్లీ కాఫీ పేటగాళ్ళకు తెలియలేదు. విద్యుచ్ఛక్తి చాలనందువల్ల, గొట్టపు బావులు పూర్తిగా పని చేయకుండా పోలేదో, ఇప్పటికీ బాగా బాధ పడుతున్న (కొరతవల్ల) విద్యుచ్ఛక్తి వినియోగదార్లకు ఇంకా అవస్థ కల్గిస్తూ, పని చేస్తేనో ఈ విషయం పత్రికల్లో పెద్దక్షరాల్లో రావచ్చు.

ఇది మన కథలో ఒకభాగం మాత్రమే. యథాప్రకారంగా ఈ యేడు కూడా ఏర్పడిన నీటి కరువు రెండో అంశం. మేడల దిగువ భాగాల్లో కూడా నీటి వత్తిడి తక్కువగా ఉన్నది. 'మెహతాల (గుజరాతీల) పుణ్యమంటూ, నీటికి వీలైనంత ఎక్కువ క్లోరిన్‌తో రక్షణ లభిస్తోంది. ఢిల్లీ నీళ్ళలో క్లోరిన్ వాసన పక్కాగా చూడొచ్చు. పైగా ఇందువల్ల ఇంకో



నాగ్లకని కార్మికుల సంక్షేమనిధి సలహా సంఘ సమావేశం ఇటీవల న్యూఢిల్లీలో జరిగింది. కేంద్ర కార్మిక మంత్రి శ్రీ నందా ప్రసంగించారు.

ఉపయోగం కూడా వుంది. ఈ క్లోరిన్ ప్రజల జీర్ణశక్తిని పాడు చేయడం ద్వారా అటు డాక్టర్లకు, ఇటు మందుల షాపులకు కూడ ఉభయ తారకంగా లాభం కల్గిస్తోంది.

లోగడ చాలా సంవత్సరాలుగా ఢిల్లీ పౌరులకు, మురికి నీటిని తొలగిస్తామనే హామీ లభిస్తూ వచ్చింది. బొంబాయినుంచి వచ్చిన ఇంకో సుప్రసిద్ధ ఇంజనీరు శ్రీ లోఖాండేని పంపింగ్ స్టేషను నిర్మాణానికి మచ్చింపు కాల్వల ప్రత్యకాలకు నియమించటం జరిగింది. నజఫ్‌ఘర్ మురుగు ఇంకా, వాటరు వర్క్స్ దగ్గర్కే చేరుతోంది. ఇందువల్ల కూడా డాక్టర్లకు, మందుల షాపులకు కొన్ని పని దొరుకుతోంది. మురికిపేటలు న్యూఢిల్లీకి ఇంకో సమస్య. పౌర సంస్థ సహాయంతో ఒక సంఘం, న్యూఢిల్లీ కోసం ఒక సుందర 'బృహత్ప్రథకాన్ని రూపొందించింది. దీనికయ్యే ఖర్చు ఎంతోకాదు. కొన్ని వందల కోట్లు మాత్రమే. ఈ మురికి పేటల్లో నివసించేవారిని "మీరంతా మంచి చోట్లకు పొండయ్యా"అని చెప్పగల్గే అధికారం ఎవరికుందనేది అసలు సమస్య. ప్రజల ఆరోగ్యంకంటే జీవనంకన్న పదవులే ప్రధానం కనుక, పార్టీలో ఓట్ల బలాన్ని తగ్గించి బుజా మార్గంమంచి తప్పించే—ఇలాంటి పిచ్చి ప్రయత్నాలేమీ చేయకూడదు. కాంగ్రెసే కనక మురికిపేటలు తొలగించటానికి పూనుకుంటే కమ్యూనిస్టులు, జన జనసంఘం, ముస్లింహా యకులు అభివృద్ధి పథకం ఎలాటిదైనా నిరోధించేందుకని మురికిపేట వాసులకు మద్దతుగానే నిలుస్తారు. షాజహాన్ నిర్మించిన సుందర భవనం జుమ్మా మసీదు పరిసరాలు నానాటికి మురికిపేటలకన్న ఉతుకుష్టంగా తయారవటానికి కేవలం మత ప్రాతిపదికలే కారణం. జమునా బజారును శుభ్రం చేయగల శక్తి ఎవ్వరికీ లేదు. ఇందుకు కారణం కాంగ్రెసుకు ఓట్లు పోతాయనే భయం మాత్రమేకాక, అతి అనారోగ్యప్రదమైన ఈ మురికివాడ పారిశుద్ధ్యం ప్రయత్నాలు నిజాయితీగా నిరోధిస్తూ, కాంగ్రెసులోనే కొన్ని వర్గాలుండటం కూడా ఇంకో కారణం.

(62-వ పేజీ చూడండి)



అంతర్యాలు

సింగరాజు లింగమూర్తి

1

ఆ ఊరిలో పొట్టగిత్తన్నా, పోలాయన్నా హడలు.

బరితెగిపోయిన పొట్టగిత్తను వంచగలిగింది పోలాయ్ ఒక్కడే !

ఎటువంటి పొగరుమోతు గిత్తయినా పోలాయి 'ఖడేరహో !' అని గర్జించాడంటే ముందుకు ఒక్క అడుగు వెయ్యలేకపోయేది.

పోలాయంటే నోరులేని పశువుల కెంత హడలో నోరుగల మనుష్యులకీ అంతే !

కరణం, మునసబు, పెద్దరైతు, సాహుకారి, దేవాలయం మహంతు అందరూ పోలాయంటే ఒణికిపోతారు.

పోలాయంటే ఎంత హడలిపోతారో, ఆ ఊళ్లో ఆబాలగోపాలం అంతగానూ గౌరవిస్తారు.

అది మెరమెచ్చులతో గౌరవించడం కాదు. దుష్టుడిని చూసి భయంతో గౌరవించడమూ కాదు.

ఎక్కడ అన్యాయం ఉంటుందో అక్కడ పోలాయంటే హడలు.

ఎక్కడ అవనీతి ఉంటుందో అక్కడ పోలాయంటే భయం.

న్యాయం, సత్యం, నీతిని ప్రేమించేవారు పోలాయిని ప్రేమిస్తారు.

వాటిని ద్వేషించేవాళ్ళు పోలాయిని ద్వేషిస్తారు.

అందుకే పోలాయంటే అందరికీ అభిమానం— భయం కూడాను.

మంచి ఒడ్డూ పొడుగూ, కండలు తిరిగిన దేహం, తలకు పాగా, తీర్చిన మీసకట్టు, చేతుల బనీను, నీరుకావి పంచె, చేతిలో బాణాకర్రతో గ్రామస్థుల కళ్లముందు పోలాయి ఎప్పుడూ మసలుతూ ఉంటాడు.

పోలాయికి తల్లిదండ్రు లెవరో తెలియదు. తల్లీ—తండ్రీ అయి పెంచిన ముసలిదంటే పోలాయికి వల్లమాలిన భక్తి. పుట్టంగానే తల్లిని చంపుకున్నావనీ, తండ్రిని కాకుండా చేసుకున్నావని అతనికి ఆ ముసలిదే చెప్పింది. ఆరోజు పోలాయి ఎంతో ఏడ్చాడు.

ఆరోజు మామూలుగానే పోలాయి ఇంటి దగ్గరనుంచి బయలుదేరేప్పటికి కాయిలు గుడిసె ముందుకు వచ్చాడు.

"ఏం—కాయిలు మామా, పొద్దున్నే వచ్చావు ?" అని ప్రశ్నించాడు పోలాయి.

"రాక తప్పుతాది—దొరలంపినంక. నిన్ను ఎంట పెట్టుకొని తోలుకరమ్మన్నరు" అన్నాడు కాయిలు.

"నాతో ఏంపనుండెనబ్బా !— సరే .... నడు" అంటూ పోలాయి కాయిలు వెంట బయలుదేరాడు.

ఉదయపు టెండ చిటచిట లాడు తున్నది. దొడ్లల్లో బావుల్లోని రైతుపడుచులు, తడితరుబు ఉరిబెట్టట ఉన్న మునేరునుంచి నీళ్ళ

అర్థం చేసుకొని తదనుగుణంగా మసులుకోగలడు. అందుకే దొరవారు కబురుపెట్టిన కారణాన్ని వెంటనే ఊహించగలిగాడు.

"అయితే ఇప్పుడు తనేం చేయాలి ?" అని ఆలోచిస్తూ కాయిలుతోబాటు నడుస్తున్నాడు.

కాయిలు ఒకటి రెండుసార్లు ఏదో చెప్పబోయి పోలాయి గంభీరంగా ఉండటంవల్ల పెదవి కదల్చలేకపోయాడు. అది కనిపెట్టి పోలాయి నవ్వుకొని "అయితే కాయిలు మామా, దొరవారు ఎందుకు పిలిచా రంటావు ?" అన్నాడు.

"నీకు మంచిరోజు లొచ్చినయ్ అల్లుడా ! దొరవారు సెప్పినట్టు నడుసుకుంటే నీ యిల్లు బంగారమవుద్ది" నవ్వుతూ అన్నాడు కాయిలు.

"అయితే ఇందాక నాకు వెదురోజులన్నమాట.' పోలాయి మాటలు గంభీరంగా ఉన్నాయి.

కాయిలు ఏమీ మాట్లాడలేదు. ఇద్దరూ మౌనంగా నడుస్తున్నారు.

కాయిలు మాటలు పోలాయి బుర్రలో గిర్రున తిరుగుతున్నాయి.

"ఇల్లు—బంగారం" నవ్వుకున్నాడు పోలాయి.

ఇంతలో దొరవారి భవనం సమీపించారు.

పోలాయి కోసమే ఎదురు చూస్తున్నట్టు కచేరీ సావిడిలో నరసింహప్పగారు సోఫాలో కూర్చుని పత్రిక చదువుతున్నారు.

ఉగాది పోటీలో బహుమతి పొందిన కథ

న్యాయానికి భయపడినట్టే పోలాయికీ భయపడుతారు.

ఒకరి దయాధర్మభిక్షాలమీద ఆధారపడి బ్రతికే వాడు కాదు పోలాయి.

ఒళ్ళు వంచి పనిచేస్తాడు. పనికి తగిన ఫలితం ఎక్కడా లేదు కాబట్టి అతనికీ లేదు.

ఎంతిస్తే అంతే తీసుకుంటాడు. తక్కువ ఇస్తున్నారు కదా అని ఒళ్ళు దాచుకోడు. ఎక్కువ యిస్తున్నారు కదా అని తన శక్తికి మించి చేయడు.

"ఆ ఆసామి దగ్గర కూలీ అంత తక్కువ తీసుకున్నావేం" అని ఎవరైనా ప్రశ్నిస్తే "పోన్లెండి బాబూ—ఒక్క పొట్ట .... నాకు చాలదేటి ? .... నాకిచ్చే కూలి డబ్బుల్లో మిగుల్చుకొని ఆయనేం మిద్దెలు కట్టబోడుగా" అంటాడు.

తన విషయంలో కూలీ ఎంతిచ్చినా పుచ్చుకుంటాడు. ఇతరుల విషయంలో అనుకున్నదానికి ఒక్క పైసా తక్కువ ఇచ్చినా సరే చెవులు మెలిపెట్టి మరీ యిప్పిస్తాడు.

తన విషయంలో పోలాయి ఎప్పుడూ శ్రద్ధ చూపేవాడు కాదు. ఇతరులకు కించిదపకారం జరిగినా సహించడు.

అన్యాయం జరిగినవాళ్ళు పోలాయిని ఆశ్రయిస్తారు.

ఆపదలో ఉన్నవాళ్ళ దగ్గరకు పోలాయే వెళ్లి చేతనైనంతవరకు ఆదుకుంటాడు.

మోసుకొస్తున్నారు. మొగవాళ్ళు కొందరు కావిళ్లతో నీళ్ళు తెస్తున్నారు. కొందరు పశువుల్ని తోలుకుపోతున్నారు. తనను పలుకరించినవారికి పోలాయి పరధ్యానంగా సమాధానా లిచ్చి ముందుకు నడుస్తున్నాడు.

దారివెంట నడుస్తున్నా పోలాయి "దొరవారు ఎందుకు పిలిచిఉంటారా" అని ఆలోచిస్తూనే ఉన్నాడు.

ఎక్కువసేపు ఆలోచించకుండానే దొరవారు పిలిపించిన కారణ మేమిటో ఊహించగలిగాడు పోలాయి.

పోలాయికి చదువంటే లేదు కాని తెలివి తేటలకేం కొదువలేదు. గ్రామంలోనివారి మనస్తత్వాలను ఇట్టే పసిగట్టగలడు. పరిస్థితులను

"దొరగారికి దండాలు" ఎంతో వినయంగా అన్నాడు పోలాయి.

"మనిషంటే నువ్వురా పోలాయ్ ! పిలవంగానే వచ్చావు. రా—కూర్చో" ఎంతో సాదరంగా అన్నారు నరసింహప్పగారు.

పోలాయి క్రిందపరచిఉన్న తివాసీ అంచుమీద కూర్చున్నాడు.

కాయిలు నరసింహప్ప సైగతో అక్కడినించి వెళ్లిపోయాడు.

"ఊళ్లో విశేషా లేమిటి పోలాయ్ ?" పిలిపించిన కారణం మాటిగా వెంటనే చెప్పలేపోయాడు నరసింహప్ప.

మీకు తెలియని విషయా లేమున్నయ్ దొరా !" అన్నాడు పోలాయి.

(61–వ పేజీ చూడండి)



శ్రీ సింగరాజు లింగమూర్తి 1926 లో జన్మించారు. ఆంధ్రప్రదేశ్ శాసనసభా కార్యదర్శి కార్యాలయంలో పనిచేస్తున్నారు. కథానికా రచనలో పదిహేను సంవత్సరాల అనుభవం ఉన్నది. సాంఘిక, రాజకీయ సమస్యలపైన వ్రాయడం వీరికి ఇష్టం.



దైవజ్ఞ పాతూరి శ్రీరామమూర్తి

19-7-1961 బుధవారము మొదలు
25-7-1961 మంగళవారము వరకు

మేషం :

(అశ్విని, భరణి, కృత్తిక 1 పా.)

ఇతరుల బెదరింపులకు భయపడవలసిన అవసరం ఉండదు. మీ ఆలోచనలు నిరాటంకంగా నెరవేరుతవి. వ్యవహార రంగంలో మాట పట్టింపులు పెరిగి ఖర్చులకు దారి తీయవచ్చు. కాని, గౌరవం నిలబెట్టుకోగలుగుతారు. అధికారులతో సమంగా దర్జాతో ప్రవర్తిస్తారు. ప్రయాణ కార్యక్రమాలు సుఖంగానూ, జయప్రదంగానూ జరుగుతవి. మీమాట నేర్పుతో ఇతరుల పట్టుదలలను తగ్గించి సహాయం చేస్తారు. పిల్లల ఆరోగ్యం సంతృప్తికరంగా తోచదు. ఇతరులమ గురించి దూషణ చేస్తూ మీ ఆదరణకోసం ఎదురుచూచేవారు ఉంటారు. జాగ్రత్తగా ఉండండి. వారాంతంలో సమర్థులను నమ్మి పశ్చాత్తాపపడతారు. 21, 22 లలో క్రొత్త మనుష్యులతో స్నేహ సంబంధం, ధన లాభం.

*　　*　　*

వృషభం :

(కృత్తిక 2, 3, 4 పా, రోహిణి, మృగశిర 1, 2 పా.)

వివాహకార్యాలయందు ఆసక్తి అధికంగా ఉంటుంది. అయితే దైవబలంవల్ల విజయం సాధించగలుగుతారు. స్థిరాస్తులవల్ల ఆదాయం బాగుంటుంది. కుటుంబంలో చాలా ప్రశాంతమైన సమయం. మిమ్మలను చూడగానే అవతలి వారి ఆగ్రహం తొలగిపోయి మంచితనంగా మాట్లాడుతారు. మీ వృత్తి, ఉద్యోగాలలో ఇతరుల దురాలోచనలు మొదట ఆందోళనకరంగా ఉన్నా చివరకు మీకు అనుకూలంగా పరిణామం చెందుతవి. వృథా

గ్రహస్థితి

వృషభంలో శుక్రుడు, మిధునంలో బుధుడు, కర్కాటకంలో సూర్యుడు, సింహంలో అంగారక రాహువులు, మకరంలో గురు, శనులు, కుంభంలో కేతువు,కన్య, తులా, వృశ్చిక, ధనుస్సులలో చంద్రుడు.

ఖర్చులు చాలావరకు తగ్గుతవి. కార్యభారం క్రమంగా తొలగించుకుని మనశ్శాంతి పొందగలుగుతారు. దేహ సౌఖ్యం లభిస్తుంది. ఇతరుల పనులలో పెత్తనం చేయవలసి వస్తుంది. మిత్రులతో నిష్కర్షగా మాట్లాడవలసిన అవసరం కలుగుతుంది. 24, 25 తేదులలో ఇష్టంలేని పనులు చేయవలసి వస్తుంది. దుర్వార్తలు, తొందరలో పొరపాట్లు.

*　　*　　*

మిధునం :

(మృగశిర 3, 4 పా, ఆరుద్ర, పునర్వసు 1, 2, 3 పా.)

ఉన్నదున్నట్లు న్యాయం చెప్పటంవల్ల చిక్కులు రాకుండా చూచుకొనవలసిన సమయం. పదిమందిలో గౌరవంపొందే సమయంలో మీ విరోధులు అపవాదులు లేవదీయటానికి చూస్తారు. స్వశక్తితో వృత్తి, వ్యాపారాలలో అభివృద్ధిని సాధిస్తారు. ఫలితం కూడా బాగానే ఉంటుంది. విలువగల వస్తువులుకొనే ప్రయత్నాలు సులభంగా నెరవేరుతవి. యధార్థంగా చెప్పుకొన తగినంత కార్యభారం లేకపోయినా ఉన్నట్లుగా ఆందోళన మాత్రం కలుగుతూ ఉంటుంది. శుభకార్యాలు మీ నిర్ణయం ప్రకారం జరుగకపోవచ్చు. అంత మాత్రంచేత నిరాశ చెందవద్దు. తలవని తలంపుగా మీ పనులలో పాల్గొని సహాయం చేసేవారు లభిస్తారు. ఆదాయము, ఖర్చులూ విశేషంగానే ఉంటవి. 19, 20 లో కుటుంబ సుఖము, విలాస కార్యక్రమాలు పేమలతో స్నేహము.

*　　*　　*

కర్కాటకం :

(పునర్వసు 4 పా, పుష్యమి, ఆశ్లేష)

వార ఆరంభంలో ఉద్రేకాన్ని తగ్గించుకొని పని జరుపుకొనటం మంచిది. మీ మాట తీరు అవతలి వారికి కఠినంగా తోస్తుంది. ఇతరులవద్దనుంచి రావలసిన ధనం సక్రమంగా వస్తుంది. ప్రతి పని లోను ముందు ఆటంకాలు, పోటీలు వస్తూ ఉంటవి. మీరు చెప్పిన మాట ప్రకారం సమయంలో జరుపుకొనటానికి అవకాశాలు కలిసిపావు. పిల్లల ఆరోగ్యం సరిగా ఉండదు. ఆదాయానికి లోపం ఉండదు. నౌకరులు మొదలయిన వారితో అభిప్రాయ భేదాలువచ్చి అశాంతి కలుగుతుంది. ఈ సమయంలో కొనే వస్తువులు నిరుపయోగంగా ఉంటవి. దూరపు బంధువులవద్దనుంచి శుభవార్తలు తెలుస్తవి. వారాంతంలో దేహ శ్రమ అధికంగా ఉంటుంది. 22, 23 తేదులలో ప్రయాణాలు, శుభ సంతోషాలకై ఖర్చులు, వృత్తిలో మంచి మార్పులు.

*　　*　　*

సింహం :

(మఖ, పుబ్బ, ఉత్తర 1 పా.)

మీ పరిస్థితులలో అనేక మార్పులు జరుగుతూ ఉండటంవల్ల ముందుగా ఏ నిర్ణయము చేయలేకపోతారు. మీ సాహసం ఈ సమయంలో ఉపయోగపడకపోవచ్చు. మంచితనంతో ఎదుటివారి ఆదరాభిమానాలను పొందవలసిన సమయం. కీర్తి ప్రతిష్ఠలు లభిస్తవి. కుటుంబంలోనివారి ఆరోగ్యం ఇంతకుముందుకన్నా మేలుగా ఉంటుంది. ఈ సమయంలో న్యాయంకన్నా యుక్తితో ఎదటి వారిని సంతృప్తిపరచగలుగుతారు. శ్రమకు తగినంత ఆదాయం కూడా లభిస్తుంది. వాతావరణంలో కలిగే మార్పులవల్ల మీ ఆరోగ్యం లోపిస్తుంది. అయితే వెంటనే స్వస్థత లభిస్తుంది. ఎంత అవసరం వచ్చినా అప్పులు చేయకుండా ఉండటానికి ప్రయత్నిం

వండి. వారాంతంలో లాభవార్తలు తెలుస్తవి. 23, 24 తేదులలో అసౌఖ్యం, శుభవార్తలు, సంచా రము.

* * *

కన్య :

(ఉత్తర 2, 3, 4 పా., హస్త, చిత్త 1, 2 పా.)

ఒక ప్రక్క శుభ సంతోషాలు, మరొక ప్రక్క సంఘంలో కీర్తి ప్రతిష్ఠలు, అన్నివిధాల ఆడంబరంగా ఉండే సమయం. మీ మాటకు ఎదురు ఉండదు. శారీరకంగా శ్రమ ఉన్నా ఉత్సాహం తగ్గదు. వృత్తిలో మీ అంతస్తు పెరుగుతుంది. విశ్రాంతిలేని కార్యక్రమాలు, మీరు పెట్టుబడిపెట్టి చేసిన పనులు ప్రస్తుతం బాగా అనుకూలిస్తవి. కోర్టు కచేరీలలో మీ మాట చలామణి అవుతుంది. అన్ని విషయాలలోను చురుకుగ ప్రవేశించగల్గుతారు. కుటుంబంలో సుఖసంతోషాలు లభిస్తవి. వస్త్రాలు, ఆభరణాలు మొదలయినవి కొంటారు. ఎదురు చూస్తున్న వార్తలు వారాంతంలో తెలుస్తవి. తొందరవల్ల వస్తు నష్టం కలుగుతుంది. 19, 20 తేదులలో విందులు, వినోదాలు, ఆకస్మిదన లాభం.

* * *

తుల :

(చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు)

మన శ్శాంతి లభిస్తుంది. వృత్తిలో అనుకున్న దానికంటె అధికంగా ఫలితం కనబడుతుంది. కార్యక్రమాలలో స్వల్పప్రతిబంధకాలు వస్తున్నా సమయంలో ఉత్సాహంతో మీకు అండగా నిలబడే మనుష్యులు లభిస్తారు. తలపెట్టిన పనులు ఒకదానికొకటి అధికం కావటంవల్ల అప్పులు చేయవలసి వస్తుందనే ఆదుర్దా కలుగుతుంది. దైవికంగా అట్టి అవసరం తొలగి సుఖం అనుభవించగలుగుతారు. మాటలలో పౌరుషాన్ని కనబరచకుండా మీ పనిని గడుపుకొనవలసిన సమయం. కుటుంబ విషయాలలో నెమ్మదిగా గడుస్తుంది. మామూలు కన్నా అధికంగా లభించగలదనుకున్న అవకాశం తప్పిపోవచ్చు. 22, 23 తేదులలో సంఘంలో మంచి పేరు, వృత్తిలో లాభకరం, ప్రయాణము.

* * *

వృశ్చికం :

(విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ)

నిర్బంధంలోనుంచి బయటపడినంత ఉత్సాహం పొందగలుగుతారు. మీ స్వవిషయాలలో ఇతరుల అధికారము, చిక్కులు తొలగిపోయి ఇష్టాను సారంగా కార్యం సాగించుకొనగల అవకాశం లభిస్తుంది. విలాస కార్యక్రమాలలో పాల్గొంటారు. ఒకానొక సందర్భంలో కష్టవార్తలు తెలుస్తవి కాని, అందులో విచారించతగినంత కారణం ఉండదు. గౌరవప్రదమైన కాలం, బంధువులు మిమ్ములను అనుసరించి మాట్లాడుతారు. పిల్లల మూలంగా ఖర్చులు పెరుగుతవి. నౌకరులవల్ల అనుకూలత, సుఖము లభిస్తవి. హృదయంలోని ఆందోళన తొలగిపోతుంది. వ్యవహారాలలో విజయం లభిస్తుంది. వారాంతంలో ఇంతకుముందు వద్దు అని అనుకున్న విషయాలలోనే తిరిగి ప్రవేశిస్తారు. 19, 20 తేదులలో ధనలాభం, పుణ్య కార్యప్రసంగాలు, పొరపాట్లు.

* * *

ధనుస్సు :

(మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా.)

ప్రస్తుతం ఇతరులకు సహాయం చేయటం ఎలాఉన్నా మీ పనులను మీరు శ్రద్ధతో చూచుకొనగల శక్తి సామర్థ్యాలు లభిస్తవి. అవతలివారి హాస్యప్రసంగాలను లెక్కపెట్టుకోవద్దు. అధికారులతో సంప్రదింపులు సంతోషంగాను, అనుకూలంగానూ జరుగుతవి. దూరపు ప్రయాణం చేయవలసి వస్తుంది. స్థిరాస్తులకు సంబంధించిన పనులలో డబ్బు అధికంగా ఖర్చు పెట్టవలసి వస్తుంది. ఉత్తర దిక్కునుంచి వచ్చే వార్తలు మీ ప్రయత్నాలకు ప్రోత్సాహాన్ని కలిగిస్తవి. ఆదాయం మామూలుగా ఉంటుంది. మీ ఆడంబరాన్ని చూచి తోటివారు అసూయపడతారు. జాగ్రత్తగా మసలుకొనటం మంచిది. 20, 21, 22 తేదులలో సంఘ గౌరవం, గొప్పవారితో సమావేశం, ధన నష్ట సూచన.

మకరం :

(ఉత్తరాషాఢ 2, 3, 4 పా., శ్రవణం, ధనిష్ఠ 1, 2 పా.)

మాటలలో మిమ్ములను అందరు గౌరవిస్తూ ఉంటారు. యధార్థంగా ఎవరు ఉపయోగిస్తారు? అనే విషయం తెలుసుకొనటం కష్టం. వృత్తిలో క్రమంగా అభివృద్ధి కనుపిస్తుంది. పాత స్నేహితులను కలుసుకొంటారు. పని లేకపోయినా మిమ్ములను మాటలలోదింపి చులకన చేయటానికి ప్రయత్నించేవారుంటారు, జాగ్రత్త. ఇతరులవద్దనుంచి రావలసిన డబ్బు కొంతవరకు వస్తుంది. స్నేహితుల సలహాలు తాత్కాలికంగా బాగున్నా నిదానంగా ఆలోచించి చేయవలసిన సమయం. కుటుంబంలో అసంతృప్తి తొలగుతుంది. అనుకోకుండా ప్రయాణం చేయవలసి వస్తుంది. పిల్లల ఆరోగ్యం గత వారంకన్నా మేలుగా వుంటుంది. 24, 25 తేదులలో కూడాఉండే మనుష్యులతో అభిప్రాయ భేదాలు, పనులలో పొరపాట్లు చేయటం—

* * *

కుంభం :

(ధనిష్ఠ 3, 4 పా., శతభిషం, పూ. భాద్ర 1, 2, 3 పా.)

ఏ అవకాశమైనా దానంతట కలిసి వచ్చేవరకు నిదానించటం అవసరం. ఖర్చులు పెరుగుతవి. కాని తగినంత ఉపయోగం కనుపించదు. మిమ్ములను పొగిడి తమ పనిని సాధించుకొనేవారుంటారు. భాగస్తులతో కలిసి చేయు వ్యాపార వ్యవహారాలలో ముందు జాగ్రత్త అవసరం. కుటుంబంలో పిల్లల మూలంగా సుఖశాంతులు లభిస్తవి. బంధువుల రాక పోకలు అధికం. వృత్తి ఉద్యోగాలలో పైవారి వల్ల మాట రాకుండా జాగ్రత్త పడ గలుగుతారు.

ఈవారము ధరలు

బంగారు ధరలో స్థిరత్వము కనుపించదు. తరచూ హెచ్చు తగ్గులు రాగల అవకాశా లున్నవి. వెండిధర వారం రెండవ భాగంలో మందీ వస్తుంది. వసువుధర కొంత తగ్గుతుంది. నూవులనూనె, వేరుశనగ నూనెలకు గిరాకి వచ్చే అవకాశాలున్నవి. చింతపండు ధర మొదట తగ్గి క్రమంగా పెరుగుతుంది. మిర్చి ధర వారం ఆరంభంలో స్వల్పంగా మందీ అవుతుంది. కాని వారాంతంలో బాగా పెరగవచ్చు. కందుల ధరలో మందీ కనుపిస్తుంది. వేరుశనగపప్పు ధర నిలకడగా ఉంటుంది.

డబ్బు నీటి మాదిరి ఖర్చు చేయవలసిన సమయం. వారాంతంలో అకస్మాత్తుగా దేహ బాధలు కలుగగల సూచన ఉన్నవి. 20, 21 తేదులలో ధన లాభం, వృత్తిలో పోటీ, దైవ కార్యాలు.

* * *

మీనం :

(పూ. భాద్ర 4 పా., ఉ. భాద్ర, రేవతి)

ఏ పని ముందు ఏ పని వెనుక అని నిర్ణయం జరిగేవరకు శ్రమగానే ఉంటుంది. అనంతరం చురుకుగా ముందుకు పోగలుగుతారు. స్నేహితులను నమ్ముకున్నందు వల్ల ప్రయోజనం తక్కువ. స్వయం కృషితో సులభంగా ఉన్నత స్థితిని పొందగలుగుతారు. కుటుంబంలోని వారి ఆరోగ్యం లోపిస్తుంది. బంధువుల విషయంలో యధార్థం మాట్లాడి విరోధం తెచ్చుకోవలసివస్తుంది. అనేక ఆలోచనలతో మధ్య మధ్య పొరపాట్లు చేస్తారు. ఈ సమయంలో అవసరాన్ని మించి ఎవ్వరితోను మాట్లాడటం అంత మంచిదికాదు.. అధికారులతో కలిసే అవకాశం లభించకపోవచ్చు. 24, 25 తేదులలో అంచనాకు మించిన ఆదాయం, శుభవార్తలు, ఇష్ట వస్తు లాభం. ★



పెళ్ళికి వెళుతున్నాం!

జాన్సన్స్ బేబి లోషన్

... ప్రపంచములో

దీనిని నమ్ముకొన్న తల్లులు వేనకు వేలు!



పసిపిల్లల సుకుమారమైన చర్మమునకు చురుకుగా ఉపశమనము కలిగిస్తుంది, రక్షణనిస్తుంది మరియు అందమును చేకూరుస్తుంది

సౌమ్యమైన మరియు ఆహ్లాదకరమైన సువాసనగల జాన్సన్స్ బేబి లోషను, సౌందర్యము కలిగించే నూనె, ఉపశమనకారియైన లనోలిన్ మరియు క్రిమి నాశకమైన విధియోనాల్ సమృద్ధిగాగల మిశ్రమము. ఇది పసిపిల్లలకు ముఖ్యముగా మొలచుట్టూ సౌఖ్యము కలిగించేలా శాస్త్రీయమైన పాళ్లలో కలపబడినవి. ఇది మొలగుడ్డ రాపిడినుండి రక్షణ కలిగిస్తుంది మరియు చర్మమునకు అంటు వ్యాధులనుండి అపాయమును తగ్గిస్తుంది. పసిపిల్లల చర్మమును మృదువుగా మరియు నవనవలాడేలా ఉంచుతుంది.

ఇంగ్లీషు లేక హిందీ భాషలలో లభించు పిల్లల సంరక్షణను గురించిన పుస్తకము కావాలంటే 25 నయా పైసలు తపాలా బిళ్లలు పంపుతూ, మీ పేరు, ఎడ్రసు యీ

ఎడ్రసుకు వ్రాయండి: పోస్టు బాక్సు 6541, డిపార్టుమెంటు నెంబరు 47
బొంబాయి - 26

పిల్లల సంపూర్ణ రక్షణకు
జాన్సన్స్ తయారులు



కేంద్రసాంఘిక సంక్షేమమండలి అధ్యక్షురాలు శ్రీమతి దుర్గాబాయ్ దేశ్‌ముఖ్, ఇటీవల హైదరాబాదులో జరిగిన ప్రాంతీయ సాంఘిక సంక్షేమ సంస్థల ప్రతినిధుల సమావేశంలో ప్రసంగించారు.

మనము-మనరాష్ట్రం

వచ్చే ఎన్నికలకు కాంగ్రెసు అభ్యర్థుల నిర్ణయం : మంత్రాలకు ప్రాతినిధ్యం ఇస్తే సంస్థకు దుర్గతి

"పూచికపుల్లను నిలబెట్టినా గెలుపు మాదే" అని 1946 ఎన్నికలప్పుడు కాంగ్రెసువారు గర్వంగా చెప్పుకునేవారు. దేశభక్తి, త్యాగధనం గల పూచిక పుల్లలు కాబట్టి ప్రజలకు పూజనీయులై గెల్చారు. కాని అధికారం చేపట్టిన ఐదేళ్ళలోనే కాంగ్రెస్ అప్రతిష్ఠపాలై, హేమాహేమీ లనుకున్నవారు 1952 ఎన్నికలు వచ్చేసరికి కేవలం పూచిక పుల్లలై పోవడం జరిగింది. 1955 మధ్యంతరపు ఎన్నికలలో ఏదోవిధంగా కమ్యూనిస్టులను అధికారం లోకి రాకుండా చేయడమే ప్రధానలక్ష్యంగా పెట్టుకుని, కాంగ్రెస్, కె. ఎల్. పి., ప్రజా పార్టీలు ఐక్యసంఘటనగా ఎలాంటి అభ్యర్థులను పెట్టినా, ప్రజలు వోట్లిచ్చి అఖండ విజయం సమకూర్చారు. ఈసారి అలా జరగదు. 1952, 55 ఎన్నికలకు 1962 ఎన్నికలకు చాలా తేడా ఉంది. అప్పటికీ, ఇప్పటికీ కాంగ్రెస్‌లో అవినీతి, ఆశ్రిత పక్షపాతం ముఠాతగవులు పెరిగాయని నాయకులే అంటున్నారు. దేశంలో మరో బలమైన పార్టీ యేదీ లేక పోవడంచేత మళ్ళీ కాంగ్రెసే గెలువవచ్చు. అయినా యోగ్యులైన అభ్యర్థుల్ని పెట్టకపోతే ప్రజలు హర్షించరని కాంగ్రెస్‌కు కొంతగా కొంత నిలచిన ప్రజాభిమానం మరీ దిగజారిపోతుందని అంతా గ్రహించారు. అందుకే ఈ మారు చాలా ముందుగానే మేల్కొని సరైన అభ్యర్థులను నిలబెట్టడానికి సర్వథా ప్రయత్నం చేస్తున్నారు.

66 వ అఖిల భారత కాంగ్రెస్ మహాసభకు అధ్యక్షతవహిస్తూ, శ్రీ నీలం సంజీవరెడ్డిగారు పదేళ్ళుగా పదవులలో ఉన్నవారు తప్పుకోవాలని ఒక కొత్త సూచన చేసి, అభ్యర్థుల నిర్ణయానికి సంబంధించిన ఆలోచనలకు అంకురార్పణ చేశారు. ఆ తరువాత, పార్లమెంటు, శాసన సభలలో ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ సభ్యులలో 1/8 వంతును మినహాయించాలని, యువకులకు ప్రవేశమివ్వాలని అధిష్ఠానవర్గం కొన్ని సూచనలు చేసింది. మునుపటివలె అభ్యర్థుల నిర్ణయం కేవలం పి. సి. సి. జాబితాలను బట్టిగాక, నియోజకవర్గాలకు పరిశీలకులను పంపి, మండల సంఘాల, ప్రజల అభిప్రాయాలు తెలుసుకుని నిర్ణయించాలనుకున్నారు. ఇంతవరకు బాగానేఉంది. కాని అభ్యర్థులకు ఉండవలసిన అర్హతలు, యోగ్యతలు ఏమీ నిర్దేశించలేదు. పూర్వం జెయిలుకు వెళ్ళడం అభ్యర్థులకు ప్రధానమైన అర్హతగా పరిగణించేవారు. ఇప్పు డటువంటివారు అట్టేమంది లేరు. ఉన్నా ఆ అర్హత అనవసరం గనుక, వారికి అవకాశం సున్నా. పోతే శ్రీ సంజీవరెడ్డిగారు అర్హతల సంగతి చెప్పకుండా, పదేళ్ళు పదవిలో ఉండటం అనర్హతగా పేర్కొన్నారు. ఇటువంటిది ఏ దేశంలోనూ లేదు. ఈ సూత్రాన్ని—బండగా సర్వేసర్వత్రా అమలుజరుపడానికి వీలులేదని అలా చేస్తే అనుభవజ్ఞుల్ని, సమర్థుల్ని కోల్పో వలసి వస్తుందని, శ్రీ నెహ్రూగారు వ్యతిరేకించారు. అదీగాక ఈ పదేళ్ళు, శాసన సభ, పార్లమెంటులలో మొత్తం కాలాన్ని లెక్కవేసి అంచనా కడతారా? లేక ప్రతిదానిలోనూ వరుసగా పదేళ్ళ లెక్క వేస్తారా? తెలియదు. రెండవది అయితే ఏ సభ్యుడూ వైదొలగాల్సిన పని ఉండదు. ఏమైనా ఇది అమలు జరిగే అవకాశంగాని, ప్రమాదంగాని లేదని తేలి పోయింది. అయితే శ్రీ సంజీవరెడ్డి సూచనను మరోవిధంగా, అమలులోకి తేవాలని చూస్తున్నారు. అది ప్రస్తుతం పార్లమెంటు శాసన సభలలో ఉన్న కాంగ్రెస్‌వారిలో మూడోవంతు సభ్యులను తిరిగి అభ్యర్థులుగా పెట్టరాదని. ఏ పద్ధతి ననుసరించి ఈ పని చేస్తారో తెలియదు. పదేళ్ళ పైగా ఉన్నవారిని మూడో వంతుకు సరిపోను ఏరి తీసివేస్తారా? లేక రాజ్యసభ, శాసన పరిషత్తులలోలాగా లాటరీవేసి నిర్ణయిస్తారా? లేక తమకు నచ్చిమాలిన వాళ్ళుగా తోచిన వారిని తొలగిస్తారా? ఇది కేవలం సూచన మాత్రమేనని, అమలు జరపడం జరిగినా సంస్థ శ్రేయస్సు దృష్ట్యా చాలా మినహాయింపులు చేయవలసి ఉంటుందని కాంగ్రెస్ కార్యదర్శి శ్రీ రాజగోపాలన్ ఇటీవల భోపాల్‌లో చెప్పారు. అంటే ఇది కూడా సాధ్యం కాదని తేలిపోయింది. దీర్ఘకాలసభ్యత్వంగల పాతవాళ్ళు మినహాయింపు అవుతారన్న భయంలేదు.

ఆచరణసాధ్యం కాదనుకుంటూనే ఇలాంటి పద్ధతులు ఆలోచించేకన్నా అభ్యర్థుల విషయంలో సర్వసామాన్యమైన కొన్ని కట్టుబాట్లు, నియమాలు పెట్టుకుని ఒక సంప్రదాయాన్ని నెలకొల్పడం బాగుంటుంది. కానీ వచ్చిన చిక్కు ముఠా తగవులతో కాంగ్రెస్ కలుషితం కావడం. కొంతవరకూ ముఠాల ప్రాబల్యాన్నిబట్టి అభ్యర్థుల నిర్ణయం జరిగే అవకాశం ఉండటంవల్ల కట్టుబాట్లు నియమాలు ఏర్పర్చడమంటే తేలికైన పనిగాదు. పైగా ఎన్నికలలో పోటీ అంటే డబ్బుతో పని. వేలకు వేలు ఖర్చు చేయనిదే ఏ అభ్యర్థి నెగ్గడు. ఈ ఖర్చులో ఎక్కువ భాగం పార్టీ భరించే స్థితిలో ఉండదు. అందువల్ల పలుకుబడి, డబ్బు కలవాళ్ళపైన—యోగ్యతాయోగ్యతల సంగతి ఎలా వున్నా—ఆధారపడవలసి వస్తుంది. నిజంగా యోగ్యులైన కొందరికి అవకాశం లభించకపోవడానికి ఇదొక కారణం.

ఇలాటి ప్రతిబంధకాలు ఉన్నప్పటికీ కాంగ్రెస్ ప్రతిష్ఠను ప్రభుత్వ సామర్థ్యాన్ని పెంపొందించే వారు అవసరమని నాయకులు భావిస్తున్నారు కనుక అభ్యర్థుల నిర్ణయంలో ఈ దిగువ సూత్రాలు

(61-వ పేజీ చూడండి)

మనమూ మనదేహస్థితీ

డా॥ గాలి బాలసుందరరావు

నత్తి పారంపర్యమా?

(గత వారం తరువాయి)

ఏ పరిస్థితులలో నత్తి ఆరంభమవుతుంది?

నత్తి హఠాత్తుగా యేర్పడదు. అది క్రమంగా యేర్పడుతుంది. నత్తివున్న కుటుంబాల్లో అందరికీ నత్తిరాదు. నత్తి రావడానికి నిశ్చయమైన కారణం ఏదీ కనిపించదు. అనేక మందిలో అది కొన్ని పరిస్థితులలో యేర్పడి తరవాత పోతుంది. నత్తి ఏర్పడిన వారందరూ ఒకలాగే బాధపడరు. నత్తి అన్నిమాటలు ఉచ్చరించేటప్పుడూ రాదు.

మామూలు మనుష్యుల దృష్టిలో 'నత్తి'వేరు శాస్త్రజ్ఞుల దృష్టిలో నత్తివేరు. అనేక వాగ్లోపములు నత్తిగా చలామణీ అవుతున్నవి. మాట్లాడడంలో లోపం ముందుగా గమనించి ఆ లోపం తమలో ఏర్పడిందనే అభిప్రాయం పిల్లలలో యేర్పరచేవారు తల్లి దండ్రులు. పెద్దవారిలో యీ పుణ్యం స్నేహితులు, కలిసి తిరిగేవారు, నిర్వహిస్తారు. మాట్లాడ్డంలో ఆలశ్యం చేసినా కొన్ని అక్షరాలు రెండు మూడు మాట్లు అన్నా, మామూలు మనుష్యుల దృష్టిలో నత్తి యేర్పడినట్లే లెక్క. తనకు మాట్లాడ్డం లోపమున్నదనీ, అది కష్టసాధ్యమైనపనిఅనీ, నిశ్చితాభిప్రాయం యేర్పడి, మాట్లాడడానికి భయం యేర్పడి, ఆ భీతితో మాట్లాడడమే మానివేసినప్పుడే నత్తి అనాలి. కచ్చితమైన, నిశ్చితములయిన అభిప్రాయములు లేనప్పుడు ఆ అభిప్రాయములు అభిజ్ఞులముందు వెల్లడించవలసినప్పుడు, చేసిన తప్పు బయటబడి శిక్షణ ధృవమని తోచినప్పుడు, సభా మధ్యంలో నిలబడ్డప్పుడు, అపాయం యెదురయినప్పుడు, ఏర్పడే మాటల తడబాటు నత్తికాదు అని ప్రతివారూ గ్రహించాలి.

నత్తి : పిల్లలకూ పెద్దవారికీ ఉండే సంబంధం : పిల్లలకూ పెద్దవారికీవుండే సంబంధం, విపరీతమయిన భయకారణమైనదో అనుమానాస్పదమైనదో అయినప్పుడు మాటలాడడంలో సంకోచం విధిగా యేర్పడుతుంది. ఏ మంటానికీ భయం యేర్పడుతుంది. భయమూ, సంకోచమూ నత్తికి తల్లి దండ్రులు. మాటల్లో లోపాలున్న సవరణకు పూనుకుండేవారు పిల్లల అనురాగాన్నీ విశ్వాసాన్నీ చూరగొనకపోతే నత్తి, మాటల తడబాటూ, సభాభీతి పిల్లల్లో యేర్పడడానికి చాలా అవకాశం వుంటుంది.

నత్తి : అనుకరణ (Imitation)

చిన్న వయస్సులో నత్తివారిని అనుకరించితే నత్తి రావడానికి అవకాశం వుంది. కాని పెద్దవారిలో పనిబెట్టుకుని నత్తివారిని అనుకరించినంతమాత్రాన నత్తి యేర్పడడానికి కారణంలేదు. రోజూ నత్తి వారి పాత్రలను నిర్వహించేనటీ నటులలో నత్తి యేర్పడకపోవడానికి యిదే కారణం. కాని నరముల బలహీనత ఏర్పడి అవయవములలో ఒణుకు యేర్పడ్డ తరవాత, పనిపెట్టుకునిచేసే ప్రతి అవయవ స్పందనం హానికరమే అవుతుంది. ఎడమచేయి ఉపయోగించడానికీ, నత్తికీ సంబంధంలేదు. వారి వీలునుబట్టి ఎవరికి ఏ చేయి ఉపయోగించడం వీలుగావుంటే ఆ చేయి ఉపయోగించడం వీలుగావుంటే ఆ చేయి ఉపయోగించుకొంటానికి ఆటంకం కలిగించరాదు.

మాటలాడడంలో పనిచేసే దేహభాగముల నిర్మితిలోనూ , ధర్మములలోనూ వుండే భేదములవల్ల నత్తి యేర్పడడంగానీ, నత్తిలో భేదములుగానీ యేర్పడతవా అని శాస్త్రజ్ఞులు పరిశీలించారు. కర్టిస్ అనే శాస్త్రజ్ఞుడు అలసటకు నత్తికీ సంబంధం వున్నదా అని పరిశీలించి, అటువంటిదేమీ లేదని తేల్చేడు. 'లవ్' అనే శాస్త్రజ్ఞుడు మనిషి నరముల ఉద్రిక్తతను ఉపశమించే మందులూ, నరములకు ఉద్రేకం కలిగించే మందులూ యిచ్చి వాటి ప్రభావం నత్తిమీద ఎల్లా వుంటుందో పరిశీలించి చూచేడు. కాని చెప్పదగిన భేదం యేదీ లేదని తేల్చేడు. నత్తికి ఏమైనా మందు లున్నవా అని చాలామంది వ్రాశారు. ఏదో వ్యాధికి నత్తి ఫలితమని తేలినప్పుడు తప్ప నత్తికని ఔషధములు సేవించడంలో అర్థంలేదు.

వెనుకటి వ్యాసములలో నరములకూ, కండరములకూ ఉన్న సంబంధం వివరించేను. నరాగ్రములు కండరములను అంటి వుంటవనీ, అతికి వుండవనీ చెప్పేను. ఈ కలయికను సైనాప్సు(Synapse) అంటారు. ఈ ప్రదేశంలో వ్యాధిగాని, ఉద్రేకంగాని యేర్పడ్డప్పుడు కండరములు సంకోచ వ్యాకోచములు స్వాధీనం తప్పడమో, క్రమం తప్పడమో యేర్పడుతుంది. మాటలాడడంలో పాల్గొనే కండరములలో యిటువంటి పరిస్థితి యేర్పడ్డప్పుడు నత్తి యేర్పడుతుందా అని విల్లియమ్సు అనే శాస్త్రజ్ఞుడు పరిశోధన చేశాడు. కండరము సంకోచం పొందినప్పుడు విద్యుచ్ఛక్తి ఉత్పన్నం అవుతుంది. కొన్ని సాధనములవలన ఆ విద్యుచ్ఛక్తిని కొలవచ్చును. ఆ రీతిగా కండరములు ఆరోగ్య స్థితిలో వున్నవో, అనారోగ్యస్థితిలో వున్నవో తెలుసుకోవచ్చును. ఈ వైజ్ఞానిక సత్యమును ఆధారంగా తీసుకొని దవడలలోఉన్న కండరములను, నత్తి వారిలోనూ, నత్తిలేనివారిలోనూ కూడా పరిశీలించి, కండరములలో విద్యుచ్ఛక్తి ఉత్పత్తి, నత్తివారిలోనూ, నత్తిలేనివారిలోను కూడా పరిశీలించి, కండరములలో విద్యుచ్ఛక్తి ఉత్పత్తి నత్తివారిలోనూ, మంచివారిలోనూ ఒకటేననీ, కాని నత్తివారిలో ఆ కండరముల సంకోచ వ్యాకోచములనుబట్టి ఉత్పత్తిఅయ్యే విద్యుచ్ఛక్తి యే మంచివారు నత్తివారిలాగా మాట్లాడినప్పుడూ ఉత్పత్తి అవుతూందనీ తేల్చుకున్నాడు. అందువల్ల, శరీరభాగముల నిర్మితీ ధర్మములలో లోపములు నత్తికి కారణములు కావనీ, అవి మాట లాడడానికి అవసరమయిన సంకోచ వ్యాకోచములకు కారణమైన మెదడు ఆ దేశములలో లోపమనీ తేల్చుకున్నాడు. అల్లాగే మెదడు భాగములలోఉన్న భాగములను కూడా పరిశీలించి, వాటి నిర్మితిలో లోపము నత్తికి కారణములు కావనీ, మెదడును ఆశ్రయించి వున్న మనస్సు దాని స్థితీ, అది కలిగించే భయం, కోపం దుఃఖం వట్టి ఉద్రేకములవల్ల మెదడు నుంచి వచ్చే ఆదేశములు మారి నత్తి యేర్పడుతున్నదనీ, ఇతర శాస్త్రజ్ఞులు తేల్చేరు. నత్తివారిలో నత్తిని గురించిన ఆందోళన పట్టింపు తగ్గిన కొద్దీ నత్తి తగ్గుతున్నదనీ, శాస్త్రజ్ఞులు పరిశోధనలవల్ల తేల్చేరు. ఎవరూ లేకుండా నత్తివారు మాట్లాడినప్పుడు యితరులతో మాట్లాడుతున్నప్పుడు వచ్చినంత నత్తి రాదు. అల్లాగే తమను చూచి నవ్వేవారో, జాలిపడేవారో, దుఃఖపడేవారో లేరని ధృవంగా తెలిసినప్పుడు వారిముందు మాట్లాడినా నత్తి అంతగారాదు. తమ మాట పొందికతో, యితరులను సంతృప్తి పరచవలసిన అవసరం ఉన్నప్పుడు, అటువంటి వారితో మాట్లాడుతున్నప్పుడు నత్తి అధికం అవుతుంది. అటువంటి భీతి లేనప్పుడు నత్తి అంతగా వుండదు. మామూలు భాషలోకంటె గ్రాంధిక భాషో, నాటకాల్లోవాడే భాషో మాట్లాడుతున్నప్పుడు నత్తి అంతగా వుండదు. నడుస్తున్నప్పుడూ, పదిమందితో కలిసి ప్రార్థన గీతంవంటిది అంటున్నప్పుడూ నత్తి మార్పు చెందుతుంది. కోపంతోనో, అత్యంతమయిన భీతితోనో మాట్లాడినప్పుడూ నత్తి మార్పు చెందుతుంది. "అయ్యో నత్తి

వస్తుందేమోనే" అనే భీతి లేకుండా మాట్లాడి నప్పుడు నత్తి రాదు.

నత్తివారు, ఒకే పుస్తక భాగమును వరసగా పదివారులు చదివితే, పోను పోను నత్తి తగ్గుతుంది. కాని ఎక్కువ మారులు చదివినకొద్దీ కొన్ని అక్షరములమీద కొన్ని మాటలమీద నత్తి మిగులుతుంది. ఆ నత్తి మామూలుకంటె అధికమవుతుంది. కాని పఠన పరిశ్రమవల్ల తగ్గిన నత్తి కొంత సేపయిన తరవాత వస్తుంది. ఈ ఫలితములన్నీ అందరిలోనూ ఒకే మాదిరిగా వుండవు. కాని యీ పరిశీలన లన్నీ నత్తి వాగవయవముల రోగగ్రస్తతవల్ల రావడం లేదని రుజువు చేస్తవి. అనేక పరిశోధనలవల్ల నత్తివారు, వరసగా, బిగ్గరగా చదవడంవల్ల, మాట్లాడడంవల్ల చాలా మేలు పొందుతారని శాస్త్రజ్ఞులు నిర్ణయించారు. ఆ చదవడం మాట్లాడ్డం తమకు తెలిసి, తాము భయపడని, ద్వేషించని శ్రోతలముందు మాత్రమే చేయడం ఇంకా లాభకరము.

మాట్లాడడం నాగరిక జీవితంలో ఒక కళగా జీవితావసరమైన జీవన క్రియగా తయారయింది. ఆటవికులలో నత్తివారు కనుపించరు. చిన్న పిల్లలు మాట్లాడడం నేర్చుకునేటప్పుడు తప్పు రాంగానే పెద్దవాళ్ళు గుడ్లెర్రజేసి, పిల్లలకు తప్పు మాట్లాడేమనే అభిప్రాయం కలిగించడం నత్తికి చాలా ముఖ్యమయిన కారణం. పిల్లల్లో నత్తి రాకుండా చూడవలసిన బాధ్యత చాలావరకు తల్లి దండ్రులమీద వున్నది. పెద్దవారిలో నత్తి రాకుండా చూచే బాధ్యత వారితో తిరిగే స్నేహితులదీ, తర్వాత వాగ్రోగ నిపుణులది.

పెద్దవారిలో నత్తి నివారించడానికి చాలా రకములయిన పరిశోధనలూ, ప్రయోగములూ జరిగినవి. వీటివల్ల నత్తి పూర్తిగా నివారించగలమనే స్థితి యేర్పడలేదుగాని చాలావరకు తగ్గించవచ్చునని, ముందే జాగ్రత్త పడితే తగ్గించవచ్చుననీ, మానసికములయిన కారణములు యేర్పడకుండా చూస్తే నత్తి రావడానికి వీలుండదనీ తేలింది.

నత్తిని నివారించడానికి పూనుకొనేముందు, ఒక్కొక్క వ్యక్తిలోవుండే నత్తి స్వభావమును నిర్ణయించాలి. అందుకు కొన్ని విషయములు గమనించాలి.

1. నత్తి ఎంత తీవ్రంగావుంది? మాట్లాడే మాటల్లోనో, ఎన్ని అక్షరములమీద ఎన్ని మాటలమీద ఎంత వేగంతో నత్తి యేర్పడుతున్నది? టేప్ రికార్డింగ్ మెషిన్ ఇందుకు చాలా సహకరిస్తుంది. అయితే మొదట్లో నత్తివారి రికార్డు నత్తివారికి వినిపించరాదు. మనిషి అవయవ లోపములనో, వాగ్లోపములనో మన ఆనందానికీ, వినోదానికీ వినియోగించుకోడంకంటె రాక్షస స్వభావం ఊహించడం కూడా కష్టం.

2. మాట్లాడేప్పుడు వాగ్రోగి అనుభవించే ప్రదర్శించే ఉద్రేకములు ఏమిటి?

3. నత్తి ఆరంభమై ఎన్ని సెకండ్లు వుంటుంది.

4. ఒక నోటిలోనే నత్తి యేర్పడుతున్నదా లేక ఆ నత్తితో, కళ్ళు మూసుకోడం, రెప్పలార్పడం కనుబొమలు ఎగర వేయడం, పెదిమలు అదరడం పూపిరి బిగబట్టడం అనవలసిన శబ్దంకాక ఆ శబ్దంతో ఇతర అను శబ్దములు, ఇవికాక చేతులు శరీరం వణకడం ఇటువంటి లక్షణములు ఉన్నవా.

5. తన నత్తినిగురించి రోగి ఏ వైఖరి అవలంబిస్తున్నాడు! (?) అందుకు భయపడుతున్నాడా, సిగ్గుపడుతున్నాడా ఇది నా కర్మ ప్రభావమని వేదాంతభావంతో వున్నాడా? 'నా జన్మ దీనితో నిరర్థకం నేను చచ్చిపోతే మంచిది' అనే ఆత్మ నాశనకరమైన వైఖరిలో ఉన్నాడా? లేక తన నత్తికి తనే ఆనందిస్తూ, ఇతరులను వినోదపరుస్తూ, లెక్క లేకుండా ప్రవర్తిస్తున్నాడా? నత్తి వారిలో యీ విధంగా ఎన్నో రకాలవారు ఉంటారు. ఈ విషయములను తేల్చుకుంటానికి నిపుణులు, చాలా ఔక్యమూ, చాకచక్యమూ, దయా, సానుభూతీ ప్రదర్శించాలి. అందుకు కావలసిన అవకాశాలు సృష్టించుకోవాలి. వ్యవధి తీసుకోవాలి. ఈ పై విషయములు గమనించినందున నత్తి ఎంత తీవ్రంగావుందో, ఎంత నివార్యమైనదో ఎంత ప్రమాదకరమైనదో తేల్చుకోటానికి వీలుంటుంది.

ఆ తర్వాత నిర్ణయించవలసింది నత్తి వున్న మనిషికి తను కలిసి తిరిగేవారి విషయంలోనూ, ఇతరులతోనూ ఏ వైఖరి అవలంబిస్తున్నాడు, అన్న విషయం. నత్తివారు ,ఇతరులను చూచి భయపడవచ్చు. ద్వేషించవచ్చు. అపనమ్మకంతో చూడవచ్చు. కోపగించుకోవచ్చు. ఇల్లాకాక అతిగా నమ్మవచ్చు. కొందరితో స్నేహభావంతో వుండవచ్చు. అతనికున్న స్నేహితులు, పరిచయస్తులు, చేసిన చేసేపనులు అప్పుడు ఏర్పడే పరిసరములు, చదువు, ఆటపాటలు, ప్రేమ కలాపములు, కళాపరిజ్ఞానం తన వ్యక్తిత్వాన్ని వెల్లడించడానికి అతనుచేసే కృషి అవలంబించే విధానములు,—(కవిత్వం చిత్రలేఖనం) ఫొటోగ్రఫీవంటి హాబీలు, ఆ హాబీలలో అతను నలుగురితోచేరి తన సరదాలు తీర్చుకుంటాడా లేక ఏకాంతంగా ఏదోమూల కూర్చుని తన వినోదం తను పొందుతాడా? ఇటువంటివన్నీ గమనించాలి.



తర్వాత తన విషయంలో అతనికి ఎటువంటి అభిప్రాయము లున్నవి? తను వ్యర్థుణ్ణనీ, చేతకానివాణ్ణనీ, అవిటి వాళ్ళనీ నిరుత్సాహం పొంది తన సమర్థతలను శక్తులనూ విస్మరించి తన లోపములను మాత్రమే ఎన్నుకుంటూ జీవితంమీద విరక్తి పొందుతున్నాడా, లేక "నేను మాట్లాడలేకపోతేనేం, నాకు యితరులకులేని యిన్ని గొప్ప శక్తులూ లక్షణములూ వున్నవి. వీటితో నేను నా జీవితాన్ని విజయప్రదమూ, సుఖప్రదమూ చేసుకోగలను. అనే ధీమాతోవున్నాడా? స్కూలుకు పోయే పిల్లల్లో గమనించదగ్గ విషయాలు కొన్ని వున్నవి. బడికి పోవడం బిడ్డకు ఇష్టమేనా? మేష్టరంటే ఇష్టమా, భయమా, ద్వేషమా, ప్రేమా చదువుమీద అనక్తి శ్రద్ధా వున్నవా? తన తోటి పిల్లలంటే యిష్టమా, ద్వేషమా వారు యీ నత్తిబిడ్డను ఎల్లా చూస్తారు. ఏడిపిస్తారా? ప్రోత్సహిస్తారా? మార్కులు బాగా వస్తవా తెలివి తేటల్లో లోపం వున్నదా? జ్ఞాపకశక్తి ఎట్లా వుంది? ఇవన్నీ తెలుసుకోవాలి.

ఆ పిల్లల యింటిపరిస్థితు లేమిటి? తల్లి దండ్రులంటే బిడ్డకు భయమా, ప్రేమా? వారితోనూ ఇతర సోదరులతోనూ యీ బిడ్డ చనువుగా కలిసి మెలిసి వుంటుందా? లేక తన దారిన తను ఒక మూల కూచుంటుందా? తల్లి దండ్రులు ఆ బిడ్డ వయస్సునుబట్టి ఆ బిడ్డకు యివ్వవలసిన స్వేచ్ఛ యిస్తూ, తిరగనిస్తున్నారా, లేచి బయటికివెళ్తే పడిపోతావు. మూలకువెళ్తే తేలు కరుస్తుంది, ఇది తింటే జలుబు చేస్తుంది, అది తింటే కడుపు నెప్పి వస్తుంది అంటూ అనుక్షణమూ పిరికి మందునే పోస్తున్నారా? ఇంట్లో తల్లి దండ్రులూ యితర పెద్దలూ కొట్లాడుకుంటున్నారా, ద్వేషించుకుంటున్నారా, ఆ ద్వేషాలు యీ బిడ్డ మనస్సుమీద ఎల్లా పని చేస్తున్నవి. ఇవన్నీ గమనించాలి. తరవాత నత్తివారి దేహ పరిస్థితిని పరిశీలించాలి. తినే ఆహారం, అందులో విటమినులలోపం ముఖ్యంగా బికాంప్లెక్సు లోపం 'ఎ' 'సి' విటమిన్ల లోపం వుందా తెలుసుకోవాలి. పరిపూర్ణమయిన శారీరక పరీక్ష చేసి సరియైన నిర్ణయానికి రావాలి.

ఇవన్నీ తెలుసుకున్న తరవాత, రోగి తన రోగ నివారణకు ఎంతగా మోజు పడుతున్నాడు. చికిత్సతో సహకరిస్తున్నాడా, నిరాకరిస్తున్నాడా! చికిత్స దీర్ఘకాలం సాగవలసివస్తే రోగి కున్న వీలు ఎంత, పరిసరములు మార్చవలసిన అవసరంవుంటే మార్చడానికి వీలున్నదా? తెలుసుకోవాలి. రోగికి ఏ పసరో తాగితేనో, ఏ తాయెత్తు కట్టుకుంటేనో, ఏ బైరాగినో ఆశ్రయిస్తేనో ఈ నత్తి పోతుందనే భావన వుండి, ఆధునిక విధానాల మీద అసహ్యం అపనమ్మకం యేర్పడివున్నదా? తన జాతకలోపంవల్లనో, కర్మ లోపంవల్లనో యిది అనివార్యము అనే నిశ్చయం ఏర్పడివున్నదా? ఇవన్నీ గమనించాలి. నత్తి, అతి మానసిక కారణములవల్ల యేర్పడే వాగ్లోపం, వ్యక్తి మనస్సుకీ, పరిసరాలకీ, వైఖరికీ నత్తి నివారణకూ చాలా సంబంధం వున్నది. మూగ వారికి మూగవారమనే బాధకంటె, అంధులకు అంధులమనే బాధకంటే, చర్మ వ్యాధితో బాధపడేవారికి ఆ వ్యాధివల్ల కలిగే బాధకంటె, నత్తివారికి నత్తివారమనే బాధ చాలా అధికం కావడానికి అది శారీరక వ్యాధికంటె అధికం మనో జనితమైన వ్యాధి కావడమే ఎక్కువగా కారణం. శారీరక వ్యాధులకంటె, మానసిక వ్యాధుల నివారణ చాలా కష్ట సాధ్యమయినది. అందులో నత్తినివారణ శ్రమతో, నైపుణ్యంతో, ఓర్పుతో, వ్యయ ప్రయాసలతో కూడుకున్నది. ఆ చికిత్సావిధానములు నూటికి నూరుపాళ్ళు జయప్రదములుగా ఇంకా పరిణమించలేదు. కాని నత్తి అందరిలోను అనివార్యమయిందీకాదు, నిరాశా జనకమైనదీ కాదు.

(సశేషము)



పొరపాటు

ఇసుకపల్లి దక్షిణామూర్తి

విమల ప్రేమకోసం రమణ, జోగారావు లిద్దరూ పోటీపడ్డారు. విమల తను రమణ జీవితంలోనికి అనవసరంగా తొంగిచూస్తోందా, అనుకున్నది.

విమల పది గంటల బండికి వస్తోందని తెలిసి రమణ తొమ్మిది గంటలకే స్టేషను చేరాడు. ఆ గంటసేపు ప్లాటుఫారంమీద గడపటం చాల కష్టమైంది. పుస్తకాల దుకాణం దగ్గర, కిళ్లీకొట్టు దగ్గర పచార్లు చేస్తూ నిలబడ్డాడు. ఏ రైలు కూత కూసినా, ఏ గార్డు విజిలు ఊదినా, ఏ గూడ్సుబండి కదిలినా విమలే వస్తోందని నాగరాజు కోసం మల్లీశ్వరిలా 'కన్నుల సిరిడి' కలయ చూస్తూ నిలబడ్డాడు.

బండీ అరగంట లేటని తెలిసింది. దానితో రమణకొ మరీ చికాకు ఎత్తింది. మళ్లీ ఆఫీసుకు పోవాలి. బండి తొందరగా వస్తే బాగుండును అనుకున్నాడు. కాలక్షేపణకోసం మాగజైను కొన్నాడు. అందులో ఏ కథమీద అతని మనసు లగ్నం కాలేదు. పుస్తకం మూసేశాడు. టీ తాగాడు. కిళ్లీ వేసుకున్నాడు. కిళ్లీ నములుతుంటే పొరపాటున నోట్లోనుంచి 'అమృతం' జారి బుష్‌కోటు మీద పడింది. తెల్లటి బుష్‌కోటుమీద ఎర్రటి చుక్క. చెరపబోయాడు. మచ్చలాగా అయింది. ఆపూటే ఇస్త్రీ చేసిన బట్టలు ప్రత్యేకంగా వేసుకువచ్చాడు. అదొక్కటి ఒకటే అతని దగ్గర ఉన్నది. ఆఫీసు కయితే మాసిపోయిన బట్టలతో వెళ్లేవాడే. విమల వస్తోందని ఈ బట్టలు తీశాడు. మళ్లా వారం రోజులుదాకా ఆ బట్టలతోనే ఉండాలి. దానికి తోడు ఈ కిళ్లీతో ఎర్రటి మచ్చ గూడా పడింది. విమల చూసి నవ్వుతుందేమో ! అప్పుడు ముఖం చిట్లించుకోగూడదు.

'చంద్రబింబంలాంటి నీ ముఖంమీద బొట్టు ఎంత అందమో ఇదీ .... అంతే .... ' అందా మనుకున్నాడు.

విమల తన వాక్చాతుర్యానికి మెచ్చుకుంటుంది.

అప్పుడు తను విమల వంక చూసి 'అదో రకంగా' నవ్వాలి. నవ్వచ్చు. కాని ....

విమలతోబాటు ఆమె తల్లి గూడా వస్తోంది. ఏమన్నా అనుకుంటుందేమో ! మరి ఇంకేదైనా సమాధానం చెప్పాలి. లేకపోతే ఆ మచ్చను చూడనట్లు నటించాలి. పక్క నిలువుటద్దంలో తన ప్రతిబింబాన్ని చూసుకున్నాడు. అంతపెద్ద మచ్చ కనపడుతుంటే తను చూడనట్లు ఎట్లా ఊరుకుంటాడు ? ఇంటిదగ్గరకు పోతే వేరే చొక్కా గూడా లేదు. పోనీ మాసిన చొక్కా తొడుక్కుంటే ! మచ్చ లేదుగా ! టైమేదీ .... బండి వచ్చేస్తూ ఉంటుంది. అద్దంలో మళ్లీ చూసుకున్నాడు. మచ్చ మరీ పెద్దదిగా కనిపించింది. జుట్టు రేగిపోయింది. జేబులో దువ్వెన లేదు. వేళ్లతో జుట్టు సరిచేసుకున్నాడు. సంతృప్తి కలగలేదు. పావలా పెట్టి దువ్వెన కొన్నాడు. తల దువ్వుకున్నాడు.

ప్లాటుఫారంమీద గంట కొట్టారు. అతని గుండె దడదడ లాడింది. దూరాన సిగ్నలు అవతల పొగ కనపడింది. విమల ఆ బండీలో కూర్చుని పరుగు, పరుగున తన దగ్గరకు వస్తోంది. తన హృదయం ఆమె దగ్గరకు చేరాలని ఆరాట పడుతోంది. ఎక్స్‌ప్రెస్ అంటే బోలెడన్ని పెట్టెలు. ఏ పెట్టెలో కూర్చున్నదో ! కొంచెం ముందుగా పోయి అన్ని పెట్టెలు చూస్తే సరి. ప్లాటుఫారం మీదకు బండి పెద్ద పెట్టున చప్పుడు చేసుకుంటూ వచ్చేస్తోంది. రమణకు వక్కసారిగా తన నెవరన్నా చూస్తున్నారేమో నన్న సందేహం కలిగింది. చిరు చెమట పట్టింది, ఈ సమయంలో ఆ ఆలోచన లన్నీ ఎందుకు ? ఛీ .... అనుకున్నాడు. విమలను వెతుక్కుంటూ పెట్టె లన్నిటినీ వెయ్యి కళ్లతో చూడటం ప్రారంభించాడు.

బండి ఆగింది. రమణ హృదయచలనం గూఢా ఆగినంతపనయింది. తనదగ్గరనుంచి రెండో పెట్టెలో....విమల మెల్లిగా దిగుతోంది. వెనకాలగా దిగుతున్న నడివయస్సు స్త్రీ ఆమె తల్లి కావచ్చు. జనాన్ని తోసుకుంటూ వాళ్ల దగ్గరకు పోయి పడ్డాడు. విమల ఇతన్ని చూసి ఆశ్చర్యం ప్రకటించింది. 'ఓ .... మీరు వచ్చారా .... ' అంది. రమణ గొంతు ఆరిపోయింది. వాళ్లిద్దరినీ నవ్వించేట్లుగా ఏదన్నా హాస్యంగా సమాధానం ఇద్దామనుకున్నాడు. సరియైన మాటలు దొరకలేదు.

"అమ్మా .... నేను ఆఫీసులో చేరటంలేదూ.... రమణారావుగారని .... అక్కడే పనిచేస్తుంటారు...' అంటూ తల్లికి ఆయన్ని పరిచయం చేసింది. రమణ నమస్కరించాడు. ఆమె తెల్లబోయి, "తన కంటె చిన్నవాడైన అతనికి నమస్కరించాలా, వద్దా అన్న విషయం తెముల్చుకోలేక చేతులు కలిపి కిందకు వదిలేసి, ముఖం వికారంగా నవ్వుతున్నట్లు పెట్టి 'ఆహా .... అట్లాగా' అంటూ నసిగింది. రమణ అప్పటికీ గొంతు విప్పలేదు.

"మీరు వచ్చారు కాబట్టి సరిపోయింది .... ఇంత సామానుతో ఇంటికి చేరటం ఎట్లాగా అని భయపడుతున్నాను" అంది విమల. రమణ పరిస్థితి మరీ అధ్వాన్నంగా తయారయింది. తను ఈ సామాన్లన్నీ మోసుకుపోవటానికని వచ్చాడా ? ఆ మాటకి సమాధానం దొరకలేదు.

'అబ్బే .... దానికేం .... ' అన్నాడు.

'కూలీ .... ' అంటూ విమల కేక వేసింది. ఇద్దరు, ముగ్గురు కూలీలు వచ్చారు. సామానంతా చూపింది. అంతా స్టేషను బయటకు వచ్చారు. రమణ కూలీ డబ్బు రెండు రూపాయలు ఇచ్చేశాడు. విమల అక్కడ లేకపోతే తను బేరం చేసి రూపాయికి అంత సామానుకుదిర్చేవాడే ! కిమ్మనకుండా రెండు రూపాయలు ఇచ్చేశాడు ఇప్పుడు.

'మీకు రెండు రూపాయలు వదిల్చాను' అంది విమల. రమణ ముఖం మరొక్కసారి పాలిపోయింది. "విమల 'థాంక్సు' అంటుంది. 'ఆ .... ఈమాత్రాని కేమిటిలెండి' అందా మను కున్నాడు రమణ.

'ఆ వదిల్చే దేమిటి .... కూలి ఇవ్వద్దా' అన్నాడు. ఆ మాట అతని చెవులకే కర్కశంగా వినిపించింది. విమల ఏమనుకుందో ! ఆమె ముఖంలో ఎటువంటి మార్పులు కనపడలేదు

విమల బాగా అలిసిపోయినట్లు ఉంది. ముఖం వాడిపోయి ఉంది. రేగిపోయిన జుట్టు, నలిగిపోయిన బట్టలు. రమణ కవేమంత కనపడలేదు.

విమల ఈ వేషంలో గూడా ఎంత అందంగా కనపడుతోంది ! అనుకున్నాడు.

రిక్షాలు మాట్లాడాడు.

విమల ఇల్లుచేరింది.

భోజనాలు ముగించుకున్న తర్వాత, విమల ఆఫీసుకు బయలుదేరుతూంటే 'కొత్తచోటు .... జాగ్రత్తమ్మా' అని చెప్పింది విమల తల్లి యశోద. విమల నవ్వేసి వెళ్లిపోయింది.

రమణ ఆఫీసులో కనపడ్డాడు. విమల నమస్కరించింది. తన కయిన పరిచయంతో, ఆడపిల్లకు ఇంక నమస్కారం పెట్టే అవసరం లేదనుకున్నాడు రమణ. 'రండి .... రండి .... ' అన్నాడు. విమల నవ్వుతూ వచ్చింది. నవ్వట మనేది విమల ప్రకృతిలోనే ఉందనిపిస్తుంది. ఆమె సోగకళ్ళు, చెక్కిళ్లు, పెదిమలు, సన్నగా తేలిన ముక్కు.... అన్నీ నవ్వుతున్నట్లుగానే ఉంటాయి. రమణకు మాత్రం ఆ నవ్వులో అనేకమైన అర్థాలు. అంతరార్థాలు.

'ఏమండీ .... ఆఫీసు వాతావరణం ఎలా ఉంది' అని అడిగాడు. 'అంతా కొత్తగా ఉంది .... ' అంది విమల.

'మీకేమన్నా తెలియకపోతే నన్నడుగుతూ ఉండండి' అన్నాడు రమణ. 'ఏ విషయంలో' అంటూ నవ్వింది విమల.

ఇదే అదను అనుకున్నాడు రమణ తన పురుషత్వం చూపించుకోవటానికి. 'ఏ విషయంలోనైనా సరే' అన్నాడు. విమల ఏమిటో అర్థం చేసుకున్నట్లుగా తలవూపి వెళ్లిపోయింది.

రమణ ఆ సాయంత్రం విమల ఇంటికి వెళ్లాడు. విమల ఇంట్లో లేదు. కూరలు తేవటానికి పోయింది. యశోద లాంతరు వెలిగిస్తోంది. 'రా నాయనా' అంటూ పిలిచింది. 'ఆ పీటమీద కూర్చో బాబూ' అంది.

రమణ విమలకోసం గాలించటం యశోద కనిపెట్టి 'మగదిక్కులేని సంసారం నాయనా .... సిగ్గు విడిచి దాని రెక్కల కష్టంమీద బ్రతకటానికని వచ్చాను...నాకు చావైనా రాదు .... ' అంది. లాంతరు వెలుతురు గది అంతా వ్యాపించింది. యశోద కళ్లల్లో మెరమెర చూచాడు రమణ.

'అసలు సంధ్యవేళ ఆ వేం మాటలండీ' అన్నాడు.

'నా అదృష్టానికి ఇంకా ఎటువంటి మాటలు వస్తాయి నాయనా .... అదుగో...వస్తోంది' అంటూ వాకిట్లోకి చూసింది యశోద.

విమల సంచినిండా కూరలతో వస్తోంది.

'ఎప్పుడు వచ్చారు .... '

(44-వ పేజీ చూడండి)

వేమూరి సత్యలక్ష్మి

చిలకా గోరింకా

అన్యోన్యంగా ఉంటున్న ఆలుమగల్లో కూడా చిరుచిరు కోరికలు కొన్ని ఉంటూ ఉంటాయి. భార్యా భర్తలు అనురాగంతో ఉన్నా అప్పుడప్పుడు ఆ చిరుచిరు చెలిమి తొంగిచూసి కాస్త నిరుత్సాహం కలిగించక మానదు. ఇల్లాలు సర్దుకుపోయే తత్వం గలదైతే రెండోవారికి తెలియకుండా సంసారం సాఫీగా సాగిపోతుంది. లేకపోతే అప్పుడప్పుడు ఎండాకాలపు సుడిగాలిలా చిన్నదైనా దుమారం లేచి కొంచెం గలాటా చేస్తుంది.

మమ్మల్నిద్దరినీ చూసి మా స్నేహితులు చిలకా—గోరింకల్లాంటి దంపతులు అంటూఉంటారు. కాని కొన్ని విషయాల్లో మాత్రం ఆ ముచ్చటైన మాట మాకు వర్తించదేమో ననిపిస్తుంది. అసలు అంతదాకా ఎందుకు! ఈమధ్య పత్రికలో "మగవారికి మాత్రమే" అని ఒక శీర్షిక పడింది. దాంట్లో వచ్చిన మార్కుల్ని బట్టి చూస్తే మావారి సంగతి యిట్టే తెలిసిపోయింది. అంత తక్కువా తనలాంటివారు భర్త గావడం నా అదృష్టమని గర్వపడేవారు. అసలు ప్రేమవివాహాలెందుకు పెద్దవాళ్ల మిటర్ ఉంటే ప్రేమించి పెళ్లి చేసుకున్నాం అనేవా ళ్లందరికీ ఎంతెంత ప్రేమలు ఒలికిపోతున్నాయో పేకప్పుల్లో తెలిసిపోతుంది.

పాపం! మావారు చాలా విషయాల్లో మంచివారనే చెప్పాలి. శ్రీమతితో సినిమా కెళ్లాలంటేనే పెద్ద చిక్కొచ్చి పడుతుంది శ్రీవారికి. వాళ్ల స్నేహితులు "ఆడవాళ్లతో సినిమా ఏమిటోయ్!" అని ఎగతాళి చేస్తారుట. వాళ్లలో ఒక బుద్ధిమంతుడు భార్యను సినిమాహాలు దగ్గర దింపేసి మళ్లా సినిమా పూర్తయినవేళకు వెళ్లి తీసుకు వస్తాడుట: మా అన్నయ్య లాగు. పదిన వస్తానంటే నేను కున్న సినిమా ప్రోగ్రాం మానేస్తాడు. మావారు నన్ను సినిమాకి తీసికెళ్తామని రెండు, మూడు సార్లు ప్రోగ్రాం వేశారు. అంతలోకే వాళ్ల స్నేహితులు లేక కొంప మునిగే పనులు ఉన్నాయని ముంచుకు పోయినట్టు లొక్కుపోయేవారు. తీరా ఇంటి కొచ్చాక ఆ పనేమిటని అడిగితే కొత్తగా తెరచిన హోటలు కెళ్లామని, లేకపోతే వాళ్ల మిత్రుడి దానమరిది రైల్లో వెళ్తుంటే మా స్టేషన్లో ఆ రైలు ఆగే రెండు నిమిషాల్లో అతన్ని పిలవడానికి వెళ్లామనీ జవాబులు వినవచ్చేవి. రెండు, మూడు సార్లు ఇలా జరిగాక నా ఉత్సాహం చప్పబడి పోయింది. మరోసారి సినిమాకి రమ్మంటే నేను రాకపడంతో మావారికి కోపం వచ్చి రెండు రోజులు మౌనం పోట్లాట నిరసనదీక్ష వగైరాలు జరిగాయి.


ఆఫీసునుంచి పెందరాళే ఇంటికొచ్చే అలవాటు కూడా వారికి లేదు. మొగవారికి ఇల్లంటే బందిఖానాలా ఉంటుంది. పొద్దుట్నుంచి వెళ్లి ఏం చేస్తాం అనుకుంటారు. ప్రొద్దుట్నుంచి పని పాటలు చేసి సాయంత్రం ఒక ప్రేమైక హృదయం తనకోసం ఎదురుతెన్నులు చూస్తూ ఉంటుందని ఏ కొద్దిమందో గాని అనుకోరు. వాళ్ల ఆఫీసులో కష్టపడి పోతున్నట్టూ, ఆడవాళ్లు ఇంట్లో తిని కూర్చుంటున్నట్టూ అనుకుంటారు. మా చిన్న బాధ ఆడవాళ్లకి మనసులు ఎక్కువ. వంటింట్లో [illegible] మగవారి మనసులు గబగబా దుమ్ము దులిపి వారు తీరుస్తారు. ఆడవాళ్లు కయితే కష్టపడి చేసుకొందే రావు గనుక వాళ్ల కోరికలు బయట పడుతూ "ఉంటాయి" అంటుంది. అనవి కాబోయే మరదల్ మా చెల్లెలు.

మా పక్కవీధిలో ఒకాయన ఉన్నారు. ఆయన తరుచు క్యాంపులకు వెళ్తుంటారు. ఆయనకి రెండో పెళ్లి. భార్య చాలా చక్కగా ఉంటుంది. క్యాంపుకి వెళ్లడమంటే ఉద్యోగధర్మం తప్పదు. ఇంట్లో ఉన్నప్పుడయినా ఆ మహానుభావుడు భార్యతో నో మాటా మంచీ ఏమీలేదు. రెండవ ఆట సినిమాలు—క్లబ్బులూను. ఆవిడకి భర్తతో షికారు కెళ్లాలని, భర్త తన కోసమని పువ్వులు తేవాలని ఏవేవో ఉంటాయి. ఆయనకి అటువంటి ధోరణే ఉండదు. ఏదో సంసారం సాగిపోతున్నా అటువంటి దంపతుల్లో రసవత్తర ఘట్టాలు ఉండవు.

మా 'పిన్ని' ది పెద్ద సంసారం. సంపాదన సామాన్యమయినా పిన్ని పొదుపుచేసి ఇబ్బందిలేకుండా నెట్టేస్తుంది సంసారం. ఆమెకి తనకి ఉన్నదీ, లేనిదీ రెండోవారికి తెలియకూడదన్న పద్ధతి. కాని 'బాబాయి' ఉన్నాడే ఇంటి గొడవంతా వీధిలోకి విప్పదేలా అరుస్తాడు. ఇంకా పిన్నికి కూడిక చెయ్యడం రాదని లేకపోతే రాజధాని నగరంలో నో భవనం నిర్మించేవాడినని అంటాడు. ఇంక పిల్లల్ని నాలుగు తన్నకుండా ఏపని చేయించుకోవడం ఆయనకు చేతకాదు. భోజనం దగ్గర పెట్టే వంకలకి అంతే లేదు. పిన్ని దేనికీ బదులు చెప్పదు. గాబట్టే సరిపోతుంది. లేకపోతే రోజూ చిన్న వార్ లేస్తుంది ఆ యింట్లో. అన్నింటికీ సర్దుకుపోవడం అలవాటయినా కొన్ని చిన్న చిన్న సరదాలు తీరలేదని బాధపడుతుంది పిన్ని. గుమ్మాలకి ఎంబ్రాయిడరీ కుట్టిన తెరలు కట్టాలనీ, మిషన్ నేర్చుకుని పిల్లలకి స్వంతంగా బట్టలు కుట్టాలనీ, డ్రాయర్ మీద ఫ్లవర్‌వాజ్ లో పువ్వులు పెట్టాలని ఎన్నో అనుకుంటుంది. కాని బాబాయి దృష్టిలో తెరలు కట్టుకుంటే షోకులు, ఫ్లవర్‌వాజ్ లో పువ్వులు పెట్టుకుంటే దొరసానులూను.

అన్నేళ్ళ కాపురం చేసినా అమ్మకి ఒక్క సరదా తీరలేదు. అమ్మకది పిల్లలకి రకరకాల చీరలు కొని తెమ్మని ఒక్క రవికెల గుడ్డయినా కొనేవాడు కాదుట నాన్న. తాతయ్య ఎంత ఐశ్వర్యవంతుల బట్టలు కొని యిచ్చినా నాన్న ముచ్చటగా తనకోసం ఏదయినా కొనాలని అమ్మకి ఉండేదిట. నాకు జ్ఞానం తెలిశాక కూడా నాన్న ఏవూరయినా వెళ్తే అందరికీ అన్నీ పట్టుకొచ్చేవారు గాని అమ్మ కోసం ఏ చిన్న వస్తువయినా పట్టుకొచ్చేవారు కారు.

ఇలాగే చాలామంది అన్యోన్యంగా కనబడే దంపతుల్లో ఈ చిన్న—చిన్న అసంతృప్తులు ఉండిపోయి ఉంటాయి దీపం క్రీనీడల్లా. ఇవి ఆడవారికి సహజంగా బాధ కలిగిస్తాయి. దంపతులు [illegible] వాళ్లు ఎంత చిన్న కోర్కెలయినా అర్థం [illegible] వాలి.



ఏమండోయ్! కాస్త కదలకండి. అద్దం కనపడలేదు. క్లిప్పు పైకి అయింది.

యం. వి. హరికృష్ణన్. (హైదరాబాదు.)



వనితా వాణి

స్త్రీలు-ఆర్థికస్వాతంత్ర్యము

సి. కృష్ణకుమారిగారు వ్రాసిన "స్త్రీలు—ఆర్థిక స్వాతంత్ర్యం" అను వ్యాసము చాలా బాగుంది. ప్రస్తుతము సామాన్య కుటుంబముల లోని స్త్రీలకు డబ్బు విషయములో గల బాధ లను చక్కగా వివరించారు. కొంతమంది మగవారికి చక్కని గుణపాఠము నేర్పునట్లున్నది.

కొల్లి బేబిసరోజిని (పాపవినాశనము)

* * *

స్త్రీలఆర్థికస్వాతంత్ర్యం గురించి సి.కృష్ణకుమారి గారి వ్యాసము చాలా బాగుంది, అనే కంటె వచ్చింది అనుట మేలు. కానీ ఒక ధర్మసందేహం ఈ వ్యాసం కాలేజీ అమ్మాయిల దృష్టికి వస్తుందా అని. ఈ వ్యాసాన్ని మావార్ని చదువ మనగానే చదివేస్తూ రచయిత్రికి కృతజ్ఞతలు తెల్పమన్నారు. రెండేళ్లనుండి మావారు నాకు ఆర్థిక స్వాతంత్ర్యం ఇచ్చేశారు. ఇటువంటి వ్యాసములు మహిళల కంటె— మగవారికే చాల మంచిదిగా నున్నది. ప్రభుత్వం యొక్క ప్రణాళికలోని స్త్రీస్వాతంత్ర్యం సమాన హక్కు అనే వినాదములు, సఫలీకృత మగుటలో ఇసుమంతయు సందియము లేదు.

కె. అంపమ్మ (మరికల్లు)

* * *

"స్త్రీలు—ఆర్థిక స్వాతంత్ర్యం" అనే వ్యాసమును రచయిత్రి చాలా చక్కగా పొందికగా వ్రాశారు. వారు తమ వ్యాసంలో స్త్రీ పురుషుల మనస్తత్వాలను చక్కగా వివరించారు. రెండు వర్గాల వారికి బుద్ధి వచ్చేటట్టు ఉన్న ఆ వ్యాసం ఎవరి మనసు కష్టం కలిగించకపోవడంతో వారికి నా కృతజ్ఞత తెలుపుకుంటున్నాను.

సువర్ణరాణి (కాకినాడ)

* * *

సమిష్టి కుటుంబాలు

అకుండి శారదా రామశర్మ వ్రాసిన సమిష్టి కుటుంబాలు చాల బాగున్నవి. కాని ఇప్పటి కాలానికి అది పనికిరాదు. ఎవ్వరు చూచినా పెండ్లిళ్ళు కాకమునుపే వేరే ఉందాము అని చూస్తారు. అటువంటివారు సమష్టి కుటుంబాలుగా కలిసి ఉంటారా ? వారు వ్రాసిన సమష్టి కుటుంబాలు పూర్వకాలమువారికి. ఇప్పటివారికి కాదు. ఇప్పటి రోజులలో ఒకడు మూడు వందలు తెచ్చుకున్న ఒక్కరికి చాలదు అంటారు. అటువంటివారు కలిసిమెలసి ఎట్లా ఉంటారు చెప్పండి.

ఎం. సీత (అనకాపల్లి)

* * *

అకుండి శారదారామశర్మగారి "సమష్టి కుటుంబాలు" అన్న వ్యాసములో వలె మానవుడు "సంఘజీవి" సమష్టి కుటుంబములో జీవించాలి. కుటుంబములో అన్నదమ్ములు సమష్టిగా యుండ దలచిన, వివిధ వాతావరణములునుంచి వచ్చిన భార్యలవలన మన భారత దేశములో సమష్టి కుటుంబములు చెడిపోవుచున్నవి. కుటుంబములో అందరూ సహనము, సహృదయత, సంతృప్తి గల వారైనప్పుడే మనదేశములో సమష్టికుటుంబములు జయము పొందగలవు.

పంచాళి శుభరత్నం (భిలాయ్

* * *

అకుండి శారదారామశర్మగారు వ్రాసిన సమష్టి కుటుంబాలు వ్యాసం చాలా బావుంది. సామాన్యంగా సమిష్టి కుటుంబములలో జరుగు విషయములు ఉన్నదున్నట్లు వ్రాశారు. వారికి ఆంధ్ర పత్రికద్వారా ధన్యవాదా లర్పిస్తున్నాను.

అన్నదమ్మ లందరూ స్వచ్ఛమైన సోదర ప్రేమ కలిగి ఉన్నప్పటికీ ధనాదాయం హెచ్చు తగ్గుల విషయంలో కలతలు రేగి మనస్పర్థలు పెరగడం సామాన్యంగా ప్రతీ సమిష్టి కుటుంబములోనూ జరుగుతూంటుంది. ఓర్పు, సహనం స్త్రీలకు పెట్టనిసొమ్ములు. కుటుంబము ఒకటిగావడము, విడిపోవడం అంతా స్త్రీ చేతిలోనే ఉంది. అత్తా, కోడండ్రు ఒకటై ఒకే తల్లి బిడ్డలవలె మెలుగుతూ సహనంతో అన్నీ సర్దుకు పోయిననాడు, కలహాలు తలెత్తేందుకు ఆస్కారమే ఉండదు. గాని కుటుంబములో నుండు వందరకూ హెచ్చు తగ్గులు దృష్టిలోనుండి సహనం కోల్పోయి కావేశాలతో మనస్థిమితం చిక్కనప్పుడు శారదారామశర్మగారు వ్రాసినట్లు సమిష్టికన్నా వ్యష్టిగా నుండుటమే ఉత్తమం.

బి. సరోజినీదేవి (విజయనగరం)

* * *

గాజులు

మందరపు లలితగారు వ్రాసిన "గాజులు" అన్న వ్యాసం చాలా బావుంది. స్వాభావికంగా స్త్రీలకు గాజులపై గల ఆకర్షణ, అభిమానము ఉన్నది, ఉన్నట్టు వెలిబుచ్చారు. గాజులులేని స్త్రీ అంద విహీనంగా కనబడడంలో ఆశ్చర్యమేమీ లేదు. గాజులు స్త్రీలకు వన్నె తెస్తాయి. అవి వారికి అలంకారాలు.

డి. శకుంతల (ఉరవకొండ)

* * *

గాజులు వ్యాసం నన్నెంతో ఆకర్షించింది. సౌభాగ్యవతి చిహ్నాలలో మొదటిది గాజు. రెండవది పూస. ఆడపిల్ల పుట్టగానే గాజులు తొడుగు తుంది, తల్లి. ఆడపిల్ల లేనివారు మగపిల్లలకే గాజులువేసి, గౌనులు తొడిగి ఆ లోటు తీర్చుకుని అనిర్వచనీయమైన ఆనందము పొందే తల్లులు కూడా ఉన్నారు. పరశురాముడు యుద్ధానికి వస్తున్నాడంటే బ్రతుకు తీపిచే దశరథమహారాజు గాజులు తొడుక్కున్నా డంటారు. గాజుల మోజు లేని భారతస్త్రీ లేదంటే అబద్ధము కాదేమో ?

పేరి భానుమతీశాస్త్రి (చక్రధరపూరు)

* * *

రకరకాల గాజు లుంటాయని వ్రాశారు. అది ఎవరికీ తెలియని విషయమా ? ఆఖరి పేరాలో స్వర్ణకంకణం అని వ్రాశారు. అదేంటి ? ఎలా ఉంటుంది ? దాని ప్రాముఖ్యత ఏంటి ? ఆంధ్ర వనిత లందరు ఎదురుచూడాలని వ్రాశారు. ఎందుకు చూడాలి ?

మిస్ మహరుబ్, మిస్ దిల్‌షాద్ (బొబ్బిలి)

* * *

ఆధ్యాత్మిక విజ్ఞానం

చాలాకాలంనుంచి పత్రిక చూస్తున్నాను. ముఖ్యముగా మన వనితాలోకాన్ని ప్రత్యేకించి చూస్తున్నాను. ఎన్ని రోజుల నుంచి చూచినా భగవద్భక్తినిగురించి ఆధ్యాత్మిక వ్యాసాన్ని వ్రాసిన సోదరీమణులు నాకు కన్పించలేదు. సర్వతోముఖ వికాసాన్ని పొందే వనితాలోకం ఆధ్యాత్మిక విజ్ఞానానికి కొరవడిందా ? ఆ అగాధంలో దిగితే తిరిగి తేరుకోలేం, మన కెందుకని తప్పించుకు తిరుగుతోందా ? ఇది మన హైందవ స్త్రీలకు ముఖ్యావసరం కాదా ?

కనుక ప్రతివారం గృహజీవితంలో పురుషుడు స్త్రీ వగైరా వ్యాసాలతో విసిగించక నెల కొక మారైనా పత్రికాధికారులు, పాఠకులు ఇటువంటి ముఖ్యావసరమైన విజ్ఞానాన్ని వనితల కిచ్చి తద్వారా ఈవిధంగా కూడ విజ్ఞానవంతులను చేసి ఆనందింప చేయుమని కోరుచున్నాను.

శ్రీమతి అనిపెద్ది లలితాగాయత్రిశ్యామలరామం (జగన్నాథపురం)

* * *

మీ శీర్షికలో వేసే విమర్శలు రచనా స్థాయిని చూస్తారా ! లేక ఏవో కొద్దిపాటి విమర్శలే చూస్తారా అర్థం కావటంలేదు. కొందరు తమ పేరు పత్రికలో పడాలని తాపత్రయపడేవాళ్లకు లాటరీగా స్థానాలు యిస్తున్నారా ! వనితావాణి శీర్షిక దేనికిగా ఉపయోగించుకోవాలో తెలియటం లేదు.

శ్రీమతి డి. బి. టి. సుందరి (విశాఖపట్నం)

బంగారం - సింగారం - 'రాఖీ' చిత్రకథ -



బంగారం - సింగారం - 'రాఖీ' చిత్రకథ





మృత్యుంజయుడి పూర్వగాథ తెలిసిందనుకున్నారు. వారి ఊహ ఎంతవరకూ నిజం ?

(గతవారం తరువాయి)

"అయితే ఇంతకీ మీ రనే దేమిటి ?" మునసబు ప్రశ్నించాడు.

"ఇంతకీ వాడే వీ డంటారేమిటి ?" ఆ మాటను కరణం పూర్తిచేశాడు.

"అనడానికి ప్రయత్నిస్తాను" రాఘవేంద్ర కుర్చీచేతిమీద ముక్తాయింపు వేశాడు. మునసబు కరణాలు 'కోరస్ జాతి' నవ్వు నవ్వారు.

"భలేవాడివయ్యా, తలతిక్కమనిషి ! నువ్వు ఎనిమిది వందల సంవత్సరాలనాటి మనిషి ఈ పసికుర్రాడు అంటావు ? బుర్ర ఉపయోగించద్దూ ? ఊ .... నిండా ముప్ఫయి యేళ్ళు లేనివాణ్ణి పట్టుకుని ఎనిమిదివందల ఏళ్ళనాటి వాడంటావే ? భలే" అన్నాడు మునసబు నవ్వుతూ. "భలే ! భలే !" అన్నాడు కరణం మిగతా రెండు 'భలే' లనూ భర్తీచేస్తూ. రాఘవేంద్రకు చిర్రెత్తిపోయింది. ఓ పుస్తకం క్రింద నుంచి తీస్తూ అందులో ఒక పేజీ తీశాడు. తనకు కావలసిన పేజీలు చకచకా తిరగేశాడు. "ఇదిగో ! అతని పేరు" అన్నాడు. ఇదిగో ఊరు పేరు..."చూడండి. నమ్మకపోతే, నాది నేరం కాదు" అంటూ పుస్తకం మునసబుచేతిలో పెట్టాడు. మునసబు పుస్తకంలోకి చూడకుండానే "అది సరేనయ్యా ! నీ గ్రంథం తప్పనటం లేదు. ఆనాటి వ్యక్తీ, ఈనాటి వ్యక్తీ ఒక్కడే ఎలా అవుతాడు అన్నది మా ప్రశ్న" అన్నాడు ప్రశ్నార్థకంగా కరణం కేసి చూస్తూ. "అవును. అదే" అన్నాడు కరణం లయగా.

"అతనే ఇతనని నేను అనటంలేదు. కానీ ఆ సంఘటనలూ, ఈ సంఘటనా ఒకలాగానే ఉన్నాయి అన్నాను...తర్వాత అనుమానించాను... ఇంగ్లీషు పురాణాలు చదవండి...అంతదాకా ఎందుకు. తెలుగుపురాణాలు చూడండి .... శాపకారణంవల్లో, వరకారణంవల్లో ఎంతమంది వందలకు వందల ఏళ్ళ బ్రతకలేదు.....ఆనాడు సంభవమైనది ఈనాడు ఎందుకు సంభవించకూడదు ? ఆలోచించండి."

మునసబుగారు తనవంతు బుర్రగోక్కుంటూ కరణంకేసి చూశాడు. కరణం బుర్ర గోక్కోటం లేదు సరికదా ఆ ప్రయత్నంలోకూడ లేడు. మాట్లాడే యత్నంలో ఉన్నాడు.

"అయితే అతను ఏ దేవతో అంటారా ?" అన్నాడు కరణం తన 'అది ఊహ' ప్రకారం.

"అయితే అవ్వచ్చు. లేకపోతే ఏ రాక్షసుడో అవ్వచ్చు" రాఘవేంద్ర అన్నాడు. ఆ మాటలకు వారిద్దరూ ఉలిక్కిపడి వీపులు చరుచుకున్నారు.

"రెండూ సంభవాలే ! ఎందుకైనా మంచిది. ఒక్కసారి అతని ఇంటికి వెళ్లి పలకరిద్దాం. రండి రంగు తేలుతుంది" అంటూ రాఘవేంద్ర లేచాడు. ఆలోచించిన మునసబు ప్రయాణాన్ని సాయంకాలానికి వాయిదావేశాడు.

* * *

గ్రంథసమేతుడైన రాఘవేంద్ర, కరణంమునసబులతో కూడి మృత్యుంజయుని మేడ చేరుకున్నాడు. హాలులో కూర్చున్న మృత్యుంజయుడు వారిని చూసి "రండి" అన్నాడు. అతని కంఠం నూతిలోంచి వచ్చిన శబ్దంలా వినిపించింది. ముగ్గురూ కూర్చున్నారు. మృత్యుంజయుడు అలా శూన్యంలోకి చూసి విషాదభరితమైన నవ్వును నవ్వాడు.

"మీరిలా నిరుత్సాహపడకూడదు" రాఘవేంద్ర ప్రారంభించాడు.

"మళ్లీ వివాహం చేసుకోండి .... మీకేం ? వయస్సులో ఉన్నారు. ఆ పిల్ల పాపం .... మిమ్మల్ని అన్యాయంచేసి పోయింది. మీ జీవితాన్ని మీరు అన్యాయం చేసుకోవద్దు. మీరు 'ఊ' అంటే రేపు ఈపాటికి పావలా క్లాసుదగ్గర క్యూలా తండ్రులు తమపిల్లలను పట్టుకుని మీ మేడ ముందు నించుంటారు."

మృత్యుంజయుడు నవ్వుతూ "పెళ్ళి..పెళ్ళి" అని గొణుక్కున్నాడు. మళ్లా రాఘవేంద్ర ప్రారంభించాడు.

"మాటవరసకు చెప్తాను. నూట ఇరవై సంవత్సరాల క్రితం మీ వయస్సు కుర్రాడే పాపం ... ఆరు పెళ్లిళ్ల చేసుకున్నాడు. అందరూ ఇలాగే గుండె ఆగిపోయి పోయారు. అతను మీలా నిరుత్సాహ పడ్డట్టు కనబడదు." అతను ఆగాడు.

మృత్యుంజయుని ముఖమంతా ముచ్చెమటలు

పోశాయి. శాయశక్తులా ప్రయత్నించి నిగ్రహించుకుంటూ "అహ! తర్వాత" అన్నాడు రుమాలుతో ముఖం తుడుచుకుంటూ.

"ఈలాంటి సంఘటనే ఎనిమిదివందల సంవత్సరాల క్రితం జరిగింది. అదీ ఇంతే."

"ఆహా!" అంటూ మృత్యుంజయుడు లేచాడు. అతను లేవడంవల్ల గ్రహించదగిన విషయాన్ని గ్రహించి ముగ్గురూ లేచి నించుని "వస్తామండీ" అన్నారు వెళ్లిపోయే ధోరణిలో. "మంచిది" అన్నాడు మృత్యుంజయుడు ముక్తసరిగా.

* * *

మునసబుగారింటి అరుగుమీద మళ్లా 'ముగ్గురి ముచ్చటలు' ప్రారంభమయ్యాయి.

"మీరు ఎన్నన్నా చెప్పండి. ఇతన్ని పట్టుకుని ఎనిమిదివందల ఏళ్లనాటివాడు అనడం బాగులేదు. అలా అనడంలో తెలివితక్కువదనం కనిపిస్తోంది" అంటూ కరణం తనమాటలో వదిలేసిన 'మీ' కోసం రాఘవేంద్ర వైపు చూశాడు. రాఘవేంద్ర కుర్చీలో అటూ ఇటూ చిరాకుగా కదిలాడు. అతని కళ్లు ఎర్రబడ్డాయి.

"[illegible] ఇప్పుడు చివరికి తెలివితక్కువవాణ్ని అనేశారు. శాస్త్రం, సైన్సు తెలియనివాళ్లకి తెలియ చెప్పడంలోనే నా తెలివితక్కువదనం ఇమిడిఉండి ఉండచ్చు... అతను ఎనిమిదివందల సంవత్సరాలనాటివాడని నేను అనటంలేదు. కానీ ఆనాడు అలా భార్యలను పోగొట్టుకున్నవాడిలో ఉన్న కారణం ఇతనిలో కూడా ఉండి ఉండచ్చు అని అనుమానించాను. ఏది ఏమైనా వేనీ విషయాన్ని చివరిదాకా లాగదల్చుకున్నాను. కొన్ని పుస్తకాలు ఇంకా చదవాలి" అంటూ లేచాడు. మిస్టర్ కరణంకూడా లేచాడు. మునసబూ లేచి నించున్నాడు. రాఘవేంద్ర ఏదో గొణుక్కుంటూ వెళ్లిపోయాడు. అతను వెళ్లిపోవడాన్ని నిశ్చయించేసుకున్న తరువాత "వీడికి బుర్ర చెడినట్లుంది. లేకపోతే ఇదేం పురాణకాలమనుకున్నాడా? వెర్రివెధవ" అన్నాడు కరణం మునసబుతో.

"మరే! అందుకనే—పెళ్లీ పెడాకులూగూడా మానేశాడట. పిచ్చి ముదిరించుకోడానికి" అనేసి మునసబు వీధిగుమ్మందాకా వెళ్లి అటూ ఇటూ చూసి నిబ్బరంగా గాలిపీల్చాడు. కరణం తర్వాత తన ఇంటికి చేరాడు.

'ఇంట్లో కూర్చుని పుస్తకాలు చదువుతున్నవాడల్లా 'అది' ఎగిరిపోయేలా అరుస్తూ రాఘవేంద్ర రోడ్డుమీదకు పరిగెత్తాడు....."వెయ్యి... వెయ్యి" అని గొణుక్కుంటూ మునసబు యింటికి వెళ్ళాడు. ఆ మాటలు విని ఇవతలకు వచ్చిన మునసబు అతన్ని చూస్తూ "ఏమిటి వెయ్యను?" అన్నాడు.

"సంవత్సరాలు"

"సంవత్సరాలు వెయ్యడం ఏమిటి? అవేం పిల్లిమొగ్గలనుకున్నావా?" మునసబు ఆశ్చర్యపోయాడు.

రాఘవేంద్ర ఆ మాట వినిపించుకునే స్థితిలో లేడు. కదం తొక్కుతూ నించున్నాడు. ఏదో గొణుక్కుంటున్నవాడల్లా "వెయ్యి సంవత్సరాలు నేను ఒక ఊరు వెళ్ళి కొద్దికాలంలో వస్తాను. అప్పుడు నిరూపించగలనేమో! వస్తాను...వెయ్యి సంవత్సరాలు" అనేసి, మళ్ళీ నడక ప్రారంభించాడు. అప్పుడే రోడ్డుమలుపు తిరుగుతున్న అతన్ని ఉద్దేశించి "ఏవయ్యోయ్! వెయ్యి సంవత్సరాలకు వస్తావా? ఆ! ఏవంటావు?" అని అరిచాడు మునసబు. ఆ మాటలకు దూరమైన రాఘవేంద్ర ఏమీ అనకుండా మలుపు తిరిగిపోయాడు. "ఛీ....బుర్రతక్కువ గాడిద...." అని వాణ్ణి తిట్టి, కరణంకి కబురంపి "ఈ సంగతి" కరణంకి చెప్పాడు. అంతా విన్న కరణం హాయిగా, కులాసాగా నవ్వుతూ "వెర్రి వెధవ... ఏమయితేనేం ఈ వూరు వదలిపోయాడు. పీడ వదలిపోయింది" అన్నాడు.

* * *

అలా అని అవేళ్టికి మూడు రోజులయ్యింది. అవేళ పొద్దున్న మునసబు కరణంతో "ఆపీడ వదిలింది. మరి, ఈ పీడ ఏమయ్యింది? ఈమధ్యన అటు వెళ్ళారా?" అన్నాడు. కరణం వెళ్ళనట్లుగా [illegible] చేసి, ఇంటికి చేరుకోబోతూ [illegible]

ఏంవమ్మా మరీ అంత పల్చని చీరకట్టుకున్నావు, మీ అమ్మచూస్తే ఏమంటుంది? అని బీచికివచ్చిన ఒక యువతిని ఒక నడివయస్సు స్త్రీ ప్రశ్నించింది.

యువతి: ఈ చీర మా అమ్మదేగా!

మెదిలిన ఆలోచనతో అడ్డదారిపట్టి మృత్యుంజయుని ఇంటిదారిపట్టి అతని మేడ చేరుకున్నాడు. మృత్యుంజయుడు గడపలోనే ఎదురయ్యి కరణాన్ని ఆహ్వానించాడు. అతను కట్టుకున్న బట్టలు చిరిగిపోయి దీనావస్థలో ఉన్నాయి. గడ్డం కూడా హద్దుమీరి పెరిగిపోయి ఉంది. అతన్ని చూస్తూనే కరణం గతుక్కుమన్నాడు. కడుపులో చెయ్యి పెట్టి కదిల్చినట్టు బాధపడ్డాడు. కుర్చీలో కూర్చుని మరో లోకంలోకి చూస్తున్నట్లు ఎటో శూన్యంలోకి చూస్తున్న మృత్యుంజయుణ్ణి పలకరించడానికి అతనికి ధైర్యం చాలలేదు. దాన్ని పోగుచేసుకునే సరికి పది నిముషాలు పారిపోయాయి. ఇక యిలా కూర్చోడం బావుండదని ప్రారంభించాడు.

"బాబూ, మీ తండ్రిలాటివాణ్ణి. ఒక్క సలహా యిస్తాను. వింటారా?"

మృత్యుంజయుడు తన చూపును, దానితో పాటు తలనూ కరణంకేసి తిప్పాడు. కరణం అన్నాడు.

"పుట్టిన ప్రతివ్యక్తీ చావక తప్పదు"

"పుట్టిన ప్రతి వ్యక్తీ చావక తప్పదు" మృత్యుంజయుడు ఆ మాటలను వింతగా పలికాడు.

"అవును బాబూ, ఆసంగతి తెలిసి కూడా పోయినవాళ్ళకోసం, పోయిన పాడుగుర్తు ఇలా విచారించడం, అన్నీ తెలిసిన మీలాంటివారు యింతగా ఇది అవటమూ, నాలాటివాడు నచ్చచెప్పడమూ బావుండదు. మీకేం వయస్సు మళ్ళిందా? మళ్ళా......అవును.....మళ్ళీ వివాహం చేసుకుని హాయిగా ఉండచ్చు. నా మాటల్లో సత్యాన్ని గ్రహించండి....." కరణం తను చెప్పడం ఆపి అతనికేసి చూశాడు.

"మళ్ళీ పెళ్ళిచేసుకోమంటారా"

"అవును" కరణం కొంచెం జంకుతూ అన్నాడు. మృత్యుంజయుడు నవ్వుతూ లేచి నించున్నాడు. కరణం కూడా లేచాడు.

"కరణంగారూ, నా అన్నవాడులేని నాకు ఆ 'నా'త్వం మీలో కనిపించింది. మీ ఆదరాభిమానాలకు నేను చాలా ఋణపడ్డాను. నా అభిప్రాయం మీ అభిప్రాయంతో ఏకీభవించిననాడు మీ సలహా తప్పక పాటిస్తాను" అన్నాడు మృత్యుంజయుడు తల వంచుకుని. కరణం మాట్లాడలేక రెండు క్షణాలు నిశ్శబ్దంగా ఉండి "మంచిది బాబూ! మీరూ ఆలోచించుకోండి. కానీ...." అంటూ ఆగాడు. మృత్యుంజయుడు తల పైకి ఎత్తకుండానే 'కానీ?' అన్నాడు.

"ఒక్క మనవి...ఆ రాఘవేంద్ర మీ మీద ఏదో నిరూపిస్తానని వెర్రి కేకలు వేసి వెళ్ళాడు... అతను వచ్చేలోపునే ఒక నిర్ణయానికి వచ్చి వివాహం చేసుకోడం....." అని "నేను వస్తాను" అని వెళ్ళిపోయాడు. కరణం వెళ్ళినతర్వాత వీరాస్వామి కూడా తనస్వామితో అదే చెప్పాడు. కానీ ఆ స్వామి వినిపించుకున్నట్లు ఎవ్వరికీ తోచనేలేదు.

* * *

ఇది జరిగి మరో మూడు రోజులు అయ్యింది. అవేళ్టికి ఆరురోజులకు పైగా మృత్యుంజయుడు మేడదాటి ఇవతలకు రాలేదు. ఆవేళ సాయంత్రం చక్కగా ముస్తాబయి వీధిగుమ్మంవద్దకు వచ్చాడు. గుమ్మంలో అడుగుపెడుతున్న వీరాస్వామి అతన్ని తను చూడననుకున్న పరిస్థితిలో చూసినందుకు ఆనందించి "బాబుగారు" అనేసి ఊరుకున్నాడు, ఆపైన ఏమనాలో తెలియక. అతనిభావం గ్రహించిన మృత్యుంజయుడు చిన్నగా నవ్వుతూ "అలా షికారుకు వెళ్ళివస్తాను" అన్నాడు. ఈలోగా కరణం కూడా వచ్చి మృత్యుంజయుని ముఖవైఖరి, వైఖరి చూసి ముచ్చటపడ్డాడు. తనపనికి వాయిదా వేసుకుని మృత్యుంజయుడు కరణాన్ని కూర్చోమంటూ అతని ఎదురుగాఉన్న మరో సోఫాలో తను కూర్చున్నాడు.

"కరణంగారూ! ఒక ప్రశ్న అడుగుతాను కానీ ప్రమాణం చేసి నిజం చెప్తారా?"

కరణం హడిలిపోయి, ఎగిరి తిన్నగా కూర్చున్నాడు. చెప్తాననడానికి నోరు రాక తలతోనే సూచించాడు.

"ఈ ఊరి ప్రజలు నన్నుగూర్చి ఏమనుకుంటున్నారో దాచకుండా చెప్పండి"

కరణం కరడుగట్టుకుపోయాడు. మృత్యుంజయుడు మళ్ళా అదే ప్రశ్న వేశాడు. కరణం

(35-వ పేజీ చూడండి.)

మానవనైజం

దింజరపు భాస్కరాచార్యులు





"పంతులు తాతయ్యా ! బంతిపూలు కోసుకో నియ్యవూ ?"

పాపయ్యపంతులు తలెత్తి చూసేడు. ఎదురుగా గుమ్మానికి ఆనుకొని నిల్చున్నది ఒక పదహారేళ్ళ పడుచు. చెంపకు చారెడేసి కళ్ళు, బంగారం లాంటి మేనిఛాయ, మల్లెమొగ్గల్లాంటి పలువరుస, నీలిరంగు జాకెట్టుపై తెల్లని సిల్కు కండువా ఓణీగా వేసుకుని సూర్యోదయ కాంతుల్లో ఆ సుందరి మెరిసిపోతూ ఉంది. జీవితంలో కాయలుకాసిన అతని ముదుసలికళ్ళకు ఆమె తనను మేల్కొలపడానికి విచ్చేసిన ఉషా సుందరియేమోనని కాస్సేపు భ్రమకలిగింది. కాని అంతలోనే మేల్కొన్న అతని అంతరాత్మ "కాదు కాదు, సాక్షాత్తూ ఈ అమ్మాయి డాక్టరు రంగనాథంగారి నోములపంట కమల కదూ !" అని గుర్తించింది. అలా గుర్తించిన అతని అంతరాత్మ అంతలోనే మరొక గాఢ సుషుప్తిలో మునిగింది !

"అవును ! .... తన జీవితస్వప్నం, ఆశాసౌధం సూర్యారావుకి కూడా ఈపాటికి యిదే వయసుండేది. తల్లిలేని బిడ్డని తానే పంచ ప్రాణాలుగా పెంచుకొన్నాడు. కాని .... తన జీవితంలో ఎంతో ప్రేమతో పెంచుకొన్న ఆశలకు దారుణమైన ఆఘాతం తగిలింది. ఇందుకు బాధ్యులెవరు ? .... " ఒక్కసారి పంతులు ఉద్రేకంతో కంపించిపోయాడు. కలతచెందిన అతని మనసు కన్నీరు కార్చింది. " .... లోకంలో అందరి తండ్రుల్లాగే తానుకూడా సూర్యారావుపై ఎన్నో ఆశలు పెట్టుకొన్నాడు. నిజానికి కొడుకుపై తన ఆశలు, ఆశయాలు తప్పిస్తే, జీవితంలో తనకి మిగిలేదేం లేదు. కాని .... తన కనీసపు కోర్కెలే తారుమారయ్యాయి .... ముక్కుపచ్చలారని చిన్ని మొగ్గను మొదట్లోనే త్రుంచి, మోడువారిన ముదుసలికి నిండు జీవితం కల్పిస్తాడు భగవంతుడు ! .... ఏ దేమైనా తాను జీవించి తీరాలి .... ఎందుకో ! .... తనకు తెలియదు. బహుశా ఇదే సృష్టివైచిత్ర్యం ! దాన్ని తాను మార్చలేడు!...."

ఏటి కావల ఉండే శూన్యంలోకి ఓసారి నిశ్చలంగా చూశాడు పంతులు. గతరాత్రంతా మాటుమణిగిన జీవరాశులన్నీ అప్పుడే తమ జీవన యాత్రలో అనాటి పాత్ర నిర్వహించడానికి ప్రారంభించేయి. "బహుశా .... ఇదే కాబోలు జీవితం అంటే !" అనుకొన్నాడు పంతులు. అతని స్మృతిపథంలో ఓ పదేళ్ళు వెనక్కి నడిచినాయ్....

*   *   *

'.... పాలెం' కృష్ణాతీరంలోని ఓ పల్లెటూరు. ఒకవైపున గలగలమంటూ వడిగా పారే కృష్ణాతరంగిణి, మిగతా వైపుల దట్టమైన చిట్టడవి.... ఇంచుమించు పాలెంకు బాహ్య ప్రపంచంతోగల సంబంధం చాలా తక్కువని చెప్పవచ్చు. పాలెం విజయవాడకు నలభై మైళ్లదూరంలో ఉంది. ఇంకా పట్నం వాతావరణం పాలెంలోకి పూర్తిగా జొరబడలేదు. పచ్చని పైరుచేలు, అమాయకపు పల్లెపడుచుల కేళీవినోదాలు, పల్లెబాలుర వినోద క్రీడలు — వీటి సహజసౌందర్యంతో పాలెం ఒక పసలైన పల్లెటూరుగా రాణిస్తోంది.

పాలెం అంతాకలిసి ఒక వేయిమంది జనాభా ఉండొచ్చు. ఆ ఊరికి ఒక్కటే ప్రైవేటు బడి ఉంది. ఆ బడికి ఒక్కడే పంతులు — పాపయ్య పంతులు. పల్లెజీవితానికి చాలిన పదహారు ఎక్కాలు, కూడిక తీసివేతలు, నాల్గోక్లాసు చదువూ, ఓ పదిమంది పిల్లలకు చెప్పుకొని తద్వారా తన జీవనాన్ని గడించుకొనేవాడు. అతనికి ఒక్కడే కొడుకు—సూర్యారావు. పిల్లవాని పసితనంలోనే తల్లి చనిపోయింది. ఆ దెబ్బకు క్రుంగిన పంతులు తన జీవిత సర్వస్వం తన కొడుకులోనే చూచుకొనేవాడు. పెరిగి పెద్దవాడయ్యాక పట్నానికి పంపించి,పెద్దచదువులు చెప్పించాలనీ, ఊళ్లేలించాలనీ ఆరేళ్ల ఆ పసివానిలో ఎన్నెన్నో కలలు కనేవాడు.

ప్రజారోగ్య శాఖవారి దృష్టిలో పడని పాలెంకు ప్రస్తుతం ఒక్కరే డాక్టరు — రంగనాధంగారు. వైద్యశాస్త్రంలో చాలా అనుభవం గలవారనీ, ఆయన హస్తగుణం చాల గొప్పదనీ పాలెం ప్రజలంతా చెప్పుకొంటారు. కోటయ్యగారి కోడలు మందులిచ్చి కాపాడిన ఆయనకీర్తి పాలెం అంతా పాకిపోయింది. రంగయ్యగారి అబ్బాయి రామం రక్తగ్రహిణితో బాధపడ్తూ, రంగనాధంగారి చేతిచలవవల్లే బతగ్గలిగేనని చెప్పుకొనేవాడు. ఇలాగనే చావుబ్రతుకుల్లో సతమతమవుతున్న అనేక ప్రాణుల్ని ఆయన రక్షించేరని పాలెం అంతా ప్రతీతి.

రంగనాధం దంపతులకు ఒక్కగా నొక్క కూతురు కమల. డాక్టరుగారు, భార్య సావిత్రమ్మగారు కూతుర్ని తమకు దేవుడిచ్చిన కానుకగా భావించి, అల్లారుముద్దుగా పెంచుకొనేవారు.

చంద్రుడిలోకూడా ఒక మచ్చ లేకపోలేదు. స్వచ్ఛమైన కోనేటి నీటి అడుగున బురద లేకపోలేదు. ఎలాంటి సుఖమయమైన జీవితంలోనైనా, కొన్ని అగాధాలు ఎదురుకాక మానవు.

ఒక పడవ కు, నదిలో పోతుండగా చిల్లి పడింది. అప్పుడేంచేయాలో ఎవరికీ తోచలేదు. నీళ్ళన్నీ లోపలికొస్తున్నాయి. అప్పుడందులోని ఒక బెస్తవాడు సలహా ఇచ్చాడు.

"దీనికంత బాధపడవలసిన పనేముంది. పడవ కింకొక చిల్లిపొడవండి. ఆ నీళ్ళన్నీ ఆ చిల్లిలోగుండా పోతయి."

కర్లపాలెం మధుసూదనరావు
(వేటపాలెం)

బహుశా ఈ పరస్పర వైరుధ్యాల సమ్మేళనంలోనే జీవితం ఇమిడిఉంది.

రంగనాధంగారికికూడా ఒక్కటే లోపం ఉంది. అది ఆయనలో చదరంగం ఆటపై పేరుకొన్న అత్యంతాసక్తి ! బాల్యంనుంచీ ఆయన కా ఆటపై మక్కువ ఉన్నా, అది ఒక వ్యసనంగా పరిణమిస్తుందని ఆయన మొదట్లో ఊహించలేదు. క్రమంగా అది ఆయన నిత్యజీవితంలో వృత్తికంటె ప్రాముఖ్యం వహించే పరిస్థితి ఏర్పడింది! చదరంగం ఆడుతున్నప్పుడు ఆయన రోగాన్నిగురించి ఆలోచించరు, మాట్లాడరు — పైగా మర్చిపోతారు కూడా ! అంచేతనే కాబోలు ఆయన ఆటలో నున్నపుడు ఎవరూ ఆయన దరిదాపుల్లోకి వెళ్లరు. ఆ ఆటలో ఆయన అనుభవించే అనిర్వచనీయమైన ఆనందం ఆయన కొక్కరికే ఎరుక. తన జీవితాన్ని పెడదారి పట్టించినా, దాన్ని అంతగా ఆయన పట్టించుకోలేదు.

2

ఆటలాడి అలసి ఇంటికి చేరిన పసివాని ఒంటిమీద చేయివేసి చూచాడు పంతులు. ఒళ్లు వెచ్చగా సలసల మరుగుతున్నట్లుంది. కళ్లు ఎర్రగా చింతనిప్పుల్లాగ ఉన్నాయి. అప్పుడే రంగనాధంగారి దగ్గరకు వెళ్లి మందు తెచ్చివేశాడు పంతులు. ఆరాత్రి పసివాడు నిద్రపోలేదు.

*

పదిహేనురోజులు గడిచాయి. సూర్యారావుకి జ్వరం విపరీతంగా కాస్తోంది. డాక్టరుగారు మందు లెన్నివేసినా, జ్వరం నానాటికీ ఎక్కువవుతూనే ఉంది. టైఫాయిడు జ్వరమని పంతులికి అర్థమైంది. రోజులు గడుస్తున్నకొద్దీ, పంతులుకి ఆరాటం ఎక్కువవుతోంది.

ఆరోజు అమావాస్య. ఆకాశం అంతా మబ్బులు దట్టంగా అలుముకొని ఉన్నాయి. కన్ను పొడుచుకొన్నా కనిపించని కటికచీకటి. చెట్లు విరిగేటంతటి వేగంతో ఈదరగాలి రివ్వున వీస్తోంది. పంతులుగారి పూరింటిలో సన్నని దీపపుకాంతి రెపరెపలాడుతోంది. ఆ దీపపుకాంతిలో పంతులు ముఖంలో కమ్ముకొన్న విషాదచ్ఛాయలు స్పష్టంగా కన్పిస్తున్నాయి.

"అమ్మోయ్!!" అని ఓ పొలికేక వేసి మంచం మీదనుంచి కిందికి దూకేడు పసివాడు. పంతులు అదిమిపట్టి మళ్లీ పడుకోబెట్టేడు. మరికొన్ని క్షణాలు నిశ్శబ్దంగా గడిచేయి. ఎక్కడో చెట్టు చాటున దాక్కొన్న గుడ్లగూబ ఓసారి వికృతంగా అరిచింది. ఉన్నట్లుండి ఓ పెద్ద మెరుపు మెరిసింది.

"అమ్మోయ్ ! నేనూ నీ దగ్గరికి రావొద్దూ !" అంటూ కేకపెట్టి మంచంమీదనుంచి మళ్లీ కిందపడ్డాడు అర్భకుడు. మళ్లీ లేవనెత్తి మంచం మీద పడుకోబెట్టేడు పంతులు. కాసేపు నిశ్శబ్దదై కాళరాత్రిని తిలకించేడు.

"ప్రకృతికూడా కార్పణ్యం వహిస్తోందన్నమాట !" అనుకొన్నాడు.

పిల్లవాడు అదేపనిగా పిచ్చిగా పలవరిస్తున్నాడు. ఏమయితే అయిందని పిల్లవాణ్ణి భుజంమీద వేసుకొని రంగనాధంగారింటికి బయల్దేరేడు పంతులు.

*   *   *

రాత్రి పది గంటలవేళ. రంగనాధంగారు చదరంగం హుషారుగా ఆడుతున్నారు. ఆయన బావమరిది రామారావుకూడా చదరంగంలో ప్రవీణుడే. ఆనాడే అతను పట్నం నుంచి బావగారింటికి వచ్చేడు. ఆట మహా రక్తికడుతున్నది. ఇద్దరూ సమానంగా పట్టుదలతో ఎత్తులు వేస్తున్నారు. ఫ్రెంచి డిఫెన్సుపద్ధతి అవలంభించేరు రంగనాధంగారు.

ఇంతలో వీధితలుపు తట్టిన చప్పుడు .... పాలేరు వెంకడు వెళ్లి తలుపు తీశాడు. పంతులు పిల్లవానితో సహా ఖంగారుగా లోపలి కొచ్చేడు.


"డాక్టరుగారూ ! .... " ఆవేదనతోకూడిన ఆక్రందన అది. డాక్టరుగారు శకటుతో ఎదుటి ఏనుగును కొట్టి, రాజనిపించేరు. మళ్లీ ఎత్తు ఆలోచిస్తున్నారు.

"డాక్టరుగారూ ! మా పిల్లవాణ్ణి ఎలాగైనా మీరే రక్షించాలండి !" ఎదుటి పార్టీ అడ్డువేసిన గుఱ్ఱంబారిని తప్పించుకోడం ఎలాగా అని ఆలోచిస్తున్నారు రంగనాధంగారు.

"పిల్లవాడు అదేపనిగా పలవరిస్తున్నాడండి .... కింద పడుతున్నాడండి" పంతులుకంఠం వణుకుతోంది.



''అనేక సిరుల కథ''లో సరోజాదేవి



సారథివారి ''కలిమి ఉంటే కలదు సుఖం''లో గిరిజ హరనాథ్

బాలల చిత్రం

విశ్వకవి రవీంద్రుని గేయం ''ది చైల్డ్'' (బిడ్డ) ఆధారంగా శ్రీ తపన్‌సేన్ 'శిశు తీర్థ' అన్న బాలల చిత్రాన్ని నిర్మిస్తారని శ్రీయుతులు యస్. ఆర్. దాస్ (విశ్వ భారతి ఉపాధ్యక్షులు) డా. సునీత్ కుమార్ చటర్జీ (పశ్చిమ బెంగాల్ శాసన పరిషత్తు అధ్యక్షులు) ప్రభృతులు ఒక సంయుక్త ప్రకటనలో వెల్లడించారు.

ఈ చిత్రానికి పండిత రవిశంకర్ సంగీతం సమకూరుస్తారు.

1500 మందికి నిరుద్యోగం

సెన్సారు అధికార్ల కఠిన నిబంధనల బొంబాయి చిత్రరంగంలో సుమారు 1500 మందిని నిరుద్యోగులను చేశాయని చలన చిత్ర కార్మిక సంఘాధ్యక్షులు శ్రీ పన్నాకపూర్ అన్నారు.

బొంబాయి సెంట్రల్ స్టూడియోలో పత్రికా విలేఖర్ల సమావేశంలో మాట్లాడుతూ, ఆయన ఈ విషయం వెల్లడించారు.

తాము సెన్సారు భవనముందు చేయాలను కున్న ఏక దిన నిరశన వ్రతం, స్టూడియోలలో ఒక రోజు లాంఛన ప్రాయపు సమ్మె, భారత చలన చిత్ర నిర్మాతల సంఘాధ్యక్షులు శ్రీ బిమల్ రాయ్ ఇచ్చిన సలహా ననుసరించి విరమించామని కూడా శ్రీ కపూర్ అన్నారు.

ప్రివ్యూ థియేటర్ల లైసెన్సు

రాష్ట్రంలోని ప్రివ్యూ థియేటర్లు స్టూడియోలలోవున్నా, పోటికి బైటవేవున్నా, మామూలు ప్రదర్శనశాలలుగానే వాటికి కూడా మద్రాసు సినిమా చట్టం (1955) క్రింద లైసెన్సులు తీసుకోవాలని మద్రాసు ప్రభుత్వం ఉత్తర్వు జారీ చేసింది.

చిత్రకథల సెన్సారు

చిత్రాలు నిర్మించేముందుగా వాటి చిత్ర కథలను, సెన్సారు అధికార్లు పరిశీలించాలని, ప్రజా శికా సంఘ సభ్యులు శ్రీ శ్రీమన్నారాయణ్ 'గాంధి మార్గ' అన్న పత్రికలోని వ్యాసంలో సూచించారు.


సినీ కార్మికులకు ప్రావిడెంటుఫండు

భారత చలన చిత్ర పరిశ్రమలో పని చేసే వారందరికీ ప్రావిడెంటుఫండు సౌకర్యం వర్తింప జేయాలని భారత ప్రభుత్వం నిశ్చయించింది.

చలన చిత్ర ప్రదర్శనశాలలు, ప్రివ్యూ థియేటర్లు, చలన చిత్ర నిర్మాణశాలలు (స్టూడియోలు), చిత్ర నిర్మాణ సంస్థలు—అన్నీ, ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండు చట్టం క్రిందికి వస్తున్నాయి.

20 మందికిపైన పనిచేసే ప్రతి చలన చిత్ర పారిశ్రామిక సంస్థకు వర్తించే ఈ సౌకర్యం ఈనెల 31 వ తేదీనుంచి అమలులోకివస్తుంది.

వాశికర్ మృతి



'ఏక్ థా రాజా - ఏక్ థీ రాణీ'లో నర్గీస్ - ఉల్హాస్.

కథా రచయిత శ్రీ శివరామ్ వాశికర్ తమ స్వగృహంలో (బొంబాయి) మరణించారు. ఈయన వయస్సు 68 సంవత్సరాలు.

శ్రీ వాశికర్ రచించిన చిత్ర కథల్లో "సంత తుకారామ్" 'సంత ధ్యానేశ్వర్', 'రామ్ శాస్త్రి' చిత్రాలు విశేషంగా మహారాష్ట్ర ప్రజాదరణ పొందాయి.

చిత్రాల దిగుమతి పంపిణీలకు ప్రభుత్వ సంస్థ

సింహళ ప్రభుత్వం పరాయి చిత్రాల దిగుమతికి పంపిణీకి కార్పొరేషన్ ఏర్పాటుచేసే విషయం పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రదర్శకుల దయా దాక్షిణ్యాలపై ఆధారపడవలసి వస్తోందని స్థానిక నిర్మాతల ఫిర్యాదు ఫలితంగా సింహళ ప్రభుత్వం ఈ ఆలోచన చేస్తోంది.

హెమింగ్వే మృతి

సుప్రసిద్ధ ఆంగ్ల నవలా రచయిత శ్రీ ఎర్నెస్ట్ హెమింగ్వే జూలై 2 వ తేదీన తమ స్వంత స్వగృహంలో తుపాకి తుడుస్తుండగా ప్రమాదవశాత్తు పేలుడు జరిగి మరణించారు.

20 వ శతాబ్దపు అమెరికను నవలా రచయితల్లో శ్రీ హెమింగ్వే సుప్రసిద్ధులు. ఆయన రచనలలో "ఫర్ హూమ్ ది బెల్ టోల్స్" "ది స్నోస్ ఆఫ్ కిలిమంజారో" 'ఎ ఫేర్‌వెల్ టు ఆరమ్స్' అన్నవి చలన చిత్రాలుగా కూడా ప్రపంచ ఖ్యాతిని పొందాయి. 'ది ఓల్డ్ మాన్ అండ్ ది సీ' అన్న నవలకు పులిట్జర్ బహుమతి లభించింది.

కొంతకాలంగా శ్రీ హెమింగ్వే అస్వస్థులుగా వున్నారు.

ఎడ్డీపోలో మృతి

హాలివుడ్ మూకీ చిత్రాల్లోని ప్రఖ్యాత నటుడు శ్రీ ఎడ్డీపోలో తమ 86 వ ఏట ఇటీవల చనిపోయారు. మూకీ చిత్ర నటుడుగా ఆయన 3497 ఫీట్లు చేసి కీర్తి నార్జించారు.

జెఫ్ చాండ్లర్ నిర్యాణం

ప్రఖ్యాత హాలివుడ్ సినీ చిత్ర నటుడు శ్రీ జెఫ్ చాండ్లర్ జూన్ 15 వ తేదీన మృతి చెందారు. వీరి వయస్సు 42 సంవత్సరాలు. శస్త్ర చికిత్స అనంతరం హఠాత్తుగా మరణించారు.

ప్రభుత్వ ముద్రణశాలలో సినిమా టిక్కెట్ల ముద్రణం

రాష్ట్రంలోని సినిమా టిక్కెట్లను ప్రభుత్వ ముద్రణ శాలలలోనే అచ్చు వేయించాలనే ప్రతిపాదనను మధ్యప్రదేశ్ ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు తెలుస్తున్నది. వినోదపు పన్ను వ్యక్రమ వసూలుకు గాను, జిల్లా అధికార్ల సూచనపై ఈ పరిశీలన జరుగుతోంది.

జానకి-రామచంద్రన్‌ల జంట

బి. ఎ. యస్. ప్రొడక్షన్స్‌వారి తమిళ అపరాధ పరిశోధక చిత్రంలో ప్రప్రథమంగా షౌకార్ జానకి, యం. జి. రామచంద్రన్ కలిసి నటిస్తున్నారు. ★

హరివంశము

సాందీపనిపర్వం - 20

డుంఠి పెట్టిన గడువు పూర్తి అయినది. ఆగడువు కొరకు అటు దేవతలును, ఇటు దివోదాసుడునుగూడ ప్రతీక్ష చేయుచున్నారు. ఇప్పుడు విష్ణువు ఏమిచేయును అని దేవతలు, తానును; డుంఠిభట్టారకుడు చెప్పిన విప్రుడు ఎప్పుడు వచ్చునా అని దివోదాసుడును. ఆ పదునెనిమిదవ దినమున రాజామొగసాలలో పగలు రెండు ఝాముల అయినదని తెలుపు ఘంటికలు మ్రోయుగా, విప్రవేషమును అంగీకరించిన పుణ్యకీర్తి రాజాస్థానిలో ప్రవేశిం . రాజును, అప్పుడు నిండోలగ ముండినాడు. ఆచార్య పుణ్యకీర్తి రాగానే, రాజునకు అతడు తనకు గురువని తెలిసినది. అతడును సముచిత ప్రకారముల రాజును పరామర్శించి, ఆశీర్వదించి, అతడు అనుపగా సమున్నతకనకాసనమున ఆసీనుడైనాడు. అతడు కూరుచుండగా రాజునకు రాజులో విచిత్రములు పుట్టినవి. తాను తానా! మరి యొక్కరా! రాజునకు అదియేమో తెలియులేదు. అదియు క్షణము కాలము. ఆక్షణములోమంద రమున తాను పొందిన ఆనందమునకు అంతులేదు. "అద్దా! గజానన! అద్దా డుంఠి! ఏమిచేసినావు. ఎంత ఆలోచనచేసినావు" అనుకొన్నాడు తాను. అంబిక మందహాస రుచిరానన అయినది. "అవును! త్ర్యంబక! డుంఠిభట్టు ఆవేశరూపమున రాజ హృదయమున అధివాసము కుదుర్చుకొన్నాడు. వినాయకాధిష్ఠితుడైన భూమిపతిని ఈ విష్ణువు కీకురించుట అరిదిపనికాదు" అన్నది.

రాజు తెప్పరిల్లినంతలో ఆయనకు అన్నియు అవగతమైనవి. మరి ఆయన ఇప్పుడు చేయునది లేదు. అతడు ఇంతకాలము దేవతలను కాదని, నిజసామర్థ్యముచేత సర్వజ్ఞాగ్నిహ్యనిలాత్మకుడై ఏలుబడిసాగించినాడు. ఇప్పుడు తానుకాని తన్ను దేవతలు కీకురించుచున్నారు. ఆయన ఏలుబడి రోజులు అయిపోయినవి. ఆయనయు తానుకాని తానై పుణ్యకీర్తినామక కపటబ్రాహ్మణుడైన విష్ణువుచేత వంచింపబడుచున్నాడు. తనకు అతని మీద జాలి వేసినది. మరి అతడేమైన ధర్మమును తప్పినడచెనా? ప్రజలను తండ్రిరీతి పాలించ లేదా! దివోదాసుని రాజ్యములో ధర్మము అవ్యభిచారియైన ప్రజలు ఔరసులవలె పాలించబడినారు. మరి అతని తప్పిదము? అంబిక అన్నది; "ప్రభు! దివోదాసునియందలగల తప్పు స్థూలదృష్టులకు కన్పించదు. అతడు దేవతలను త్రుణీకరించినాడు. అది అతని అపరాధము" అన్నది.

దివోదాసుడు గూడ పుణ్యకీర్తితో ఆ మాటయే అనినాడు. "భగవన్! నన్ను డుంఠి ఆవేశించినాడు. నేను మొదట ఇది ఎరిగినదిలేదు. ఇప్పుడు అంతయు నాకు అవగతమగుచున్నది. నీవు ఎవ్వరవు? నాలో వున్న డుంఠీ! ఈయన ఎవరయ్యా! స్వామి! తెలిసినది; తెలిసినది. నన్ను రక్షించుటకు, నన్ను పొందిన అపరాధమును శిక్షించుటకు వచ్చిన నారాయణమూర్తియా! అవును! ఆచార్య! అవును! భగవన్! నీవు మధుసూదనుడవు; శంఖచక్రగదాఖడ్గసంయుతుడవు. ప్రభు! నీవు సంకర్షణుడవు; కమలమును, శంఖమును, చక్రమును, గదను దాల్చినవాడవు. తండ్రి! నీవు దామోదరుడవు; శంఖకౌమోదకీ చక్ర జలజపాణివి. తాత! నీవు వామనుడవు; శంఖచక్రాంబురుహగదాసహితుడవు. పాంచజన్యమును, గదను, పంకజమును, చక్రమును దాల్చి! ప్రభువ! నీవు ప్రద్యుమ్నసంజ్ఞను వరగుతున్నావు. నీవు విష్ణుడవు. ఆత్మనాధ! శంఖచక్రగదాంభోజసహితుడవు నీవు. మేధాసమగ్రమతులు నీవు శంఖచక్ర గదాపద్మసహితుడవు కాగా మాధవా అని నిన్ను నుతించినారు. పురుషోత్తమ! అదుగో! శంఖగదలును చక్రాంబుజములను ధరించి నాకు దర్శనం ఇస్తున్నావు. నీవు పురుషోత్తముడవు. అనాదినిధనుడవు. నీవు జనార్దనుడవు. శంఖకౌమోదకీపద్మచక్రధారుడవు. గోవింద! నీవు గోవిందుడవు. శంఖ చక్ర గదాంభోజసహితుని, నిన్ను కని నేను తరించినాను. ఓయి డుంఠి! దేవతలకు దేవుడు, పరమశివునిమాత్రముచేతనే పూర్తిగా ఎరుగబడినవాడు, పీతాంబరుడు, స్రగ్వి, శ్రీవత్సలాంఛనుడు, కుహనానుగతుడు, నన్ను రుణించి రాగా, నాకు ఆయన దర్శన భాగ్యమునుకలుగజేసినావు! ఇంకను నన్ను ఆవేశించిన ఫలమేమి! నేను నేనైతిని. నిన్ను ఎరిగితిని. శంఖపద్మగదాచక్రసహితుడైన త్రివిక్రముణ్ణి, బలిని వంచించిన చిరంతనవటువును, శంఖమును అంబుజమును, చక్రగదలను ధరించిన శ్రీధరుణ్ణి, తెలిసితినయ్యా! ఆయనకు నాకు గురువు. నాకు ప్రవ్రజ్యమును ఈయగా వచ్చినాడు. శంఖచక్రగదాపద్మములుగల హృషీకేశుడు, శంఖచక్రపద్మగదలుగల నృపింహుడు, శంఖరథాంగములుగల అచ్యుతుడు, శంఖారిగదాపద్మములుగల వాసుదేవుడు, శంఖ పద్మగదా చక్రములుగల నారాయణుడు, శంఖపద్మచక్రగదలుగల పద్మనాభుడు, శంఖగదాది పద్మములుగల ఉపేంద్రుడు, శంకచక్రపద్మగదలుగల హరి, శంఖపద్మగదాచక్రములుగల కృష్ణుడు, నాపై కరుణించినాడు. స్వామి! ఇంతకాలం నా రాజ్యంలో జరావ్యాధిదారిద్ర్యములులేవు. ఇప్పుడు దివ్యాంతరిక్షభౌమోత్పాతములు పుడుతున్నవి. ఇది వేల్పుల వేడబముకాని మరియొక్కటికాదు. త్రిపురవిజయము సాధించినట్లు, బలిని ధ్వంసముచేసినట్లు, వృత్రుణ్ణి వధించినట్లు, నన్నును ఈ దేవతలు, ప్రభు! మోసముచేతనే సాధించుచున్నారు. కానీ! ఆ వారితో నేను ద్వేష్యుడను. భగవన్! నీవై నాయింటికి, గురువవై వచ్చినావు. నేనో పదివేలేండ్లు రాజ్యము చేసినాను. ఇప్పుడు జరాక్రాంతుడనైనాను. ఇంద్రియములు ఉపరతినిపొందుతున్నవి. సకలకర్మనిర్మూలనమైన మోక్షము గూడ నాకు అరచేతి పండైనది. నీవు, మోక్ష ప్రదాతవు, నాయింటికి వచ్చినావు. కరుణించు. తండ్రీ! కరుణించు."

రాజు మరి మాటాడలేదు. విష్ణువు రాజుతో ఇటుల అనినాడు: "నీవు కాశికాపట్టణంలో లింగ ప్రతిష్ఠ చేయి. మృత్యుంజయునికి హర్మ్యరేఖ కల్పించు. బొందితోడన నీవు కైలాసమునకు పోగలవు. మరి ముందు పుత్రునికి పట్టము కట్టు. అసలు నీవు ఎప్పుడో తనయ సంక్రాంత సామ్రాజ్యతంత్రుడవై, వనములకు పోయి వుండవలసింది. ఇప్పుడును మించినదిలేదు."

రాజు వెంటనే అమాత్యులను సంబోధించినాడు. మండలేశ్వరులను రప్పించినాడు. అధ్యక్షులను, పురోహితులను, ప్రతీహారులను, ఋత్విజులను, గణకులను, అంతఃపురజనములను రావించినాడు. కుమారునకు, సమరంజయునకు, పట్టము కట్టినాడు. కాశికానగరంలో తన సర్వశ్రీ సమృద్ధియు వెచ్చించి మహాప్రసాదం నిర్మించి శివలింగమును ప్రతిష్ఠించినాడు. కాశిలో భూపాలశ్రీ అనే నామంతో ఆ ప్రసాదము త్రిభువన జననేత్ర ప్రసాదమై ప్రసిద్ధివహించింది.

దివోదాసు నుచ్చాటనము జరుగగా జతుష్షష్టి శక్తి గణము సంతోషముతో ఆమోదనృత్తమును అభినయించినది. లోలార్క కేశవఘటోత్కాదులు పన్నిద్దరు ప్రమోదభాజులయినారు. వనజాసనుడు నాల్గు మోములతోడను వేదార్థములచేత విశ్వనాధునకు భక్తిచేసినాడు. శంకుకర్ణ ఘంటాకర్ణ నంది షేణాదులయిన గణనాయకులు ఆనందమొందినారు. డుంఠియు, వైకుంఠపతియు, కమలవాసినియు అఖిలమాయాప్రయోగ వైయాత్యగరిమచేత, ఏకకార్యపరతచేతని అవిముక్తమునుండి దివోదాసును వెడలనడుపగా సకలద్యులోక బృందారక వర్గము ఆనందతుందిలమైనది.

ఆ సంతోషములో డుంఠియు కాశికా నగరమునకు తన యాజ్ఞమేరకు వేంచేసియున్న సకల ప్రమథగణమును, దేవతాగణమును ఒక్కచో సమావేశపరచినాడు, ఇప్పుడు మందరముననున్న తన్ను అంబికతోగూడ కాశికి పిలిపించవలయును. ఆకార్యమును గూర్చి అందరును కలిసి ఆలోచించినారు. విష్ణువు అన్నాడు : "డుంఠి! దివోదాసునుచ్చాటనము పూర్తి అయినది. ఇప్పుడు విశ్వనాధదేవుని కాశికి రప్పించవలయును. గరుడితో సర్వకార్యము గరగరనైనదని లేఖలు మందరమునకు పంపుదము." ప్రమథులు, శక్తిగణములు, యోగినులు, ఋభువులు, అందరును ఆయన ఆ మాటలకు సంతోషించినారు. వెనువెంటనే విష్ణువు సంతోషపద్ధతిని దేవరయాజ్ఞపెంపున సకలార్థములు సంఘటిల్లినవని హాటకరేఖ రచించినాడు. గరుడుకి ఇచ్చినాడు. గరుడియు ఆ లేఖను అందుకొని లవణేక్షు సురాసముద్రములు దాటి కుశద్వీపమును డాసి మందరమును నిరంకుశ మహాహంకారధీరోద్ధతిని చేరి. తనకు ఆ పత్రికను సమర్పించరాగా నందికేశ్వరుడది అందుకొని తనచేతికి అందించినాడు.

తాను కోరుకున్న పనిని డుంఠియు, విష్ణువును కమలవాసినియుసాధించినారు. కాశికి పోప్రయాణభేరిమ్రోయించుటయేకొరతగానున్నది. తాను నందిని చూచినాడు. నంది ప్రమథగణములను చూచినాడు. అతని చేతిలోని వెండి బెత్తము గజ్జెలల మొత్తములు ఘల్లుమన్నవి. టెక్కియములు అంబరవీధి నొత్తుకొనగా ఎత్తబడినవి. శంఖకాహళములు ఒత్తబడినవి. శృంగక వంశకాండము లూదబడినవి. దుందుభులు మొత్తబడినవి. ప్రమథముఖ్యులు హర్షితచిత్తవృత్తులైనారు. అప్పుడు నంది రథమును పన్ని ప్రాంగణమున నిల్పినాడు. ఆ రథము ఎట్లు పన్నబడినది ? ఎనిమిది ఏనుగులు; ఎనిమిది వృషభములు; ఎనిమిది తురగములు; ఎనిమిది హరులు; ఈషల్ గంగాతరంగిణీకాళిందులు; సాయమును, రేపును, చక్రములు; తారకావర్త్మము ధవళాతపత్రము; రజితంపుమెలలు తారాగణము; ములుకోల ప్రణవము; గాయత్రి పాదపీఠము; వేదము సర్వాంగ రక్ష; ద్వారసంరక్షకులు శ్రీవధామవిధులు; ఆమ్నాయ మండలము మార్గదర్శకము; ఇట్టుల ఉన్నతమైన శతాంగము పన్నబడినది. ఆ రథము వాకిటిలో నిల్వగా తాను కైసేసుకొని, భవాని కైసేసుకొని రాగా, ఆమెతోగూడ దాని నధిరోహించినాడు. ముప్పదిమూడు కోట్ల దేవతలు, కోట్యయుతద్వయ ప్రమథగణము, నవకోటి దుర్గలు, కోటి భైరవులు, కోటి కుమారులు, ఏడుకోట్ల వినాయకులు, షడశీతిసహస్రములు మునులు, అందరు గృహమేధులు, మూడుకోట్ల పాతాళతలభుజంగములు, రెండుకోట్ల దైత్యదానవులు, అష్టాయుత గంధర్వులు, కోట్యర్ధ లక్ష రాక్షసులు, పదివేవురు విద్యాధరులు, ఆరువేలప్సరసలు, ఎనిమిది లక్షలు గోమాతలు, షణ్ణవత్యయుత సుపర్వులు, సప్త సాగరములు, ఎనిమిదివేల కిన్నరులు, మున్నూరు వైవస్వతులు, తనవెంట కొలువుగా కాశికి బయలుదేరినాడు. రథమును నభోమార్గమున వాయువేగముతో పయనముచేసినది. ఇందరు అనుచరులును, ఆరథమును అంటి మహామేఘమును వెంటనంటియుండు చిలుపమేఘములను పోలి కదలినారు. ప్రయాణము ముహూర్త మాత్రము సాగినది. ఒక్క ముహూర్తములో రథము కాశిలో దిగినది. దేవతలు, ప్రమథగణములు, దుర్గలు, భైరవులు, కుమారులు, వినాయకులు, మునులు, గృహమేధులు, పాతాళతల భుజంగములు, దైత్య దానవులు, గంధర్వులు, రాక్షసులు, విద్యాధరులు, అప్సరసలు, గోమాతలు, సుపర్వులు, సాగరములు, కిన్నరులు, వైవస్వతులు అందరును కాశిలో దిగినారు. ఆ ముహూర్తములో గోమాతలు దుగ్ధములను వర్షించినారు. జైగిషవ్యుడను మహాముని వేదార్థసారములైన కైవారములచేత తన్ను ప్రస్తుతించినాడు. తాను తిరిగి కాశిలో ప్రవేశించినది చతుర్దశి నాడు. శుక్లపక్ష చతుర్దశి. జ్యేష్ఠమాసము. అది కారణముగా కాశిలో జ్యేష్ఠస్థానమను తీర్థము, జైగిషవ్య స్తోత్రము కారణముగా జైగిషవ్య తీర్థము, గోమాతృ దుగ్ధవర్షము కారణముగా క్షీరోద తీర్థము కలిగినవి.

కాశికి విజయముచేసిన తాను తిరిగి అవిముక్త మండపమున కొలువుండినాడు. తత్కాలి సన్నిహితులయిన యోగినిభాను పద్మభవప్రమథలక్ష్మీ నారాయణులను యథాప్రధానముగా సంభావించినాడు. డుంఠిని దగ్గరకు రావించి కంఠాలింగనము చేసి, గండస్థలమున నఖాంకురవ్యాపారముచేత బుజ్జగించుచు ప్రస్తుతించినాడు. "ఓయి! డుంఠీ! వోయి! కరివదన! ఓయి! విఘ్ననాయక! నీవలన కదా, నేను త్రిపురదానవులను మర్దించగల్గినాను. నీవలనగదా కాకోల విషవహ్నిని అలవోకయును పోలె, ఆర్పగలిగినాను. నీవలనగదా విరవగ్రహస్ఫూర్తి అంధకాదుల గర్వమును అడప కల్గినాను. ఇప్పుడు వారణాసీసంగమోత్సవకేళి నాకు ఒనకూడినది యనగా, అదియు నీవలననేగదా కల్గినది. నీవు నాకు పుత్రుడవు. ఒక్క పుత్రుడవేనా! డుంఠీ! కాదు. మిత్రుడవు. భటుడవు. సచివుడవు. కంఠీపీఠాగ్రాకరిరాజ! డుంఠిరాజ! నిన్ను నేను ఏరీతిగా వర్ణిస్తాను. జయ విఘ్నేశ్వర! జయ భక్త నిర్విఘ్న కారక! జయ అవిఘ్నకర! జయ సర్వగణాధీశ! జయ సర్వగణాగ్రగణ్య! జయగణ ప్రణుతపాదాబ్జ! జయగణనాతీత! జయసగుణ! జయ నిర్గుణ! జయ సర్వజ్ఞ! జయ సర్వేశ! జయసర్వభూతవిధాన! జయ సర్వ మాయా ప్రపంచజ్ఞ! జయ సర్వకర్మాగ్ర పూజిత! జయసర్వ మంగళ! జయ అమంగళోపశమన! జయసిద్ధ వంద్యపద! జయసిద్ధనాయక! జయ సర్వసిద్ధి నిలయ! జయ సర్వబలాధార! జయ సర్వబలా




శ్రయ! జయ సర్వఫలప్రద! జయ బలాకోజ్జ్వల దంతాగ్ర! జయ అనంతమహిమాధార! జయ ధరాధరవిదారణ! జయ దంతాగ్రప్రోత్థదిఙ్నాగ! జయ నాగవిభూషణ! భువనములకు అభ్యుదయము కావించు."

అంతలో తన దృష్టి విష్ణుపై వ్రాలినది. ఒక బంభరము ఒక పుష్పముపై వ్రాలినట్లు వ్రాలినది. అందులో మధువున్నదో! సువాసనాలహరి యున్నదో! హరిని చూడగా తనకు ఆనందము కల్గినది. ఆ ఆనందము తన మూడుకన్నులలో పొడిచినట్లయినది. తాను అప్పుడు విష్ణువుతో ఇట్టు లనినాడు. విష్ణువును ఇట్టులని స్తుతించినాడు: గరుడధ్వజ! నువ్వు సహస్రశీర్షుడవైన పురుషుడవు. సహస్ర పాత్తువు. సహస్రాక్షుడవు. సహస్రధారుడవు. సప్త ద్వీపములు, సప్త సాగరములు నీవు. నీవు బ్రహ్మవు. నీవు విష్ణువవు. నీవు రుద్రుడవు. ఈ జగత్తు సర్వము నీవు. విష్ణూ! నీవు నారాయణుడవు. జలములను నారములు అంటారు. నీవు ఆ నారముల యనమై ఉనికిచేసి నారాయణుడవైనావు. హరి! సర్వప్రాణులను నీవు హరించగల శక్తి గలవాడవు. అందువలన నీవు హరివి అయినావు. శంకర! నీవు భక్తులయందు కరుణచేసి సుఖాత్మజీవనులను చేయగలవాడవు. అందువలన శంకరుడవైనావు. బ్రహ్మ! నీవు బ్రహ్మవు. బ్రాహ్మణత్వము నీయందు అభిబృంహణమై ఉన్నది. అందువలన బ్రహ్మవైనావు. మధునిషూదన! మధువులు అనగా ఇంద్రియములు. ఆ ఇంద్రియములను ప్రమథించి మధునిషూదనుడవైనావు. హృషీకములను త్రొక్కి హృషీకేశుడవైనావు. మాధవ! మా అనగా విద్య. ఆ విద్యకు నీవు ఈశుడవు. అందువలన మాధవుడవైనావు. గోవింద! గోవు భూమి. ఆ భూమి నీకు ప్రియసతి. అందువలన నీవు గోవిందుడవైనావు. ముని! మననము వలన మునివి. తపస్వి! అనఘ తపస్థితినిచేసి తపస్వివి. విశ్వమును శాసించుట వలన ఈశ్వరుడవు. జగత్పతి! సకలచ్ఛందములలో గాయత్రివి నీవు: జనార్దన! వేదములయందు ప్రణవమవు నీవు. త్రివిక్రమ! వర్ణములలో నీవు అకారమవు. శ్రీధర! ఆదిత్యులయందు విష్ణుడవు. హృషీకేశ! రుద్రులయందు శంకరుడవు. పద్మనాభ! అగ్నులలో నీవు పావకుడవు. సంకర్షణ! నీవు దేవతలలో పురందరుడవు. ప్రద్యుమ్న! గుహ్యకులలో కుబేరుడవు నీవు. గోవింద! దేవ మునులలో నీవు నారదుడవు. దైత్యులలో ప్రహ్లాదుడవు. నీవు. సర్పములలో వాసుకివి నీవు. నదులలో గంగవు నీవు. పర్వతములలో మేరువవు నీవు. వృక్షజాతులలో అశ్వత్థమవు నీవు. నిన్ను నేను ఏమని కీర్తించను! వస్తువులయందు ఉత్తమమైనది నీ విభూతి. నిన్ను నుతించడం ఎట్లా! నీవు లేక, ఈ కమలవాసిని లేక, నాకు తిరిగి కాశిక లభించేదా! నీవలన, కమలవాసినివలన, గరుడివలన, డుంఠివలన, మరల నేను కాశిని పొందగల్గినాను."

తాను ఈమాటలు అనగా సర్వదేవతలు, సర్వప్రమథులు, నవకోటి దుర్గలు, కోటి భైరవులు, కోటి కుమారులు, ఏడుకోట్ల వినాయకులు, షడశీతి సహస్ర మునులు, అందఱు గృహమేధులు, మూడుకోట్ల పాతాళతలభుజంగములు, రెండుకోట్ల దైత్యదానవులు, అష్టాయుత గంధర్వులు, కోట్యర్థ లక్ష రాక్షసులు, పదివేవురు విద్యాధరులు, అరువదివేలప్సరసలు, ఎనిమిది లక్షల గోమాతలు షణ్ణవత్యయుత సుపర్వులు, సప్తసాగరములు, ఎనిమిదివేల కిన్నరులు, మున్నూరు వైవస్వతులు జయజయధ్వానములు చేసినారు.

అంతలో తాను కమలవాసినిని, లక్ష్మిని కనుగొన్నాడు. ఆమెను ఎట్లు అభినందించవలయునో తనకు తెలియలేదు. ఆ తల్లి తనకు మేలు ఒనగూర్చుటకు ఇది మొదలా ? మున్ను తాను బ్రహ్మశిరమును గోటిగొడ్డలితో ఒడ్డిగిల్లచేసినప్పుడు, బ్రహ్మహత్య తన్ను వెంటనంటగా ఈ తల్లి, ఈ మహాలక్ష్మి మనోరథవతి అను పేర ప్రసిద్ధి బొందిన భిక్ష పెట్టినది. తరువాత తనకు బ్రహ్మహత్యాపాతకమును తొలగినది. బ్రహ్మహత్య పాతాళమున బడుట, హస్తమునంటియున్న ధాతృకపాలము ఊడి ధాత్రీతలమున బడుట, కాశి మహాత్మ్యమెట్లో, మహాలక్ష్మి మహాత్మ్యమును అట్లే. అప్పుడు తాను ఆమెతో ఆ మాటలే అనినాడు. ఈ విష్ణువువలన, ఈ కమలవాసినివలన, ఈ గరుడి వలన, తనకు కాశికా పునః ప్రవేశ భాగ్యము అబ్బినది. ఇప్పుడు ఆ విష్ణువు, కృష్ణుడై, కాశికి విద్యాభ్యాసమునకుగా వచ్చుచున్నాడు. ఆయనకు తాను ఎట్టి స్వాగతసత్కారములు జరుపవలయును ? పరమశివుడు డుంఠిని చూచినాడు. దండపాణిని చూచినాడు. ప్రమథులను చూచినాడు. నందిని చూచినాడు. అన్నపూర్ణను చూచినాడు. వారికి ఆయన భావమేమో అర్థమైనది. ★

—హారీత శివశర్మ.



వెలుగు వికృతి

కలువకొలను సదానంద

"అబ్బబ్బ! ఈతెలుగు మేష్టార్లతో వచ్చిన చిక్కే యిది......" అన్నాడు ఆలోచనలతో విసిగి పోయిన వాసు—గట్టిగా బల్లగుద్ది.

"ఏమిట్రా—ఏదో వాగుతున్నావ్? మంత్రిలా బల్లగుద్ది?..." అంటూ తాతయ్య వాసు పక్కన వచ్చి కూర్చున్నాడు.

"మంతిరిగాదు తాతా! నా బుర్రంతా ఓంమంతరకాళీ! రేపు బళ్ళో నా పీపంతా ఛూమంతరగాళీ..."

"అంత పెద్ద అపాయము ఏమి ముంచుకొని వచ్చినదిరా?......" అన్నాడు తాత.

"అపాయమే! డేంజరు! ఈ తెలుగు పండితులు చాలా ఖ్రూరులు! ఖటినాత్ములు! మమ్ములను మంటలలో తోసి కాల్చుచున్నారు. రంపములతో కోయుచున్నారు. సూలములతో గుచ్చుచున్నారు. ఈ విధముగా భాదించుచున్నారు........ హాయ్యో మా ఆరోకళాసు బాలురు ఏమిగతి?......"

"అయ్యో పాపము!" అన్నాడు తాత..."తెలుగు పండితునిగతి!... నీ భాషతో ఢీకొంటే కత్తులే మొక్కబోతాయి. పోనీ-మీ ఆరోకళాసు బాలురందరూ నీ అచ్చులో బొమ్మలేనా..."

"ఛా! నా వెనకాలే ఎవరైనా గానీ!... తెలుగులో మాక్లాసుకంతా నేనే ఫష్టు!..."

తాతయ్య ఆశ్చర్యపడిపోయాడు. "ఏమిటేమిటీ? నువ్వా ఫష్టా? అయితే-ఒక్కొక్క క్లాసుకంతానూ ఒక్కొక్క అబ్బాయే వుంటాడన్న మాట..."

"కాదు! నలభైమంది! నలభైమంది! నలభైమంది!..."

"అలాఅని నువ్వు నలభైసార్లు అనకు! సరేలే! అయితే నలభయ్యో అబ్బాయికి మొన్న పరీక్షల్లో తెలుగులో ఎన్ని మార్కులు?"

"పడ్చాడులే! నాకే సున్నావస్తే-వాడికేమొస్తాయి మార్కులిక? ఇంగిలీషులో నాకు తెలుగుకన్నా ఒకమార్కు ఎక్కువేలే! తెలుగు మేష్టారుకు మార్కులివ్వడం చేతగాకపోయినా పిల్లల్ని బటాణీల్లా

నమిలేయడం మాబాగా వచ్చు."

"ఇంతకూ ఆయన వల్ల నీకు వచ్చిన చిక్కేమిటి?..."

"చూడు తాతా! రేపు వుపన్యాసం పోటీలు. అందరూ - నేను కూడా - మాట్లాడాలిట! పోటీలో ప్రతివాడూ - దిక్కులేని వారికి దేవుడే దిక్కు - అనే నీతివచ్చేకథ - వాడికాకథరాసీ, రాకపోసీ-పుస్తకం భాషలో చెప్పాల్సిందేనట! పోటీకి రాని వాళ్ళనంతా తాట ఒలిచేస్తాడట! అప్పణ్ణుంచీ యిప్పటిదాకా ఆలోచిస్తున్నా. నాకు అట్లాంటి కథేదో తోచి చావదే! దిక్కులేని వాడికి దేవుడేదిక్కట! దేవుడా! నాకుదిక్కులేదు. నువ్వేదిక్కు!"

తాతయ్య సన్నగా నవ్వాడు. "ఒరేయ్ మనమడా! దిక్కులేని వారికి దేవుడేదిక్కు. ఆకథ నీకు చెప్పమని దేవుడు నాతో చెబుతున్నాడు. వినుమరి..." అంటూ తాతయ్య కథ ప్రారంభించాడు.

"ఒక చిట్టడవి. ఆ అడవిలో ఒక చెట్టు. ఆ చెట్టులో ఒక చిన్న తొర్ర. ఆ తొర్రలో రెండు పావురాలు. ఒకనాటి ఉదయం ఆ రెండు పావురాలు చెట్టుకొమ్మ మీద కూర్చుని హాయిగా కబుర్లు చెప్పుకుంటున్నాయి. ఉన్నట్టుండి క్రింద పొదల్లో ఏదో అలికిడైంది. చూస్తే ఏముంది? ఒకవేటగాడు...వాడెలా వున్నాడంటే-యముడు తెలుసా నీకు. ఆ యము డెలా వుంటాడో తెలుసా నీకు?..."

"తెలీదు ఎలా వుంటాడు యముడు?" అన్నాడు వాసు.

"యముడు వేటగాడిలా వుంటాడు..."

"మరి-వేటగాడెలా వున్నాడు?"


"యముడిలా వున్నాడు..."

"ఆ యిద్దరూ ఎలా వుంటారు?"

"అన్నదమ్ముల్లాగా!..."

"ఏమిటి తాతా నువ్వు"...పోసీ

(43-వ పేజీ చూడండి)



సిగ్గు

కె. సరోజిని





పంకజమ్మకు ఒకటే భయం. రేఖ ఎటువంటివాడిని వివాహం చేసుకుంటుందో అని. కాని వేణు ఆమె మేనల్లుడే కదా।

రాత్రి పన్నెండు గంటలయింది. నటరాజనృత్య కళామందిర్ భవనంలో, మేడమీద తన గదిలో కూర్చొని శ్రీమతి పంకజమ్మ ముందురోజు తమ నాట్య బృందం అంతా కలిసి అశోక థియేటరులో ఇచ్చిన ప్రదర్శన తాలూకు ఫోటోలు, వాటిలో కొన్ని ముఖ్యమైనవి, బాగున్నవీ ఎంచి, వాటికి ఏయే వాక్యాల్ని రాస్తే సరిపోతాయో ఆలోచిస్తోంది. ఒక ప్రముఖ పత్రిక ఈ ఫోటోలతో కూడిన, నృత్య కళామందిర్‌ను ప్రశంసిస్తూ, దాని ఆదర్శాల నుగ్గడించే వ్యాసాన్ని పంపితే ప్రచురిస్తానంది. అందుకోసమే కళామందిర్ సంస్థ అధిపతి పంకజమ్మ అత్యుత్సాహంతో, వాటిని పరిశీలిస్తోంది.

ఆమెకు బాగా నచ్చిన ఫోటోలు రేఖా వేణూ కలిసి డాన్సు చేస్తూంటే తీసినవి. అందులో రేఖ సౌందర్యం, సౌకుమార్యం అభినయచాతుర్యం బాగా కన్పిస్తున్నాయి. వేణు నాట్యకుశలత కూడా బాగా తెలుస్తోంది. వీ రిద్దరూ కలసి రాధామాధవ మేనకా విశ్వామిత్ర సుభద్రార్జున నృత్యాలు చాలా బాగా చేశారు.

పంకజమ్మకి రేఖ అంటే అత్యంత అభిమానం. కళామందిర్‌లో రేఖ చేరి మూడు సంవత్సరాలయింది. ఆమెకు నాట్యం స్వతస్సిద్ధంగానే వచ్చినట్లుంటుంది. శరీరాన్ని అతి చాకచక్యంగా కదలించడంలోనూ, ముద్రల్ని చక్కగా పట్టడంలోనూ, హావ భావ ప్రకటనలోనూ, రాగ తాళబద్ధంగా అభినయించడంలోనూ, రేఖ ఎంతో సమర్థత ప్రకటిస్తుంది. ముగ్ధ నాయికగా ఒక నృత్యంలోనూ, ప్రౌఢ నాయికగా వేరొక నృత్యంలోనూ అభినయం చూపగల శక్తి ఆమెకే వుంది. కళ కొందరికి పుట్టుకతోనే అబ్బుతుంది. నేర్చుకోవడం, కేవలం సహజ రత్నానికి సానబట్టడంలాంటిది వాళ్ళ విషయంలో. రేఖ నృత్యం అతి స్వాభావికంగా రమ్యంగా ఉంటుంది.

పంకజమ్మకు నలభై అయిదే ళ్ళుంటాయి. కొద్దిగా లావెక్కిన శరీరం, ఇప్పుడిప్పుడే కొద్దిగా తెల్లపడుతున్న జుట్టు, కళ్ళజోడు పెట్టుకున్న ఆమె ముఖం గంభీరంగా వుంటుంది. ఆమె నృత్యం చాలా బాగా చేసేది. పదేళ్ళ క్రితం ఆమె భర్త చనిపోవడంతో నృత్య ప్రదర్శన లివ్వడం మానేసి పిల్లలకు నృత్యం నేర్పటానికి పూనుకుంది. పంకజమ్మ భర్త గోపాల్ ప్రఖ్యాత నర్తకుడు.. అతనూ పంకజమ్మ కలిసి దేశమంతటా తిరిగి అనేక వందల ప్రదర్శన లిచ్చి, గొప్ప పేరూ ధనం సంపాదించారు. పంకజమ్మ భర్త పోయిన దగ్గర్నుంచి నటరాజ నృత్య కళా మందిర్ స్థాపించి చాలమందికి నాట్యం నేర్పింది. ఆమె శిష్యులలో గాని, శిష్యురాండ్రలోగాని ఆమెకు నచ్చిన వ్యక్తి ఒక్కరూ ఆమెకు కన్పించలేదు, ఒక్క రేఖ తప్ప.

భరత నాట్యం చేసే, అన్ని లక్షణాలుగల యువతి రేఖ మాత్రమే అని పంకజమ్మకు ఆమెమీద అభిమానం. రేఖను ఒక గొప్ప నర్తకిగా రూపొందించి దేశమంతటా ఆమెచేత ప్రదర్శన లిప్పించాలని పంకజమ్మ అభిలాష.

మూడేళ్ళ క్రిందట రేఖ తనొక అనాథననీ, కొద్దిగా నృత్యం వచ్చుననీ, తన వలన ఏదైనా పని చేయించుకుంటూ తనకి నృత్యం నేర్పమనీ, కనీసం తన కొక పనిని చూపించమనీ, పంకజమ్మ వద్దకు వచ్చింది. రేఖను చూస్తూనే పంకజమ్మ ఆమెలో కళాకారిణి కుండవలసిన లక్షణాలన్నీ వున్నాయని గ్రహించింది.

ఆనాటినుంచీ పంకజమ్మ రేఖను కన్న కూతురులా చూసుకుంటూ విద్యను నేర్పింది. నేటికి రేఖ ఇంచుమించు పంకజమ్మ స్థాయికి వచ్చింది. నృత్యంలో అప్పుడే రేఖ ప్రదర్శనాలు అనేక వేల ప్రేక్షకుల మన్ననలు పొందాయి. ఆ క్రితం రోజు రాష్ట్ర గవర్నర్ గౌరవార్థం జరిగిన ప్రదర్శనకు జనం ఇసుకవేస్తే రాలనంతగా వచ్చారు. గవర్నరు గారు రేఖను చాలా ప్రశంసించారు.

పంకజమ్మకు రేఖ విషయంలో ఒకే ఒక భయం వుంది. రేఖకు వివాహం కాలేదు. ఆమె వివాహం చేసుకుంటే ఎటువంటివాణ్ణి చేసుకుంటుందో. ఏమాత్రం తప్పటడుగు వేసినా ఆమె కళకుగల ఉజ్వలభవిష్యత్తు నాశనమై పోతుంది. వీలైనంతవరకూ రేఖను అవివాహితగానే వుంచి ఆమెలోవున్న కళకు తగిన ప్రాశస్త్యం లభించేట్టు చెయ్యాలని పంకజమ్మ కోరిక.

కాని తన కోర్కె కొనసాగడం కష్టమని పంక

(89 వ పేజీ చూడండి)

మానవనైజం

(25-వ పేజీ తరువాయి)

"ఊఁ!!...." నల్లని చూసినట్లు చూశారు డాక్టరుగారు.

"పిల్లాణ్ణి మీరే రక్షించాలండి! .... మీ పాదాలు పట్టుకొంటా! నా జీవనజ్యోతి నెలాగైనా కాపాడండి డాక్టరుగారు! ...."

"ఇప్పుడు చూడను. రేపు ప్రొద్దుట కనిపించు!" తాపీగా చెప్పి, మళ్ళీ ఆటలో నిమగ్నమయ్యారు డాక్టరుగారు.

"అలా అంటే కాదండి! పిల్లవాడు చావు బ్రతుకుల్లో ఉన్నాడండి. కాపాడి పుణ్యంకట్టుకోండి! ...." కన్నీరు మున్నీరుగా విలపించేడు పంతులు.

"చెప్పేది వికే! ఇప్పుడు వీలుకాదు!...." కొంచెం కఠినంగా ఉంది. మంత్రితో మరో ఎత్తు ఆలోచిస్తున్నారు డాక్టరుగారు.

పంతులు కొయ్యబారిపోయాడు. కాస్సేపటిదాకా నోట తడిలేదు. రోమునగరం ఒకపక్క తగలబడిపోతుంటే, వయొలిన్ వాయిస్తూ ఆనందించినవాళ్ళున్నారని తానెక్కడో పుస్తకంలో చదివేడు. కాని .... ఇక్కడ ప్రత్యక్షంగా చూడగలిగేడు!

తడబడే అడుగులతో, చేసేదిలేక, బయటికి దారితీశాడు పంతులు. బయటికొచ్చి గాఢ నిశీధిలోకి ఓసారి పిచ్చివాడిలా చూశాడు కడుపురగిలే ఆవేదనతో. ఇంతలో భుజంపైన చల్లని స్పర్శ తగిలింది. ఊపిరి ఉందేమోనని చూశాడు... ఇంకెక్కడి పసివాడు! వాని ప్రాణవాయువులీఅనంతవిశ్వంలో ఎప్పుడో లీనమైపోయాయి!" తల నేలకేసి బాదుకొన్నాడు పంతులు. బావురుమంటున్న గుడిసెకేసి చూసి గొల్లుమన్నాడు. గుడిసెలో దీపం ఎప్పుడో ఆరిపోయింది. పంతులు ఆశాజ్యోతికూడా ఆరిపోయింది.

*

జీవితంలో వెలుగునీడలు తరుచు ఒకదాని వెనుక మరొకటి వస్తూనే ఉంటాయి. కాని .... కొన్నిజీవితాలలో ఎప్పుడూ నీడలే ఎదురవుతాయి. జీవితంలో తాను ఎవరికీ కల్లోనైనా అపకారం చేయలేదని పంతులుకి బాగా గుర్తున్నది. కాని .... "తనకే ఈ శిక్ష చేశాడు భగవంతుడు! ఎందుకు?... ఏమో! తనకి తెలియదు!....ఈ జీవన్మరణాల ఆంతర్యం తనకేం అర్థమవుతుంది?...దీనికి కొంతవరకు బాధ్యుడు డాక్టరు...అయితే నేం? అతనికేం లోటు?...తానింకా ఇలాగే జీవించితీరాలి!... చావలేడు కాబట్టి! ...." నిట్టూర్పు విడిచేడు పంతులు.

పసివాడు చనిపోయిననాటినుంచి పంతులు పిచ్చివాడిలా తయారయాడు. మాసినజుట్టు, మలినదేహం, ఎప్పుడూ తనలో తానేదో గొణుక్కుంటూండేవాడు. తరుచు ఏటిఒడ్డున తాను ప్రేమతో పెంచిన బంతిమొక్కలమధ్య కూర్చుని, ఏదో ఆలోచిస్తూండేవాడు.

పంతులు లోకాన్ని మరిచిపోయినా, లోకం పంతుల్ని మర్చిపోలేదు. చాలినంత సానుభూతిని మాత్రం అందించింది. అయినా ఆ సానుభూతి పంతుల్ని మార్చలేకపోయింది....వాడి, రాలిపోయిన పూవుని మళ్ళీ ఎప్పటిలాగా రంజింపచేయగలవారెవరు?

ఆరోజు అట్లతదియ. పుచ్చపూవులాంటి వెన్నెల ఏటిలో నీటిమీదపడి తళతళ మెరుస్తోంది. చల్లగా వీస్తున్న పిల్లగాలి ఏటిఒడ్డున ఉన్న చిన్న మొక్కల్ని నెమ్మదిగా అటూ ఇటూ ఊపుతోంది. చిట్టడవిలోని సర్వేచెట్లు గాలికి చక్కని సంగీతం వినిపిస్తున్నాయి.

పల్లెపడుచులంతా అనేకరకాల వినోదాలలో మునిగితేలుతున్నారు. ఏటి ఒడ్డున ఇసుకతిన్నెల్లో చేరారు రెడ్డిగారి రమణ, డాక్టరుగారి కమల, మున్సబుగారి ముద్దులపట్టి మాణిక్యం మొదలైన బాలికలంతా. కేరింతలు కొడుతూ దాగుడుమూత లాడుకొంటున్నారు. పొదలమాటున దాగేవారు, పరుగెత్తేవారు, పొదివి పట్టుకునేవారు — ఇలా పరిపరివిధాలుగా ఆట సాగుతున్నది.

అంతవరకూ ఒక్కసారైనా కమల 'దొంగ' కాలేదు. ప్రస్తుతం రెడ్డిగారి రమణ 'దొంగ.' కన్పించకూడదనే పట్టుదలతో కమల ఒక పొద చాటున నక్కింది. దాక్కొన్న కమలకు .... పాపం.. దరిదాపుల్లోనే ఉన్న పాములపుట్ట కన్పించలేదు. అంతే! .... కాలు తొక్కుడుపడిన కృష్ణసర్పం



కస్సుమని కాటేసింది! 'కెవ్వు'మని కేకవేసి కమల నేలకూలింది నోట నురగలు కక్కుకొంటూ.

రంగనాథంగారింట్లో ఆనాడు శోకదేవత తాండవిస్తోంది. మున్సబుగారు, కరణంగారు మొదలైన పల్లె ప్రముఖులంతా రంగనాథంగార్ని ఊరడిస్తున్నారు. కమల ఇంకా నురగలు కక్కుతూనే పడివుంది. రంగనాథంగారు కలలోనైనా ఊహించని ఈ హఠాత్పరిణామానికి పిచ్చెత్తినవానిలా తల బాదుకొంటున్నారు. సావిత్రమ్మగారు కన్నీరు మున్నీరుగా శోకిస్తున్నారు. పాములమంత్రగాళ్ళెందరో వచ్చి తమ గరిడీలు చేసి చూపించారు. ఫలితం శూన్యం! కమల ఎప్పటిలాగే కదలకుండా పడివుంది.

మున్సబుగారాలోచించారు: "ముక్కుపచ్చలారని ఈ పసిబాలను కాపాడే అవకాశం ఏమీ లేదా? .... ఆ!!! ఉంది! .... పంతులొక్కడే నల్లతాచు కాటుకి మంత్రం వేసే మొనగాడు..." వెంటనే మనిషిని పంపేరు పంతుల్ని తీసుకు రమ్మని.

* * *

రోజూలాగే ఏటిఒడ్డున బంతిమొక్కలమధ్య కూర్చుని ఏటిలోకి చూస్తున్నాడు పంతులు. అతని కిప్పుడు ఏడవటానికి ఏడుపుకూడా రావటం లేదు. మనస్సు కొంత గట్టిపడింది.

"పంతులుగోరూ! .... "

ఎదురుగుండా డాక్టరుగారి పాలేరు వెంకడు.

యాంత్రికంగా ఏటిలోకి ఒకసారి, వెంకడి మొహంలోకి ఒకసారి చూశాడు పంతులు.

"డాక్టరుగోరమ్మాయిగోర్కి పాము కర్సిందండి! తవర్ని ఉన్నపాళంగా పిల్సుకురమ్మని తోలేరండి మున్సబయ్యగోరు!"

మళ్ళీ ఏటిలోకి చూస్తూ ఆలోచిస్తున్నాడు పంతులు తానెందుకు వెళ్ళాలి అని: "నా బతుకే నేలకూలిందిగా! ఎవళ్లెలా పోతే నాకేం? .... అందులోనూ హృదయం, అంతఃకరణా లేని ఆ నరపశువుయింటికి నేనా వెళ్లడం!" తల అడ్డంగా తాటించేడు.

"నే రానని చెప్పు!!!" గట్టిగా అరిచేడు పంతులు. అదిరిపడి ఇంటికి దౌడుతీశాడు వెంకడు.

అప్పుడే పొద్దు గూకింది. చేలలోంచి లేల్లాయి పాటలు పాడుకొంటూ, పశువుల్ని తోలుకుంటూ ఇంటివైపు మళ్ళుతున్నారు రైతులు. పసిరి చేనులో కూచొని, తీతువుపిట్ట ఒకటి అదేపనిగా కూస్తోంది.

ఏటిలోకి చూసి చూసి ఇంటిముఖం పట్టేడు పంతులు.

రంగనాథంగారి ఇంట్లోంచి పెద్దపెట్టున ఏడుపులు వినిపిస్తున్నాయి. అవి కరడుగట్టిన తన గుండెల్నికూడా చీల్చుతున్నవి: "పాపం! చావు బతుకుల్లో కొట్టుమిట్టాడుతున్న ఓ అమాయకపు ప్రాణికై ఆక్రందన!" అనుకొన్నాడు పంతులు... "ఆ పసిప్రాణి సరిగా తనకొడుకు లాంటిదే! ఆ ప్రాణి తనకేం చేసింది? .... ఒక ప్రాణికై మరొక ప్రాణి బలి! ఇదేనా తన జీవిత సగమార్గం?"

"కాగు! .." గట్టిగా అనుకుంది ఈసారి పంతులు. అప్రయత్నంగా అతని కాళ్ళు రంగనాథంగారింటికి దారితీశాయి.

"పంతులూ! వచ్చావుటయ్యా! నిండు ప్రాణాన్ని నిలబెడుదూ! నీకు పుణ్యం ఉంటుంది" అన్నారు మున్సబుగారు.

మంత్రముగ్ధుడిలా నడుస్తున్న పంతుల్ని నిర్ఘాంతపోయి చూశారు జనం అంతా. పంతులు బాలికను సమీపించేడు. మనస్సులో దేవుణ్ణి ఒకసారి తలుచుకొని, చెవిలో చిటికవేసి ఏదో మంత్రం చదివేడు. .... కాస్సేపటిలో నిద్రనుంచి మేల్కొన్నట్లు కళ్ళు తెరిచింది కమల. రంగనాథం దంపతుల ఆశ్చర్యానికీ, ఆనందానికీ అవధుల్లేవు.

ప్రాణదాతకు పదినూర్ల రూపాయ లర్పించబోయారు డాక్టరుగారు. డబ్బుకేసీ, డాక్టరుగారికేసీ ఊహకందని ఓ వింతచూపు చూసి బయటకు నడిచాడు పంతులు వడిగా.

"బంతిపూలు కోసుకోనా అంటే మాట్లాడవేం తాతయ్యా?"

ఉలిక్కిపడ్డాడు పంతులు. ఎదురుగా నిలబడిన కమలకేసి ఒకసారి చూసేడు.

"రా! అమ్మా! నీ క్కావల్సినన్ని కోసుకో!" అప్రయత్నంగానే అనేశాడు.

"తన జీవితంలోని ఆశలు ఓ వ్యక్తి నిర్దాక్షిణ్యంగా కూల్చేశాడు. అదేవ్యక్తి ఆశలు తాను నిలబెట్టేడు .... బహుశా ఇదే కాబోలు మనిషి నైజం! మానవుడింకా దానవుడు కాలేదు!" తృప్తిగా నవ్వుకొన్నాడు పంతులు. ★

(ఒక ఆంగ్లకథ ఆధారంగా)

క్షమాహతుడు

(23-వ పేజీ తరువాయి)

తమాయించుకుంటూ "బాబూ, లోకులు కాకులు అన్నారు. వాళ్ళ మాటలు మనసు పట్టించుకో కూడదు" అన్నాడు.

మృత్యుంజయుడు చిన్నగా నవ్వుతూ "అవును అది తెలుసు అనుకోండి. కానీ ఆ లోకులు అను కునే సంగతులు తెలియవు. చెప్తే విని ఆనం దిస్తాను" అన్నాడు.

కరణం కాస్సేపు ఆలోచించి తల తాటించి ప్రారంభించాడు.

"అతను...రాఘవేంద్ర లేడూ....అతను ప్రజ లకు నూరిపోశాడు. అంటే....అతనే వాళ్ళ అను మానాలకు కారకుడు.....మీరు " కొంచెం సందే హించి మళ్ళీ ప్రారంభించాడు.

"అదే...అతను అన్నది....మీరు దయ్యమనీ, పిశా చమనీ, భూతమనీ, ప్రాణాంతకుడనీ, ఆ కోవకు చెందినవాడనీ, ఆరు వందలనాడి, ఎనిమిది వందల సంవత్సరాలనాటివాడనీ అంటున్నాడు .... ఇది నమ్మతగ్గ విషయం కాదనుకోండి.....నిండా పాతి కేళ్ళు లేని వాణ్ణి పట్టుకుని—ఒకటికాదు, రెండు కాదు ఎనిమిదివందల సంవత్సరాలనాటి వాడంటే విన్నవాళ్ళు చెప్పుతో తంతారు" అంటూ ఆగాడు. మృత్యుంజయుడు స్వగతంగా నవ్వుకున్నాడు. అందులో పరగతమైనదాన్ని పసిగట్టిన కరణం ఆ నవ్వులో తననవ్వూ కలిపాడు. తర్వాత కరణం వెళ్ళిపోయాడు. మృత్యుంజయుడు కారు తీసు కుని ఊరు చివర చేరుకున్నాడు. అతనిలో ఎందుకో కొన్నాళ్ళనుండి కనబడని ఉత్సాహం వడ్డితో సహా కనిపిస్తోంది. కారణం ఎందుకో అతనికే తెలిసిఉండదు. ఆ కారణం ఆలోచించేపరిస్థితిలో కూడా అతను ఉండిఉండడు.

మృత్యుంజయుడు పొలం గట్లమీద నడుస్తూ, రైతులమూ, రైతాంగవలమూ చూసి ముచ్చట పడుతూ "ఎంత ఆనందం పొందుతున్నారు" అను కుంటూ అలా అనుకోడంలో వచ్చే ఆనందాన్ని పొందసాగాడు. ఇంతలో ముందుకు నడుస్తున్న అతని కాళ్ళతోపాటు ఏకీభవిస్తున్న తలను మరోతల ఢీ కొంది. పరధ్యానంలోంచి ధ్యాస్నంద్వారా అసలు స్థితిలోకివచ్చి అబ్బా అనుకుంటూ ముందుకు చూశాడు. అతని తాకిడికి ఒక కన్నె పడుచు తూలి పొలంలో పడిపోయింది. "అరే" అంటూ అతను గట్టు దిగి ఆమెచెయ్యి పుచ్చుకున్నాడు. ఆమె తల ఎత్తి అతనికేసి చూసింది.....అతనికి 'తల' గిర గిర తిరిగినట్లయిపోయింది. మృత్యుంజయుడు 'అబ్బా' అంటూ తల పట్టుకున్నాడు. ఆమె లేచి నించుంది. అప్పటి కప్పుడే అతని వళ్ళంతా చెమ టలు పట్టేసింది. అతనిని చూసిన ఆమె భయంతో ఆ ప్రదేశంనుంచి పారిపోయే ప్రయత్నంలో రెండు అడుగుల మేర జయించింది. మృత్యుంజయుడు చటాలున లేచి "సుగుణా! నువ్వేనా? నన్ను కనిక రించు. నేనీ యాతన పడలేను" అని అరుస్తూ ఆమెకాళ్ళు పట్టుకున్నాడు. ముందుచూపుగల ఆమె [illegible] తోయిని కౌరికి తప్పించుకుని పరుగు ప్రారంభించింది. ఈ సంఘటనలోని 'ఘర్షణ' విన్న పరిసరరైతులు పరుగుపరుగున వచ్చి చుట్టు ముట్టారు. మృత్యుంజయుడు ఆమె రెండు కాళ్ళూ పుచ్చుకుని "సుగుణా! నన్ను క్షమించు. నిన్ను అన్యాయం చేశాను. అనుభవించాను. ఇక అనుభవించలేను" అంటూ పెద్దగా వెక్కుతూ ఏడుపు ప్రారంభించాడు. ఆపిల్ల కదలలేక అలాగే శిలాప్రతిమలా ఉండిపోయింది. జనంకూడా ఆ దృశ్యాన్ని చూసి మంత్రముగ్ధుల్లా అలాగే ఉండిపోయారు. అలా ఉండలేని ఒకడు "ఏమి టిది? ఎంత జమీందారువైతేమాత్రం ..... నడి బజార్లో....అదే....ఇంతమంది తిరిగేచోట ఒక పరాయిఅమ్మ కన్న పిల్లని ఇలా పట్టుకుం టావా?" అని అరిచాడు. దాంతో జనులు మేల్కొని "అవును, అవును" అన్నారు. మృత్యుంజయుడు తనపట్టు విడవకుండా అలాగే పట్టుకుని అలాగే అరుస్తున్నాడు. చూపరుల్లో ఒకడు "చూస్తా రేం? లాగి పారెయ్యక" అన్నాడు. ధైర్యం ఉందను కున్న ఒక పదిమంది ముందుకు దూకి మృత్యుం జయుణ్ణి దొరకపుచ్చుకుని లాగిపారేశారు. ఆ పిల్ల మాత్రం అలాగే ఉండిపోయింది. మృత్యుం జయుడు వాళ్ళని వదుల్చుకుంటూ "సుగుణా! మాట్లాడవేం?" అని అరవసాగాడు. జనం అతనిస్థాయి శృతిమించిందని గ్రహించి నాలు గైదు తాపులు తన్నారు. మృత్యుంజయుడికి మృత్యుంజయుడు పూనాడు. అతను వాళ్ళతో



తలపడ్డాడు. వెర్రెత్తిన కోపంలో అందర్నీ ఇష్టం వచ్చినట్లు తన్నడం ప్రారంభించాడు. ఈ వార్త చేరిన కరణం పరుగుపరుగున అక్కడకు చేరారు. కరణాన్ని చూసి జనం నిశ్శబ్దంగా నించున్నారు. "ఏమయ్యింది బాబుగారూ?" అన్నాడు కరణం మృత్యుంజయుణ్ణి సమీపిస్తూ. మృత్యుంజయుడు ఆయనచెయ్యి పుచ్చుకుని "రండి మీతో ముఖ్య మయిన పని ఉంది" అని కారుకేసి పరిగెత్తాడు. కరణం తనచెయ్యికోసం అతనివెంట పరిగెత్తాడు.

*　　*　　*

లోపల హాల్లోకి రావడంతోనే "కూర్చోండి" అన్నాడు మృత్యుంజయుడు. కరణాన్ని ఉద్దేశించి. కరణం కూర్చోంగానే అతను ప్రారంభించాడు. "నాకు ఆ పిల్లని వివాహంచేసుకోవాలని ఉంది.... సరస్వతిని పెళ్ళాడేముందర నాకు మరో వివాహం జరిగింది. నా మొదటిభార్యకూ, ఆ అమ్మాయికీ పోలికలు ఉన్నాయి. నా మొదటి భార్య పేరు సుగుణ" అని వెర్రిగా అరిచాడు. కరణం నిర్విణ్ణు డయ్యాడు.

"అవధాన్లుగారమ్మాయిపేరూ సుగుణే!" బలేగా ఉందే!" అన్న మాటలు అతని నోటివెంట వచ్చాయి. వెనువెంట రాఘవేంద్ర చెప్పిన 'కథ' గుర్తుకు వచ్చింది. తల తాటిస్తూ కరణం లేచాడు.

"బాబూ! నా శాయశక్తులా ప్రయత్నిస్తాను. నామీద విశ్వాసం ఉంచారు. అదే చాలు" అన్నాడు. మృత్యుంజయుడు తల విదిలించాడు.

"ప్రయత్నంకాదు కరణంగారూ, సాధించాలి. నా ఆస్తంతా వాళ్ళకు రాసిచ్చేస్తాను. ఆ పిల్లని నాకిచ్చి వివాహం చెయ్యమనండి. నాకు చాలు. నాకు ఆ పిల్లవల్ల ఆనందం, ముక్తి, విముక్తి లభిస్తాయన్న నమ్మకం నాకుంది" అతను ఆయాస పడటం ప్రారంభించాడు.

అతని మాటల్లో చివరపదాలకు అర్థాలు తెలియకపోయినా, కరణం ఆ పదాలజోలికి పోకుండా తన పనిజోలికి పోయే ప్రయత్నంలో "మీరు విశ్రాంతిగా ఉండండి" అనేసి చకచకా వెళ్ళి పోయాడు. మృత్యుంజయుడు ఆయాసంతో రొప్పుతూ సోఫాలో కూర్చున్నాడు.

*　　*　　*

కరణం ఎన్నివిధాల చెప్పినా, అన్నివిధాలా అవధాన్లు తనపిల్లని ఇవ్వనంటే ఇవ్వనంటూ అరుగెక్కి కూర్చున్నాడు. 'సరేలే రేపు దిగక పోతాడా" అనుకుని కరణం ఇంటిదారి పట్టాడు.

*　　*　　*

రాత్రి ఎనిమిదిన్నర అయింది. కరణం వసారాలో బల్లఉయ్యాలమీద కూర్చుని 'అదే విషయం' ఆలోచిస్తున్నాడల్లా గుమ్మంలో వినిపించిన "నమ స్కారమండి"ని చూడడానికి తలెత్తాడు. చూస్తూ ఎగిరి బల్లమీంచి దిగి "నువ్వా" అన్నాడు.

"ఆ! నేనే" అంటూ ఆ 'నేను' ఒక కుర్చీలో కూర్చుంది. కరణంముఖం తామరకమలంలా వికసించింది. అయినా తమాయించుకుని "ఏం పనిమీద వచ్చావమ్మా పొద్దుపోయి" అన్నాడు. ఆ మాటలకు ఆపిల్ల రెండు క్షణాలు మౌనంగా ఉండి ప్రారంభించింది.

"మీరు మా నాన్నగారితో చెప్పిన మాటలు విన్నాను. ఆ బాబుగారి స్థితి కళ్ళారా చూశాను. ఆయన తను పోగొట్టుకున్న వస్తువేదో నాలో చూశారు. అందుకనే అలా ప్రవర్తించారు. కనుక.."

"కనుక?" అన్నాడు కరణం తనకు అదేమిటో తెలిసినా కూడా.

"కనుక....నేను అంగీకరిస్తున్నాను" ఆమె లేచి నించుంది. "చదువుకున్నదాని వనిపించావమ్మా" అన్నాడు కరణం ఆనందంతో. ఈలోగా అవధాన్లు వచ్చి నానా ఎగురుడూ ఎగిరాడు. "మీ ఎగురుళ్ళ వల్ల నా మనస్సు మారదు" అంది సుగుణ తాపీగా. కరణం అర్జంటుగా మునసబును పిలిపించి నచ్చ చెప్పించి, నచ్చచెప్పి అవధానుల్ని ఒప్పించాడు.

*　　*　　*

ఒప్పించిన రెండోనాటికల్లా వివాహం అయి పోయింది. మృత్యుంజయుడు మహదానందంతో తను వాగ్దానం చేసినప్రకారం తన ఆస్తి రాసి ఇచ్చేశాడు. అతనిలో మేల్కొన్న ఆనందాన్ని చూసి కరణం, వీరాస్వామీ నిండు హృదయాలతో ఆనందించారు. మునసబూ దాదాపు ఆహద్దుకే చేరాడు. మృత్యుంజయుని వివాహం అయి నాలుగు రోజులు అయ్యింది. అవేళ సాయంత్రం రాఘ వేంద్ర వచ్చాడు. వస్తూనే మృత్యుంజయుని పునర్వివాహంసంగతి తెలుసుకున్నాడు. అగ్గిమీద గుగ్గిలం జల్లినట్లయ్యింది అతని పరిస్థితి. తన చేతిలోఉన్న పుస్తకాన్ని సరాసరి కోటుజేబు లోకి తోసేసి, యకాయకి మునసబు ఇంటికి పరిగెత్తాడు. తీరుబాటుగా కూర్చొన్న మునసబు మీద ఎగిరిపడ్డం ప్రారంభించాడు. మునసబుకి

అండ కావలసివచ్చి దానికోసం కబురుపంపాడు. ఆ (అండ) కరణం అరక్షణంలో వచ్చాడు. "ఇపుడు చెప్పవయ్యా" అన్నాడు మునసబు ధీమాగా అండ చూసుకుంటూ.

"నేను చెప్పను" రాఘవేంద్ర బిగించుకు పోయాడు. ఆ మాటలకు వాళ్ళిద్దరూ ఆశ్చర్య పోయారు.

"అవును....పూర్తిగా పరిశీలించకమునుపే, అసంపూర్తిగా చెప్పడం నా తెలివితక్కువ....ఒక, ఒఖ్ఖవారంరోజుల్లో తేల్చేస్తాను .... అపుడు చెప్తాను. అయితే...." అతను ఆగాడు.

"అయితే.......?" మునసబు అందుకున్నాడు.

"మీరు ఒక్క సహాయం చెయ్యాలి. నా పరిశోధనకోసం నేను మృత్యుంజయుని ఇంట్లోనే మకాం పెట్టవలసివుంటుంది. దానికి మీరు నాకు సహాయం చెయ్యాలి...." అతను ఆగాడు. కరణం మునసబులు ఒకళ్ళ ముఖాలు ఒకళ్ళు చూసుకున్నారు.

"నేను అతనికి ఏమీ హాని చెయ్యను....నా విద్య సాక్షి" అంటూ అతను జేబులోంచి ఆ పుస్తకం తీశాడు. వా రిరువురి దృష్టి ఆ పుస్తకం మీద పడింది.

"ఇది....ఒకసంఘటన....ఇలాటి సంఘటనే చూసి రాసిన పుస్తకం....అంటే ఒక వ్యక్తి చూసి రాశాడట. దాన్ని యథాతథంగా యీ పుస్తకంలోకి ఎక్కించారు. దీని విలువ ఎంతో తెలుసా"

వాళ్ళిద్దరూ ఆలస్యంచేయకుండా తెలియదని చెప్పేశారు.

" నా జీవితం....దీని విలువ" అన్నాడు రాఘవేంద్ర పుస్తకం తనగుండెకు హత్తుకుంటూ. వాళ్ళిద్దరూ ఆశ్చర్యపోయారు.

"ఈ పుస్తకం.....కొన్ని వందల సంవత్సరాల నాటిది.....ఇప్పుడు నాపనంతా దీనితోనే ఉంది" అన్నాడు దానిని జేబులో పెట్టుకుంటూ. వాళ్ళిద్దరూ మాట్లాడలేదు.

"మరి నేను కోరిన విషయం...?"

మునసబుకరణాలు ఒకరిముఖం ఒకళ్ళు చూసుకున్నారు. కళ్ళతో ప్రశ్నించుకుని కనుబొమ్మలతో సమాధానం చెప్పుకుని, వాటిని సంగ్రహపరచి "సరే...ప్రయత్నిద్దాం" అన్నారు. కరణం లేచి నించుని "మీ పరిశోధన నెగ్గకపోతే నష్టపరిహారంగా వెయ్యి రూపాయలు ఇవ్వాలి. అతనికి ఏ విధమైనటువంటి అమర్యాదా రాకూడదు. అనుమానం తగలకూడదు....మీరు ... మీ పరిశోధన నిజమయితే...మా సహకారం ఎప్పుడూ ఉంటుంది. మేము 'న్యాయపక్షులం' అన్నాడు చేతులు ఎగరేస్తూ.

* * *

దీపాలుపెట్టేవేళ ముగ్గురూ కలిసి మృత్యుంజయుని ఇంటికి వెళ్ళారు. మృత్యుంజయుడు 'అతిథి'మర్యాదలతో వారిని యథావిధిగా సత్కరించాడు. "నోరువాటం' కల కరణం అసలు పని ఎరుకపరిచి "వారు ఏదో గ్రంథం రాసుకుంటారట. ప్రశాంత వాతావరణంకోసం మీ.....తమ....బంగళాలో ఒక చిన్న రూము ఇప్పించితే... ఓ వారంరోజుల్లో వెళ్ళిపోతారు" అంటూ

ఆగాడు. రాఘవేంద్ర "అవును" అన్నాడు చేతులు నలుపుకుంటూ. మృత్యుంజయుడు ఈ విషయం ఆలోచించడానికి అరక్షణంకూడా తీసుకోలేదు. చిరునవ్వుతో "వారికి నచ్చిన రూములో ఉండమనండి. నాకేమీ అభ్యంతరంలేదు" అన్నాడు పెద్దమనిషిలాగ. కార్యవాది అయిన రాఘవేంద్ర అవకాశాన్ని దుర్వినియోగం చేసుకోలేదు. "మేడమీది గది ఒకటి ఇప్పించండి చాలు" అన్నాడు దురాశ లేనట్లు. మృత్యుంజయుడు తక్షణం వాళ్ళను మేడమీదికి తీసుకువెళ్ళి ఒకగది ఇచ్చాడు. ఆ గది, పరిసరప్రాంతాలూ, వీళ్ళూ, వాటాలూ, కవాటాలూ చూసుకుని రాఘవేంద్ర తృప్తిగా తల ఊపుకున్నాడు.

* * *

అలా 'తల ఊపుకున్న' రాఘవేంద్ర నాలుగు రోజులు అయినా 'తలలు ఊపే పని' ఏమీ చెయ్యలేదు. మరో మూడురోజులదాకా మునసబు కరణాలు గడువునంగతి గుర్తుంచుకుని ఓపిక పట్టారు. ఆవేళతో అతని గడువు తీరిపోయిందని వాళ్ళు గ్రహించి, గుర్తుచెయ్యడానికి మృత్యుంజయుని ఇంటికి "అతను భార్యాసమేతంగా షికారు'కు వెళ్ళిన సమయంలో వెళ్ళారు. రాఘవేంద్ర చాలా గంద్రగోళాలలో ఉన్నట్టు కనబడ్డాడు. ఒక టేబులునిండా కాగితాలూ, కలాలూ, పుస్తకాలూ చిందరవందరగా ఉన్నాయి. రాఘవేంద్ర మరో రెండురోజులు గడువు ఇవ్వమని, అలోగా తనుగనుక ఏమీ తేల్చుకోలేకపోతే లెంపలు వేసుకుని దండాలుపెట్టి మరీ వెళ్ళిపోతానని బ్రతిమాలాడు. 'పోనీలే చూద్దాం మన సొమ్మేం పోయింది?' అన్నట్లుగా మునసబు కరణంకేసి చూశాడు. కరణం తన సమ్మతిని సూచించి, రాఘవేంద్రకేసి చూస్తూ, "రెండు రోజులు—అనగా నలభై ఎనిమిది గంటలు....అంతే...." అన్నాడు ఇంగ్లీషువాళ్ళ పద్ధతిలో ముక్తసరిగా. రాఘవేంద్ర తల ఊపాడు.

"సరే"నంటే "సరే"నని మునసబు కరణాలు ఇంటిదారిపట్టారు.

* * *

రాఘవేంద్ర పెట్టిన రెండురోజుల గడువు కూడా పూర్తయ్యింది. తెల్లారితే పూర్తవుతుంది అనగా ఆ రాత్రి రాఘవేంద్ర చాలా బాధ పడ్డాడు. తెల్లవారుతోంది అనికాదు, గడువు తీరిపోతోందే అని. గడువు తీరనేతీరింది. తెల్లవారి లేచి చాలా చిరాకుగా పచార్లు ప్రారంభించాడు. అతని కళ్ళు అనుకోకుండా క్యాలండరువంక చూశాయి. చూసి మెరిశాయి. రాఘవేంద్రముఖం గాలిపోసుకున్న బుడగలాగ ఉబ్బిపోయింది. (ఆనందంతో) రూములో కూర్చుని పుస్తకాలన్నీ సర్ది రాసిన కాగితాలను మడవడం ప్రారంభించాడు. ఆవేళ ఆదివారం!

* * *

పదిగంట లయ్యింది. పదకొండు అయ్యింది. పన్నెండు అయ్యింది. మునసబుకరణాలు "ఇదేం పెద్దమనిషి" అనుకున్నారు రాఘవేంద్రను గురించి. ఆసంగతి వెళ్ళి అడగాలంటే సాయంత్రం మృత్యుంజయుడు భార్యాసమేతంగా షికారు వెళ్ళాలి....అంతవరకూ లాభంలేదు. అది తెలిసిన విషయమేగనుక ఈలోగా వాళ్ళు అలాటి ప్రయత్నాలు చేయకుండా, రాఘవేంద్రను తిట్టుకుంటూ కూర్చున్నారు. అలా కూర్చుని ఉండగానే గడియారం మూడుగంటలు కొట్టింది. రాఘవేంద్ర ఆయాసంతో పరుగుపరుగున వచ్చి అరుగుమీద కూర్చున్నాడు. ఇందాకటినుండి అనుకుంటూ ఉండడంవల్ల వెంటనే మునసబు "ఏం పెద్దమనిషివయ్యా" అనేశాడు. రాఘవేంద్ర ఆయాసం తీర్చుకుంటూ ఆగమని అభయహస్తంతో సూచించాడు. వాళ్ళు ఆగినతర్వాత ప్రారంభించాడు.

"ఇవాళ రాత్రయ్యి తెల్లారేలోపునా తేలిపోతుంది. ఒక్కరోజు గడువియ్యండి చాలు...మరో విషయం..

"ఏవిటాః విషయం?" గద్దించాడు కరణం.

"ఇవాళ అతను షికారునుంచి వచ్చేసరికి మనం ముగ్గురం నా రూములో కూర్చోవాలి. మరో విషయం.....ఆ వీరాస్వామి ఆ బంగళాలో లేకుండా చెయ్యాలి" అతను ఆగి వాళ్ళకేసి చూశాడు. మునసబుకరణాలు "ఒళ్ళు మండిపోయిన పోజు"లో ఒకళ్ళకేసి ఒకళ్ళు చూసుకున్నారు. మునసబు పెద్దవాడు గనుక (ఉద్యోగరీత్యాకూడా)" "ఎందుకు అతనుంటే ఏం?" అన్నాడు ఉండకుండా చెయ్యడం ఎలాగో తెలీక. రాఘవేంద్ర రుమాలుతో నుదురు తుడుచుకున్నాడు.

"అతనుంటే యీ విషయం తన యజమానికి తెలియచేస్తాడు"

మునసబు ఒక్క నిముషం ఆలోచించాడు. వెంటనే పాలేరును పిలిచి వీరాస్వామికి కబురు పెట్టాడు. వీరాస్వామి ఆఘమేఘాలమీద వచ్చాడు. మునసబు అతనికేసి చూస్తూ "చూడు వీరాస్వామీ, జానకిరామయ్యగారు లేరూ, సరస్వతితండ్రి ఆయన్ని నేను రమ్మన్నానని చాలా జరూరుగా పిలుచుకురావాలి. ఈ రాత్రికి వెళ్ళి రాత్రి అక్కడ ఉండి తెల్లారేసరికి ఇక్కడ ఉండాలి. మీ అయ్యగారికి తోడు రాఘవేంద్రగారు ఉన్నారులే! అది గాక నేను పనివాణ్ణికూడా పంపుతాను" అన్నాడు. వీరాస్వామి 'అలాగే' అని వెళ్ళిపోయాడు. ముగ్గురూ సంతృప్తిగా నవ్వుకున్నారు.

* * *

అనుకున్నప్రకారం మృత్యుంజయుడు షికారునుంచి వచ్చేలోగా ముగ్గురూ 'ఆ'రూములో చేరి కూర్చున్నారు. రాఘవేంద్ర చాలా అలసటగా ఉన్నాడు. ఒక పుస్తకం, కొన్ని కాగితాలూ తీసి మునసబుకి ఇస్తూ "చూడండి! సైన్సును, విజ్ఞానాన్ని మీరు అనుమానించి అవమానించారు. ఈ రాత్రికి నేను రాసినట్లు జరిగితీరాలి....లేకపోతే నా విజ్ఞానం ఎందుకూ పనికిరానట్లే..... ఈ పుస్తకం మీజేబులో ఉంచండి. సంఘటన అవంగానే చూడండి. నేను రాసినట్లే ఉంటుంది. ఈ పుస్తకంకూడా చూడచ్చు" అన్నాడు. మునసబు యాంత్రికంగా ఆ పుస్తకాన్ని జేబులో పెట్టుకుంటూ "అయితే యీ రాత్రి ఆమె చనిపోతుందంటారా?" అన్నాడు. రాఘవేంద్ర తల విదిలించాడు. "చచ్చితీరాలని కాదు....

కావాలి.....లేకపోతే యీ కథ అంతం అవ్వా అవ్వాలి" అన్నాడు. "అంటే....ఇద్దరూ చచ్చిపోతారా?" అన్నాడు కరణం అనుమానంగా. రాఘవేంద్ర తల అడ్డంగా ఊపుతూ "దయచేసి ఇప్పుడేమీ అడక్కండి" అన్నాడు. ఇంతలో మేడమెట్లమీద చప్పుడు వినిపించి, చప్పుడు చెయ్యకుండా కూర్చున్నారు.

మృత్యుంజయుడు, సుగుణా రూములోకి వెళ్ళారు.

రాఘవేంద్ర ఆ రూమువైపు గోడకు చెవి ఆనించి వింటున్నాడు. కరణం మునసబులు చెరో కుర్చీలోనూ కూర్చుని భయంభయంగా గాలి పీల్చుకోసాగారు.

*　　*　　*

"ఇవాళ మీరు అదోలా వున్నారు" అంది సుగుణ జడ విప్పుకుంటూ. మృత్యుంజయుడు ఆమెమాటలు విని విననట్లు ఊరుకున్నాడు. ఆమె జుట్టు విరబోసుకుని తలలో చిక్కుకున్న పూలను విడదీసుకుంటూ మళ్ళా అదే ప్రశ్న వేసింది. మృత్యుంజయుడు చిన్నగా నవ్వి కిటికీవద్దకు వెళ్ళి గగనంలోకి చూస్తూ నిలబడ్డాడు. ఒక్క క్షణం నిశ్శబ్దంగా ఉండి "చెప్పనా" అన్నాడు. "చెప్పమనేగా" అందామె చంపలమీద చేతులువేసుకుని వినే పద్ధతిలో కూర్చుంటూ.

"నా మొదటి భార్య.....గుర్తుకువచ్చింది..."

సుగుణముఖంలో సంతోషరేఖలు ఎగిరిపోయాయి. ఆమె లేచి భర్తవద్దకువెళ్ళి ఆప్యాయంగా అతనిభుజంమీద చెయ్యి వేస్తూ "మీరు అలా బాధపడద్దని ఎన్నిసార్లు చెప్పాను?" అంది. నిజానికి ఆమె ఒక్కగా నొక్కసారి చెప్పింది. అదైనా పెళ్ళయిన కొత్తలోనే. మృత్యుంజయుడు ఆమెకేసి జాలిగా చూశాడు.

"సుగుణా ఆకథ ఇవాళ మీకు చెప్పాలి"

"చెప్పండి. నేనేం విననన్నానా? ఎప్పుడైనా చెప్తానన్నారా?" అంది ఆమె వెక్కిరింపుగా చూస్తూ.

"అయితే అలా కూర్చో...." అన్నాడు. కానీ ఆమె కూర్చోకుండానే....'ఊ చెప్పండి'.....అంది.

"అలా కూర్చో" అన్నాడు అతను మళ్ళీ. సుగుణ టేబులుమీద కూర్చుంది. అతను ఆమె ఎదురుగా నించుని ప్రారంభించాడు.

"నా మొదటి భార్య.....సుగుణ....అచ్చు నీ పోలికే! నీపేరే కూడా....."

"ఆమె పోలికా, ఆమె పేరే, నాకు" సుగుణ అతని మాటల్లో తప్పు సవరించింది.

"కాని...ఆమె ప్రేమ నన్ను ఆనందపరచలేదు. ఆమె మీద నాకు అనుమానం వచ్చింది. ఆమెశీలంమీద నాకు అనుమానంపుట్టి, అది నమ్మకమై కూర్చుంది. ఆమె ఏ పాపం ఎరుగదు....అమాయకురాలు...... నేను అనుమానించాను....ఆధారాలు లేకుండానే.... ఆ రోజుల్లో ఆమె గర్భిణీ.....నాకు పిచ్చి ఊహలూ, ఆవేశాలూ పుట్టాయి......." అతను వంచిన తల ఎత్తకుండా అలాగే నిలబడి చెప్పుకుపోతున్నాడు.

.....ఒకనాటి రాత్రి అనుమానపిశాచంతో ఆదమరచి నిద్రపోతున్న ఆమెను హత్యచేశాను....

క్షమాహతుడు

పక్కగదిలో వింటున్న రాఘవేంద్ర ఎగిరి గంతు వేయబోయి తమాయించుకున్నాడు. మునసబు కరణాలు మంత్రముగ్ధుల్లా చెవులప్పగించి వినసాగాయి.

"ఆ మర్నాడు నేను చేసిన తప్పు గ్రహించుకున్నాను. ఆమె నిర్దోషిత్వం నన్ను క్రుంగదీసింది. నేను దోషిని అయ్యాను. పాపిని అయ్యాను. హంతకుణ్ణి అయ్యాను. ఒకనాటి రాత్రి కలలో....నా సుగుణ కనబడి.....నన్నుచూసి నవ్వింది....నవ్వుతూ "ఏపాపం ఎరుగని, అమాయకురాలనైన, మిమ్మల్నే నమ్మి పూజిస్తున్న నన్ను. — ఆదమరచి, మిమ్మల్ని నమ్మి నిద్రపోతున్న సమయంలో అంతం చేశారు. జీవితంలో యింకా అడుగుపెట్ట

ఇద్దరు జేబుదొంగలు నడచివెళ్తున్నారు. అంతలో ఒకడు మాటిమాటికి తన గడియారం చూచుకోవటము ప్రారంభించాడు. కొంత దూరంపోయాక తిరిగి జేబులోనుండి గడియారం తీసి చూడసాగాడు. ఇది చూసి రెండవ జేబుదొంగ "ఎందుకలా" చూస్తున్నావని అడిగాడు. దానికి మొదటి జేబుదొంగ సమాధాన మిస్తూ "అది జేబులో వుందో, పోయిందో చూచుకుంటున్నాను" అన్నాడు.

జి. ప్రసాదరావు (విజయనగర)

బోతున్న పాపను, కొత్త జీవితంలోకి అడుగు పెట్టపోతున్న నన్ను అంతం చేశారు....మీరు 'ఆ జీవితాంతం' ఆజీవితాంతమే' లేకుండా ఉండిపోతారు. మీకు చావు అనేది ఉండదు, చిరంజీవిగా ఉంటూ జీవితంలోఉండే కాఠిన్యాన్ని చవిచూస్తూ, నిత్య యవ్వనంతో అలాగే ఉంటారు....మిమ్మల్ని నమ్మి, ప్రేమించి, త్యాగం చేయగలిగిన స్త్రీ మీకు దొరికే వరకూ అంతే....అంతే....అంతే...

"అంతే.....ఆమె మాయమయిపోయింది" మృత్యుంజయుడు తల ఎత్తి చూశాడు. టేబులు మీద కూర్చుని వింటున్న సుగుణ నేలమీద పడిపోయింది. ఎడమ చేత్తో నేలను ఆధారంగా చేసుకుని లేవడానికి చేసే ప్రయత్నంలో కొయ్యబారిపోయింది. ఆ దృశ్యానికి మృత్యుంజయుడు ఏమీ కలవరపడలేదు......సరికదా అసలు కదలనుకూడా కదలలేదు. సుగుణ కుడిచేత్తో తల పట్టుకుని 'అబ్బ" అంది. మృత్యుంజయుడు నిశ్చలంగా ఆమెకేసి చూశాడు.

"ఇది.....ఇది....వెయ్యి సంవత్సరాలనాటి సంఘటన.....ఆనాటినుండి నేను యిలా చిరాయువుగా ఉండిపోయాను......"

ఆమె మళ్ళీ అలా ఉండిపోయింది. మృత్యుంజయుని ముఖాన్న విషాదభరితమైన చిరునవ్వు వెలిగింది. అతనుకూడా చైతన్యహీనుడు అయ్యాడు.

పక్క గదిలో వింటున్న రాఘవేంద్ర 'ఆమె చచ్చిపోయింది' అని గొణిగాడు. ఆశ్చర్యంతో మునసబు కరణాలూ అవే మాటలు ఉచ్చరించారు.

"అబ్బా" అంది మళ్ళీ సుగుణ నుదురు నొక్కుకుంటూ. అయితే ఈసారి మృత్యుంజయుడు ఆశ్చర్యపడ్డాడు. ఆమె చావలేదు!!

"ఆమె చావలేదు!" అన్నాడు రాఘవేంద్ర ఆయాసంతో. 'అవును' అన్నారు వారిరువురూ.

సుగుణ నెమ్మదిగా లేచి పైట సరివేసుకుంటూ నించుంది. ఆశ్చర్యంతో మృత్యుంజయుడు అలాగే ఉండిపోయాడు. అతని అవయవాలకు చైతన్యం పోయినట్లయిపోయింది.

సుగుణ కళ్ళు వేయి సూర్యుల కాంతితో మెరవసాగాయి. ముఖం ఎర్రగా కందిపోయింది. "అవును... అవును.....ఆ సుగుణనే నేను......నా ఘోష శాపంగా మారి మిమ్మల్నింత హింసిస్తుందనుకోలేదు.... నన్ను మన్నించండి. మళ్ళా దైవవశాత్తు మీ ఆఖరుభార్యనై నేనే పుట్టాను ..... నా జన్మ తరించింది.....

"పూనకం!" అన్నాడు మునసబు నెమ్మదిగా కరణంతో. "కాదు అలాటిదే......"హిప్నాటిజం" అన్నాడు రాఘవేంద్ర వీలైనంత నెమ్మదిగా.

......నా జన్మ తరించింది" అన్న సుగుణ నిలువునా నేల కూలిపోయింది. అదే క్షణంలో మృత్యుంజయుడు "ముక్తి—విముక్తి" అని అరిచాడు తను నించున్న చోటునుండి కదలకుండానే...

"రండి....." అంటూ రాఘవేంద్ర గది ఇవతలకు దూకి మృత్యుంజయుడి గదివైపు ఎగిరి దూకాడు. తలుపులు వేసి ఉండడంవల్ల ముగ్గురూ నాలుగు తాపులు తన్నారు. తలుపులు విడ్డాయి. ఎదురుగా రూములో సుగుణ బోరగిళ్ళా నేలమీద పడి ఉంది. "ఇద్దరూ పోయారా" అన్నాడు వెర్రెత్తినట్లు అరుస్తూ కరణం. రాఘవేంద్ర లోపలికి పరిగెత్తాడు.

"మృత్యుంజయుడు ఏడి?" అన్నాడు కరణం రూమంతా కళ్ళతో వెతికేసి. 'ఏమో!' అన్నాడు మునసబు.

"ఇదిగో" అన్నాడు రాఘవేంద్ర. అటు చూసిన వారిద్దరూ ఆశ్చర్యంతో "ఇదా? ఈమసి?" అన్నారు గదిలో ఉన్న మసికుప్పను చూస్తూ...

"అవును.....అతనికి విముక్తి అయ్యింది..... అన్నాడు రాఘవేంద్ర మోకాళ్ళ మీద కూర్చుంటూ

"మరి ఆమె?" అన్నాడు అనుమానంగా కరణం.

"..... కోలుకుంటుంది" అన్నాడు రాఘవేంద్ర ఆ 'మసి'కేసే చూస్తూ. ★

జమ్మకు తెలుసు. వేణుయొక్క ప్రవర్తనలో అతనికి రేఖమీదగల అభిమానం సుస్పష్టంగా తెలుస్తూనే ఉంది. రేఖయొక్క హృదయవీణాతంత్రులు కూడా వేణుయొక్క అనురాగానికి శృతులు కలుపుతున్నట్లు కనిపిస్తోంది—నిన్నటి ప్రదర్శన జరిగినప్పుడు 'ఆమె' మొహం తల్చుకుంటే!

వేణు పంకజమ్మకు మేనల్లుడు. అతను బి. యే. పాసయి నృత్యకళయందున్న అభిమానంచేత పంకజమ్మ దగ్గిర శిక్షణపొంది, ప్రదర్శన లిచ్చే స్థాయికి వచ్చాడు. వేణూ, రేఖా కలిసి చక్కని నాట్యం చేశారు. వేణుకి రేఖయందు విపరీతమైన అనురాగం జనించింది. నాట్య భంగిమలలో అనేక సారులు ఒకరి నొకరు స్పృశింపవలసి వచ్చినప్పుడు, వేణు శరీరంలో విద్యుత్‌శక్తి ప్రవహించేది. మాటల్లోనూ, చేతల్లోనూ రేఖయందు ఎంతో అనురాగాన్ని ప్రదర్శించేవాడు. రేఖ అతనికి ప్రోత్సాహాన్ని ఇంతకుముందే ఇచ్చివుంటే అతను తప్పక తన మనస్సులోవున్న వుద్దేశాన్ని బయట పెట్టేవాడు.

రేఖ అన్ని విషయాల్లోనూ చాలా ఉత్సాహంగా వుండేది కాని, వేణు ప్రేమ విషయంలో నిర్లిప్తంగా వుండేది. ఆమె ఆదరణా చూపేదికాదు; నిరాదరణా చూపేదికాదు. మామూలుగా వేణుతో చాలా సరదాగా వుండేది. అతని మీద చలోక్తులు కూడా విసిరేది. కాని వంటరిగా వున్నప్పుడు అతనితో కొత్తవాళ్ళతో మాట్లాడినట్లు మాట్లాడేది. రేఖ యొక్క హృదయకావ్యం వేణు చదవలేక పోయాడు. సరికదా అది ఏ భాషలో వుందో కూడా తెలుసుకోలేకపోయాడు.

అక్రితం రోజు జరిగిన ప్రదర్శనలో రేఖ చాలా ఉత్సాహభరితంగా వుండడం గమనించాడు వేణు. ఆమె నాట్యం చేస్తోందనడంకన్నా గాలిలో తేలిపోతోంది అనేటట్లువుంది. తనొక్కర్తేకాక, ప్రేక్షకుల్ని కూడా నాట్యం చేయిస్తోంది. ఆమె మొహంలోని వుత్సాహకాంతిముందు ఫ్లడ్‌లైట్‌లు వెలవెలపోయాయి. ఆమె నృత్యం, సౌందర్యదేవత విశృంఖల విహారం—ఆనంద దేవత అపూర్వ వికాసం వేణు తన ప్రేమ ఫలితాన్ని పరిక్షించుకొనేందుకు ఇంతకన్నా దివ్యమైన అవకాశం వుండదని ప్రదర్శనానంతరం తన అనురాగాన్ని తెలియజేసి ఆమెను తన పాణిగ్రహణం చెయ్యమని కోరాడు.

వేణు ప్రార్థన విని రేఖ కొంతసేపు మౌనంగా వుంది. ఆ ఘడియలు వేణుకు విపరీతమైన బాధను కలిగించాయి. అయినా ఆత్రుతతో ఆమె నిర్ణయం కోసం నిరీక్షించాడు. రేఖ రెండు రోజులు తనకు ఆలోచించుకోడానికి వ్యవధి ఇమ్మంది. వేణు అందు కంగీకరించాడు. తనను నిరాకరించలేదని సంతోషించాడు.

పంకజమ్మ వీరిద్దరి మధ్యా అనురాగస్రవంతి ప్రవహిస్తోందనీ, అది ఇక వీరి హృదయక్షేత్రాలను సుభిక్షంచేసి కోర్కెల పంట పండించగలదనీ, గ్రహించింది కాని తన కేమి తెలియనట్లు నటించింది. రేఖ తనంత తను చెప్పేదాకా ఆమె ఈ విషయం రేఖతో ప్రస్తావించదలచుకోలేదు.

పంకజమ్మ గది బయట అడుగుల చప్పు

నర్తకి

(23-వ పేజీ తరువాయి)

డైంది. తలుపు తోసుకొని రేఖ లోపలికి వచ్చింది. రేఖకు ఇరవై సంవత్సరాలుంటాయి. విశాలమైన సోగదేరిన కళ్ళతో అంత గుండ్రముకాక అంత కోలగానూ కాకుండా వున్న మొహంతో ఎంతటి వారినైనా ఇట్టే ఆకర్షించగల శక్తి రేఖకుంది.

రేఖ మొహం చూడగానే పంకజమ్మ కొంత ఆమె స్థితి అర్థం చేసుకుంది. రేఖ మొహంలో ఆందోళనా, విచారమూ, నిరుత్సాహమూ స్పష్టంగా కన్పిస్తున్నాయి.

"ఇంతవరకూ నిద్రపోలేదా? రేఖా!"

"అవునండీ నిద్దర రావడంలేదు."

ఒక లక్షాధికారి తన ఇంట్లో పూచికపుల్లగూడా ఎందుకు దొంగతనం చేయబడలేదో స్నేహితులతో చెబుతున్నాడు.

"దొంగలెవరూ రాకుండా మా కుక్క నెప్పుడూ కాపలా వుంచుతాను. కుక్కనెవరూ దొంగిలించకుండా మా పెద్దబ్బాయి కాపలా. వాడికి మా ఆవిడ కాపలా, మా ఆవిడ్నెవరూ దొంగిలించకుండా నేను కాపలా." అని చెప్పాడు ఆ లక్షాధికారి.

కర్లపాలెం మధుసూదనరావు
(వేటపాలెం)

"మంచిదానివే! ఎల్లుండి మళ్ళీ ప్రదర్శన వుందికదా, ఆరోగ్యాన్ని సరిగా చూసుకోపోతే ఎలా?"

"నిజమే. కాని, నాకేమీ తోచటం లేదు.... మీతో ఒక విషయం మాట్లాడాలి."

రేఖ మనస్సులో చాలా వ్యధనుంచుకొని చివరకు అది తనలో ఇముడ్చుకోలేక బయటకు కక్కబోతున్నట్లుగా మాట్లాడింది. పంకజమ్మకు రేఖ అంటే చాలా అభిమానం. రేఖ మనస్సును తేలిక పర్చడం ముఖ్యమని భావించింది ఆమె.

"ఏమిటది?" అని సానునయంగా అడిగింది.

"నేను మొట్టమొదట మీ దగ్గరకు వచ్చినప్పుడు నేను ఏ పరిస్థితుల్లో మీ వద్దకు వచ్చానో పూర్తిగా చెప్పలేదు. నేనొక అనాధననీ, నాకాశ్రయమిమ్మనీ మిమ్మల్ని అర్థించాను. మీరు నాయందు ఎంతో సానుభూతి చూపించి నాకాశ్రయం ఇచ్చారు. మీ ఆదరణలో నా గతజీవితాన్నంతా మరిచి నూతన జీవితాన్ని సృష్టించుకో నారంభించాను. ఈ మూడేళ్ళూ నా జీవితంలో స్వర్ణమయకాలంలా గడిచాయి. కళాదేవత ఆరాధనలో నా జీవితం సమర్పించి ధన్య నవుదామనుకున్నాను. అందుకే నా హృదయావేశాలకి తావివ్వకుండా ఈ మూడు సంవత్సరాలు గడిపాను. కాని నాది చాలా దుర్బలహృదయమనీ నా మనస్సు చంచలమైనదనీ, ఉన్నతాదర్శాలను సాధించగల శక్తి నాలో లేదని మొన్న తెలుసుకున్నాను" అని రేఖ నిట్టూర్పు విడిచింది.

పంకజమ్మ మొహంలో చిన్న చిరునవ్వు ఉదయించింది.

"రేఖా! నువ్వు విచారించవలసిన పనిలేదు. నువ్వు బాధపడేది వేణుగురించేకదా! వేణు నీయందు అనురాగంతో ఉన్నాడనీ, మీ యిద్దరూ పరస్పరం ఆకర్షణాశక్తికి లోనవుతారనీ నాకు తెలుసు. అయినా, అందులో వింతేమిలేదు. అది ప్రకృతి సహజం. కళకు కూడా కొంత అనుభూతి అవసరమే. మీ యిద్దరూ కలిసి కళామతల్లిని ద్విగుణీకృతంగా ఆరాధించగలరు."

రేఖ మొహంలో బాధ ఇంకా స్పష్టంగా కన్పించ సాగింది. "నేనూ అదే విధంగా భావించాను. నేను నా నూతన జీవితాన్ని సృష్టించుకోవడానికి వేణు సహకారం లభిస్తుందని ఆశించాను. వేణు కూడా నాయందు చాలా అభిమానం కలిగివున్నాడని నేను కొన్ని రోజులనుండి అతని ప్రవర్తన ద్వారా తెలుసుకోగలిగి, మా యిద్దరి భవిష్యత్తు ఎలా వుంటుందో ఆలోచించుకోసాగాను. ఈ విషయంలో తొందరగా నేనొక నిర్ణయానికి రాదల్చుకోక, వేణుతో నా పరిచయాన్ని అభివృద్ధిచేసుకోలేదు. కాని వేణు ఈ విషయాలు సరిగ్గా ఆలోచించుకోలేదు. మొన్న రాత్రి నన్ను తన భార్య కమ్మని కోరాడు."

పంకజమ్మ "నువ్వు అందుకు అంగీకరించావా?" అని అడిగింది.

"అప్పటి నా స్థితి అంగీకారానికి సిద్ధంగానే వుంది కాని అతనామాట అనగానే నాలో ఏదో భయం కలిగింది. అమాయకమైన అతని మొహం చూస్తూ, నా హృదయపు లోతుల్లో దాగిన రహస్యములను తల్చుకుంటూ అతని మోహావేశానికి నా మనస్సు తల యొగ్గ లేకపోయింది. నా గురించి అతనికేమీ తెలియదు. తెలుసుకోవాలని కూడా అతను కోరటంలేదు. అతను పురుషుడు. నన్ను తన విలాస వస్తువుగా భావించి నా ప్రేమతో చెలగాటమాడి చివరకు నన్ను నిర్భాగ్యురాలిని చేయగలడు. నా సౌందర్యం అతనిలో మోహోద్రేకం కల్గిస్తోంది. కాని అది నన్ను అథఃపాతాళానికి తోసెయ్యగలదు. పురుషుడి చేతిలో కీలుబొమ్మ స్త్రీ. అందులోనూ నాలాటి అనాధ, ఎవరిదగ్గరనుండైనా ఆదరాన్ని ఆశించడం కేవలం భ్రమపడడమే" అంది విచారంగా.

పంకజమ్మ "రేఖా! నువ్వంటున్నదేమిటో నాకు బోధపడడంలేదు. వేణు ప్రేమించాడన్న అంటున్నావు. వేణు నిన్ను మోసం చేస్తాడేమో

నర్తకి

అని భయపడుతున్నావు. 'నీకు ఎప్పుడైనా, ఎవరి వల్లనైనా మోసం జరిగిందా?'' అని ప్రశ్నించింది.

రేఖ "అవును ఆ విషయమే మీతో చెప్పడానికి వచ్చాను. ఆ విషయం చెప్పక తీరని సమయం కూడా వచ్చింది. ఈ కథ మీకు మొదటినుంచీ చెప్తాను. మాది రాజమండ్రీ దగ్గర ఒక పల్లెటూరు. ఆ వూళ్ళో మా తాతయ్య బాగా డబ్బున్న రైతు. మా అమ్మను బాగా కట్నమిచ్చి, చదువుకున్నాయన కిచ్చి పెళ్ళి చేశారు. మా అమ్మ మూడేళ్ళు కాపరం చేసిన తరవాత నేను పుట్టడం మా నాన్నగారు చనిపోవడం రెండూ ఒకసారే జరిగాయి. అప్పటినుంచీ మా అమ్మ నన్ను తీసుకొని మా తాతయ్య వద్దకు వచ్చేసింది. తండ్రిలేని పిల్లనని నన్ను చిన్నప్పటినుంచీ చాలా గారాబంగా పెంచారు. మా వూళ్ళోవున్న ఎలిమెంటరీ స్కూల్లో నన్ను చదవవేశారు.''

"ఆ వూరి స్కూలుకు ఒక స్త్రీని టీచరుగా వేసారు. ఆమెకు డాన్సింగంటే చాలా ఇష్టం. చదువు చెప్పినా చెప్పకపోయినా స్కూల్లోవున్న ఆడపిల్లలకు విధిగా డాన్సు నేర్పి వాళ్ళచేత పాటలు పాడిస్తూ, డాన్సు చేయించేది. పైగా నెలకొకసారిగాని రెండు నెలల కొకసారిగాని మాకు వేషాలువేసి, స్టేజి తయారు చేయించి వూళ్ళో వాళ్ళందర్నీ పిలిచి వాళ్ళముందు మాచేత ప్రదర్శనాలు జరిపించేది. చిన్న పిల్లల ఆటల్నీ పాటల్నీ చూసి అంతా సంతోషిస్తూండేవారు. అందరూ ఆమెను చాలా అభినందించేవారు.

నాకు పదేళ్ళు వయస్సు వచ్చాక ఆమె ఆ వూరు వదిలి వెళ్ళిపోయింది. మరొక మగ మేష్టారు ఒచ్చారు. ఆయన రెండు సంవత్సరాలు వున్నారు. మా వూళ్ళో అయిదవ క్లాసు దాకానే ఉంది. ప్రక్క వూళ్ళో హైస్కూలు ఉంది. మా వాళ్ళు నా చదువు అయిదవ క్లాసుతో అంతం చేద్దామనుకున్నారు. కాని నేను పై చదువు చదువుతానని పట్టుపట్టి బాగా ఏడ్చి, అన్నం తినకుండా రెండు రోజులు గొడవచేసేసరికి ఒప్పుకున్నారు. రోజూ నేనూ ఆడా, మగా పిల్లలు కలిసి మూడు మైళ్ళ దూరంలో వున్న ప్రక్క వూరికి వెళ్ళి చదువుకొనేవాళ్ళం. నేను ఫిఫ్తుఫారం చదువుతున్న రోజుల్లో మా స్కూలు వార్షిక దినం జరిగినప్పుడు వనాచేత డాన్సు చేయించారు. ఆనాడే నాకు ఆనంద్ అనే యువకునితో పరిచయమైంది. అతను ఆ వూరివాడే. కాని పైవూళ్ళో కాలేజీలో చదువుతున్నాడు. సెలవలకి ఇంటికి వచ్చాడు. రోజూ "స్కూలునుంచి నేను తిరిగి వచ్చే సమయానికి నన్ను కలుసుకొని మా వూరుదాకా నాతో వచ్చేవాడు.

పదిహేనురోజుల్లో ఆనంద్ నాతో చాలా చనువుగా మాట్లాడడం ప్రారంభించాడు. అతనికి ఇరవై స్యేళ్ళుంటాయి. అతనిని కలుసుకోవడం నాకూ చాలా సంతోషంగా ఉండేది. ఒకనాడు బడినుంచి నేను రావడం ఆలస్యమైంది. నాతో మా వూరునుంచి చదువుకోడానికి పెద్ద క్లాసులికి ఆడపిల్ల లెవరూ రాకపోవడంవలన నేను ఒక్కర్తినే వస్తూ వెళ్తూ వుండేదాన్ని. ఆవాళ సాయంకాలం ఆనంద్ నన్ను దిగబెట్టటానికి వచ్చాడు. బాగా చీకటి పడింది. పొలాల గట్లవెంట ఇద్దరం కలిసి నడుస్తున్నాం. ఆనంద్ నన్నొకచోట ఆపాడు. చీకటి బాగా వ్యాపించింది. తన ప్రేమను నాకు తెలియబరుస్తూ, ఆనంద్ నన్ను తన చేతుల్లోకి తీసుకున్నాడు. గట్టిగా ముద్దు పెట్టుకున్నాడు. నేను కూడా అతనితో, తనను ప్రేమిస్తున్నానని చెప్పాను. ఇద్దరం ఒకరి నొకరు గాఢంగా కౌగలించుకొన్నాం. మేము ఒకరి ప్రేమ నొకరికి తెలియబర్చుకుంటూ, అజాగ్రత్తగాఉన్న సమయంలో చీకటి పడిందనీ నాకోసం వెతుక్కుంటూ వస్తున్న తాతయ్యకంట పడ్డాం. తాతయ్య కోపం పట్టలేకపోయాడు. కాని పైకి ఏమీ అనకుండా నన్ను తనతో ఇంటికి తీసుకువెళ్ళాడు.''

"ఆనాటినుంచీ నన్ను బయటికి వెళ్ళనీకుండా తాతయ్య కట్టుదిట్టం చేసాడు. కాని ఆనంద్ మా యింట్లో పనిమనిషిని మంచి చేసుకొని ఆమె ద్వారా, రహస్యంగా ప్రేమ లేఖలు పంపేవాడు. నేను కూడా జవాబులు రాసి పంపేదాన్ని. అతను ఆ లేఖల్లో తన ప్రేమని చాలా ఉద్రిక్తతతో వ్యక్తం చేసేవాడు. ఇద్దరం ఒకర్ని విడిచి ఒకరం వుండలేమని నిశ్చయించుకున్నాం. అతను నన్ను తనతో వచ్చెయ్యమనీ, ఏ వూరైనా వెళ్ళిపోయి పెళ్ళి చేసుకుందామని రాస్తుండేవాడు. చివరికి ఒకనాడు మా తాతయ్య వూర్లో లేని సమయంలో స్నేహితులింటికి వెళ్ళివస్తానని చెప్పి వెళ్ళి వూరి వెలుపల నా కోసం ఎదురు చూస్తున్న ఆనంద్‌ను కలుసుకున్నాను.''

"ఇద్దరం రాజమండ్రీవెళ్ళి అక్కడనుంచి సరాసరి మద్రాసు వచ్చేశాం. ఇక్కడ ఒక హోటల్లో గది అద్దెకు తీసుకొని రెండు రోజులు హాయిగా గడిపాం. అక్కడనుంచి తిరుపతివెళ్ళి ఇద్దరం పెళ్ళి చేసుకుందామని అనుకున్నాం. ఆనంద్ తనతో చాలా డబ్బు తెచ్చాడు. డబ్బంతా నా దగ్గరే వుంచాడు. అయిదు వందలదాకా వుంటుంది. అప్పటికి నా చేతిలో వున్న డబ్బు. మూడవనాడు సాయంకాలం ఆనంద్, ఎవర్నో తనకు తెలిసిన వ్యక్తిని కలుసుకుని అరగంటలో వస్తానని మరి రాలేదు.''

"నేను ఒక్కర్తినీ అతనికోసం ఎదురు చూస్తూ ఆ హొటల్లో వారం రోజులు గడిపాను. ఆనంద్ జాడే లేదు. ఆడది ఒంటరిగా వుండడం ఎంత ప్రమాదకరమో ఆవారం రోజుల్లో నాకు చాలా వరకూ అర్థమైంది. ఆవారం రోజులూ నేను పడ్డ బాధ వర్ణనాతీతం. హృదయంలో ఆనంద్ చేసిన మోసం బాధిస్తోంది. నేను తిరిగి మా వూరు వెళ్ళలేను. ఎందుకంటే మా తాతయ్య చండశాసనుడు. నలుగురిలో పరువుగా బ్రతుకుతున్న వాళ్ళని అమర్యాదాపాలు చేసి వచ్చాను. ఇహ ఏ మొహం పెట్టుకొని వాళ్ళ దగ్గరకు వెళ్ళగలను? పోనీ ఇక్కడ వుందామని నిశ్చయించుకుందామంటే ఈ వూరు కొత్త. ఒంటరిదాన్ని.''

"ఆ హోటలు యజమాని నా స్థితి తెలుసుకొని, ఆనంద్‌కోసం వూరల్లా రెండు మూడు రోజులు వెతికించాడు. చివరకు లాభంలేదనీ, ఎవరైనా తెలిసినవాళ్ళవద్దకు వెళ్ళమనీ చెప్పాడు. అతని బిల్లు చెల్లించేసి బయటకువచ్చి రెండు రోజులు

ఆనంద్‌కోసం వూరంతా తిరిగాను. ఆ సమయంలో మీ నటరాజ నృత్య కళామందిర్ బోర్డు చూసి, మీరు, దీని అధిపతులని తెలుసుకొని స్త్రీని కాబట్టి నన్ను మీవద్ద తల దాచుకోనిస్తారని ఆశతో మిమ్మల్ని కలుసుకున్నాను. తరువాత జరిగిన సంగతంతా మీకు తెలుసు. నానికృష్ట జీవితన్ని ఇన్నాళ్ళనుంచీ మీదగ్గర దాచాను. కాని నాయందు మీరు చూపుతున్న ప్రేమాభిమానాలు నన్ను ఈ విషయాలన్నీ మీతో చెప్పి, నన్ను మీరు ఆదరించినా, నిరాదరించినా స్వీకరించడానికి సిద్ధమయ్యేట్లు చేసేయి" అని ఆగింది రేఖ.

పంకజమ్మ తను విన్నదాని గురించి ఆలోచిస్తూ రెండు నిముషాలు వూరుకుంది. రేఖను పరిశీలించి చూసింది. చివరకు చిన్న నవ్వు నవ్వింది. "రేఖా నాకు నీ వ్యక్తిగతవిషయాలు తెలిపి, నన్ను నువ్వు కోరేదేమిటో నాకు తెలియటంలేదు. నీ గతం గురించి నాకు ఎట్టి దురభిప్రాయంలేదు. ప్రేమించినపురుషుడితో కలిసిరావడంలో తప్పేమీలేదు. ఇక అతను మోసగాడని తెలిసింది కాబట్టి నూతన జీవితం ఆరంభించావు. వేణు నిన్ను ప్రేమిస్తున్నాడు. వేణుని నీవు స్వీకరించగలిగితే అతనితో వివాహానికి అంగీకరించవచ్చు. ఇందుకు నీ గత చరిత్ర ఏ విధంగా అడ్డుతుందో నాకు బోధపడడంలేదు" అంది పంకజమ్మ.

రేఖ తన చేతిలోంచి చిన్న కాగితంతీసి పంకజమ్మ కిచ్చింది. అది తీసికొని పంకజమ్మ చదవసాగింది. అందులో ఇలా వుంది:

"ప్రియమైన రేఖకు !

మొన్న నీ నృత్యప్రదర్శనంనాడు నిన్ను చూసి చాలా ఆనందం పొందేను. మూడేళ్ళక్రితం నిన్ను ఒంటరిగా వదలి నేను వూళ్ళోకి వెళ్ళాను. తిరిగి రెండునెలల తరవాత ఆ హోటలువెళ్ళి విచారిస్తే నువ్వు నాకోసం వారం రోజుల దాకా ఎదురు చూశావనీ, తరవాత ఎక్కడికో వెళ్ళిపోయావనీ చెప్పారు. నువ్వు నా గురించి ఎంతో బాధపడివుంటావు. కాని విధి మనల్ని దూరం చేసింది. ఆనాడు నిన్ను వదలి హోటలు బయటకువచ్చి కొద్ది దూరం నడిచి వెళ్ళగానే ఒక కారువచ్చి నన్ను ఢీకొంది. వెంటనే స్పృహతప్పి పడిపోయాను. హాస్పిటల్లో రెండు నెలలు ఉండవలసివచ్చింది. నీకు కబురైనా పంపే స్థితిలో లేకపోయాను. గాయాలు చాలా బలంగా తగిలాయి.

ఈ మూడేళ్ళనుంచీ నీకోసం అన్వేషిస్తూ తిరుగుతున్నాను. నృత్యప్రదర్శన అవగానే నిన్ను కలుద్దామనుకున్నాను. కాని కొన్ని కారణాలవల్ల అది సాధ్యపడలేదు. రెండు రోజుల్లో నిన్ను వచ్చి కలుస్తాను. ఇట్లు నీ ఆనంద్"

పంకజమ్మ ఉత్తరం పూర్తిచేసి రేఖవైపు చూసింది. "ఆనంద్ నిన్ను ఎప్పుడు కలుసుకుంటాడనుకొంటున్నావు?" అని అడిగింది.

రేఖ "బహుశా రేపు కలియవచ్చు నా మనస్సులో మొదటినుంచీ ఆనంద్ తిరిగి వస్తాడని తోస్తూనేవుంది. వేణుయొక్క ప్రేమకు తగిన ప్రోత్సాహం అందుకే నే నివ్వలేదు. ఇద్దరూ నన్ను ప్రేమించారు. నా కిప్పుడేంచెయ్యాలో తెలియటం లేదు. ఇద్దరిలో ఎవరి మనస్సూ నొప్పించడం నా కిష్టంలేదు. ఇవాళ ప్రొద్దున్న ఈ ఉత్తరం అందింది. అప్పటినుంచి నా మనస్సు విపరీతమైన బాధ పడుతోంది. ఆనంద్ గతి ఏమయిందో తెలియక, అతను మళ్ళీ నా దగ్గరకు రానందుకు, అతణ్ణి వంచకుడిగా భావించి అతనికి ద్రోహం చేశానేమో? ననిపిస్తుంది. ఆనంద్ సంగతి వేణు దగ్గరదాచి వేణునీ మిమ్మల్నీ వంచించినందుకు కూడా నాకు కష్టంగా వుంది. ఇన్నాళ్ళబట్టి మీరు నన్ను ఎంతో ఆదరంగా చూసారు. కాని నేను వట్టి పతితననీ, వంచితననీ, మీ ప్రేమకు తగనిదాన్నని తెలిసి మీరు నన్ను తరిమెయ్యొచ్చు. కాని నా ప్రవర్తనకు నేను క్షమాపణ కోరుకుంటున్నాను" అని వెక్కి వెక్కి ఏడ్వసాగింది రేఖ.

పంకజమ్మ రేఖ గడ్డాన్ని ఎత్తి ఏడుస్తున్న ఆమె మొహంలోకి దయార్ద్రదృష్టితో చూసింది. "రేఖా నీ తప్పేమిలేందే, నువ్వు అనవసరంగా బాధపడుతున్నావు. నువ్వు నన్నుగాని, వేణునుగాని వంచించిన దేమీలేదు. నీ స్వభావం ఎంత మంచిదో, నీ హృదయం ఎంత సరళమైనదో నాకు తెలుసు. మానవ జీవితంలో అనేక పొరపాట్లు వస్తూంటాయి. అంతమాత్రాన ఆ వ్యక్తిని మనం తరిమెయ్యకూడదు. నువ్వూ ఆనంద్ ఎన్నో కలలు కనిఉంటారు. అయినా విధి మీ పథకాన్ని తలక్రిందు చేసింది. ఆనంద్‌తో నీబంధన తెగిపోయిందనుకున్నావు. వేణుతో నీ జీవితం పునర్నిర్మించుకుందామనుకున్నావు. కాని మళ్ళీ విధి నిర్ణయం నీ కెదురైంది. ఆనంద్ తిరిగి వచ్చాడు." పంకజమ్మ ఒక్క క్షణం ఆగింది.

రేఖ ఏడవడం ఆపి పంకజమ్మ వైపు చూసి "మీరెంత మంచివారు. నామీద మీకున్న ప్రేమకు ఎంతో కృతజ్ఞురాలిని. నాకు ఆనంద్ వద్దు, వేణు వద్దు. నే నెప్పుడూ జీవితాంతం మీ దగ్గరే వుండిపోతాను. ఈ నాట్యకళను అభివృద్ధి చేసుకుంటూ మీ పాదసేవ చేస్తాను" అంది.

పంకజమ్మ చిన్న నవ్వు నవ్వింది. "రేఖా! జీవితం మనం అనుకున్నంత తిన్ననైనదీ, సుగమమైనదీ కాదు. మనస్సు చంచలమైనది. స్త్రీ మనస్సు చాలా బలహీనమైనది. నిన్ను ఆనంద్ ప్రేమతో లోబరుచుకున్నాడు. వేణుకూడా ప్రేమద్వారానే నీ హృదయాన్ని కదల్చగలిగాడు. వీళ్ళిద్దర్నీ వదిలిపెట్టగలిగితే మరొక పురుషుడు నిన్ను ప్రేమతో బంధించగలడు. కాబట్టి వీళ్ళనుంచి నువ్వు పారిపోగల్గుతా నన్నది వట్టి భ్రమ! వీరిద్దరిలో ఎవరో ఒకర్ని నువ్వు ఎంచుకొని వివాహం చేసుకోవలసిందే" అంది పంకజమ్మ.

రేఖ పంకజమ్మ చెప్పిన మాటల్ని శ్రద్ధగా వింది. ఆమె మాటలలో చాలా సత్యం వుంది. ఆమె అనుభవజ్ఞురాలు. ఈ మాటలు ఇంకెవరైనా అంటే తనకు కోపం వచ్చేది. ఆనంద్‌కు నాట్యం అంటే ఇష్టం వుందో లేదో తనకు తెలియదు. వేణు నర్తకుడు. నాట్యం అంటే అతనికి ఎంతో యిష్టం. అతనితో కలిసి తను కళారాధన నిర్విఘ్నంగా చేయగలదు. వేణు తను మెట్టినచోట పూజిస్తాడు. అతనికి తనంటే చాలా ఇష్టం. వేణు..

గది బయట చప్పుడైంది. వేణు లోపలికి వచ్చాడు. "అరె! ఇంత రాత్రప్పుడు మీ రిద్దరూ ఏం చేస్తున్నారు?" అని అడిగాడు. సన్నగా ఎర్రగా పొడుగ్గా యిరవై రెండేళ్ళ వయస్సుగల, చక్కని యువకుడు. సిల్కు పైజామా, సిల్కు బనియనుతో చేతిలో గోల్డుఫ్లేకు సిగరెట్టుతో రేగిన జుట్టుతో వేణు, రేఖకు ఎంతో అందంగా కనిపించాడు.

పంకజమ్మ "నువ్వెందుకు నిద్రపోలేదు?" అని అడిగింది మేనల్లుణ్ణి. వేణు రేఖవైపుచూసి చిరునవ్వు నవ్వాడు. రేఖ కూడా నవ్వింది. ఆమె మనస్సులో వేణంటే సద్భావం కలిగింది.

వేణు "నేను ఇంతవరకూ ఒక డిటెక్టివ్ పుస్తకం చదువుతూ మెలకువతో వున్నాను. నాకు ఆకలేసింది. నా ఫ్లాస్కులో టీ అయిపోయింది. నీ దగ్గర టీ బిస్కట్లు కూడా తీసుకుందామని వచ్చాను" అన్నాడు.

పంకజమ్మా రేఖా నవ్వుకున్నారు. రేఖకు తన విచారమంతా పోయింది. వేణు చిన్నపిల్లాడిలా మాట్లాడడం ఆమెకెంతో ఆనందం కలిగించింది. నిజంగా వేణులాంటివాడిని ఏ స్త్రీ ప్రేమించదూ? రేఖ, తను వేణును వివాహం చేసుకోవడంలో పొరపాటు చెయ్యబోననుకుంది.

తన ఉపన్యాసం వింటానికి వచ్చిన అశేషజనానికి బ్రహ్మాండంగా ఉపన్యాసం చెప్పి శ్రోతలవైపు తిరిగేసరికి ఒకే ఒక వ్యక్తి కనపడడంతో ఆశ్చర్యపోయినా "ఈ వూరి మొత్తానికి రసాస్వాదకుడు ఇతనొక్కడే" అనే సంతృప్తితో అతనిని కలుసుకున్నాడు ఆ ఉపన్యాసకుడు.

"ఎలా ఉందంటారు నా ఉపన్యాసం."

"ఇంటికిపోయి భార్యపోరు పడలేక ఇక్కడ కూర్చున్నాను. అయినా ఆ బాధ కంటె ఈ బాధే బాగుంది లెండి." అని సమాధానమిచ్చాడు.

కర్లపాలెం మధుసూదనరావు
(వేటపాలెం)

నర్తకి

పంకజం మూడు కప్పులలో పొసర్చా, ఫ్లాస్కు, బిస్కట్లు టిన్నూ బయటకు తీసింది. ముగ్గురూ తెల్లవారుజాము నాలుగు గంటల దాకా టీ త్రాగుతూ, బిస్కట్లు తింటూ కబుర్లు చెప్పుకొని అప్పుడు పడుకోడానికి ఎవరి గదికి వారు వెళ్ళిపోయారు. రేఖ మనస్సు తేలికైంది. ఆమె మనస్సు వేణుతో నిండిపోయింది.

పొద్దున్న ఎనిమిది గంటలకు రేఖ రావడం, కాలకృత్యాలు తీర్చుకోవడం అన్నీ అయి నృత్య సాధనకు సిద్ధంగా వుంది. వేణు ఇంకా లేవలేదు. పంకజమ్మ కూడా రేఖలాగానే ప్రొద్దున్నేలేచి రాత్రి తను పూర్తి చేయకుండా వుంచిన వ్యాసాన్ని పూర్తి చేస్తోంది.

నటరాజ నృత్య కళామందిర్ భవనం గేటు దగ్గర కారాగింది. అందులోంచి ఒక యువకుడు తెల్లని సూటు వేస్కొని, మంచి బోళ్ళు, బంగారపు రిస్టువాచీ వ్రేలినున్న వజ్రపు టుంగరాలూ, అతన్ని భాగ్యవంతుడని తెలిపే లక్షణాలతో, బయటికి వచ్చాడు. భవనం లోపలికి వెళ్ళి తన కేదురు పడ్డ ఒక నౌకరును "రేఖ" ఎక్కడ? అని అడిగాడు.

రేఖ తన గది గుమ్మందగ్గిర నిలబడివున్న ఆనందును చూసి "ఆనంద్! అంది. ఆనంద్ వచ్చి ఆమె చెయ్యి పట్టుకుని "రేఖా! టైంలేదు. పద! వెంటనే వెళ్ళిపోదాం. బయట కారు సిద్ధంగా వుంది. మధ్యాహ్నం రెండు గంటలకు మనం తిరుపతి కొండమీద వుండాలి. పెళ్ళికి అన్ని ఏర్పాట్లు చేసి వచ్చాను. ఇప్పుడు ఎనిమిదిన్నర గంటలయింది. మనం బజార్లో కొన్ని వస్తువులు కొనుక్కోవాలి పద. మీ నాట్యమందిర్ యజమాని దగ్గర సెలవు తీసుకొని వెళ్ళిపోదాం. ఆమె రూము ఎక్కడ?" అని అంటూ ఆమెను నడిపించుకుంటూ బయటకు తీసుకువచ్చాడు.

పంకజమ్మ, రేఖ "ఇతనే ఆనంద్" అని చెప్పినప్పుడు ఆశ్చర్యపోయింది అతన్ని చూసి. ఆనంద్ చాలా సహజంగా "మీకు చాలా థాంక్స్. మే మిద్దరం ఇవాళ మధ్యాహ్నం రెండు గంటలకు వివాహం చేసుకోబోతున్నాం. రేఖ కేమీ తెలియదు. అంతా నేనే ఏర్పాటు చేసాను. రెండు రోజుల్లో తిరిగి వస్తాం. రేఖా! నువ్వేమీ తీసుకురానక్కరలేదు. ముందు కారు దగ్గరకి పద....." అంటూ రేఖను తన చేతితో తీసికెళ్ళిపోతుంటే, పంకజమ్మ చిరునవ్వు నవ్వుకుంది. రేఖయొక్క సంతోషపూరిత ముఖాన్ని జ్ఞప్తికి తెచ్చుకుంటూ. బయట కారు కదలిపోయింది.

కారులో ఆనంద్, రేఖతో "ఈ మూడేళ్ళలోనూ నువ్వు ఇంకా బాగా అందంగా తయారయ్యావు "సుమా!" అన్నాడు. రేఖ తెచ్చుకున్న కోపంతో "నువ్వు ఈ మూడుడేళ్ళలోనూ ఇంకా కొంటెగా తయారయావు తెలుసా?" అంది. ఇద్దరూ నవ్వుకున్నారు. ★

కథ చెప్పా...?

"ఆఁ. ఆ వేటగాడేమో—నల్లగా వున్నాడు. ఇంత లావు మీసాలు. నిగనిగలాడే కండలు. చేతిలో విల్లమ్ములు. చాలా భయంకరంగా వున్నాడు. వాడు ఆ పావురాల్ని చూశాడు. ఆ చూపులు వాడి బాణాల్లా వున్నాయి. పావురాలు ప్రాణం వొడలిపోయాయి. చెట్టుపైన్నే వుంటే ఆ బోయవాడు బాణంతో చంపేస్తాడు. చచ్చి సాధించేదేముంది? బ్రతికుంటే బలుసాకు తిని బ్రతకొచ్చు. అంచేత పావురాలు రెక్కలు పటపట విదిలించి, ఆకాశంలోకి ఎగిరిపోయాయి. ఇంకేముంది? గుండె బ్రద్దలయ్యేంత పనిజరిగింది. ఆకాశంలో ఒక పెద్దగ్రద్ద చక్రాలు తిరుగుతోంది. ఇప్పుడు పెద్దచిక్కు వచ్చి పడింది. కొమ్మపైన వుంటే వేటగాడు చంపేస్తాడు. ఆకాశంలోకి ఎగిరితే, గ్రద్ద కంటబడితే చావు తప్పదు. ముందుపోతే నుయ్యి వెనక్కి వెళ్ళితే గోయి. ఇప్పుడేది గతి? ఏది దిక్కు?"

"దేవుడే దిక్కు" అన్నాడు వాసు మధ్యలో.

"దిక్కు తోచకుండా పావురాలు రెండూ బిక్క మొగాలతో కొమ్మపైన్నే కూర్చుని, తలరాత ఎలా వుంటే అలా కానీగాక అనుకున్నాయి. చెట్టుకింద వేటగాడు వింటిలో బాణం సంధించాడు. విల్లెక్కుపెట్టి పావురాలకేసి గురిచూస్తూ ముందుకు ఒక అడుగు వేశాడు. అతని ముందర ప్రాకిపోతున్న ఒక నల్లతాచుపాము మీద పడింది అతనికాలు. వెంటనే పాము కోపంతో బుస్సుమంటూ వాడికాలి మీద కసికొద్దీ కాటువేసింది. వేట

దేవుడే దిక్కు

(41-వ పేజీ తరువాయి)

గాడు ఆ బాధకు తట్టుకోలేక గట్టిగా అరచి, విల్లమ్ములు వదిలేసి కింద కూలబడ్డాడు. గురితప్పిన బాణం రివ్వున పైకెగిరి, ఆకాశంలో తిరుగుతూన్న గ్రద్ద గుండెల్లో గుచ్చుకుంది. గ్రద్ద గిరగిరా తిరిగి కిందపడి చచ్చింది. వేటగాడు చచ్చిపోయాడు. పావురాలు హమ్మయ్య అనుకుని, దేవుడి

ఒక జంతుప్రదర్శనశాల అధికారి తను చెప్పినపని చెయ్యలేదని గుమాస్తాతో కోపంగా.

"ఏమయ్యా! ఎప్పుడూ 'ప్రమోషన్' 'ప్రమోషన్' అంటావ్. ఈతడవ తప్పకుండా నీకు ప్రమోషనిచ్చి ఆ కటకటాల్లోకి పంపిస్తాలే"

"నా కంటె సీనియర్ మీరు. మీతరువాతే లెండి నాకు ప్రమోషన్" అని వినయంగా సమాధానమిచ్చాడు గుమాస్తా.

కర్లపాలెం మధుసూదనరావు
(వేటపాలెం)

కొక దండంపెట్టుకుని, హాయిగా ఆకాశంలోకి ఎగిరాయి. కనుక దిక్కులేనివారికి దేవుడే దిక్కు." అంటూ ముగించాడు తాతయ్య.

వాసు రాత్రంతా ఆ కథను కంఠపాఠం చేసేశాడు.

*　*　*

మరునాడు ప్రొద్దుపోయాక తాతయ్య దేవాలయానికి బయలుదేరే సమయంలో వాసు బడినుంచి యింటికివచ్చాడు. "తాతయ్యా! జయము! దిగ్విజయము!" అన్నాడు విజయగర్వంతో.

"ఏమిటీ సంగతి?" అన్నాడు తాతయ్య.

"ఇంకా నీదాకా రాలేదా యీ వార్త?...మనం గెలిచేశాం. ఉపన్యాసం పోటీల్లో మనదే ఫస్టు ప్రైజు..." అన్నాడు వాసు పిడికిలి పైకెత్తి. తాతయ్య ఆశ్చర్యపోలేదు... "నువ్వు తెలుగులో అందరికన్నా ఫస్టుకదరా! ఏ సందర్భంలో గానీ ప్రైజు నీదే!..." అంటూ గుడికి బయలుదేరాడు.

గుడిముందర తాతయ్యకు తెలుగు మేష్టారు కనిపించాడు. "ఏమండీ పంతులూ! మా వాసుకు వక్తృత్వం పోటీల్లో మొదటి బహుమతి యివ్వదలచారటనే?" అని పలకరించాడు.

"ఔనండీ! తప్పనిసరి! పోటీలో పాల్గొన్నవాడు—ఒక్కడు. బహుమానం ఆ ఒక్కడికే! ఇవ్వక తప్పదు. ఆహా! అయినా మీ వాసు ఎంత బాగా మాట్లాడడో తెలుసా..."

"చెప్పండి"...

"వడవడవణికిపోతూ బల్లదగ్గరికొచ్చాడు. 'దిక్కులేని వారికి దేవుడే దిక్కు అను కథను నేను బల్లగుద్ది చెప్పగలను' అంటూ బల్లగుద్ది కథ చెప్పాడు. ఆ కథ ఏమిటంటే—కొమ్మ మీద పావురాలు. ఆకాశంలో వేటగాడు తిరుగుతున్నాట్ట; క్రిందగ్రద్ద చూచిందట; బాణంతో పావురాలను కొట్టబోయిందట; పాము గ్రద్దను కరచిందట; బాణంవెళ్ళి వేటగాడికి గుచ్చుకుందట; పావురాలు ఎగిరిపోయాయట!"

తాతయ్య బోసినోటితో అందంగా నవ్వాడు. ★

'ఇప్పుడే. విమల రెండు నిమిషాల్లో కాఫీ చేసుకుని వచ్చింది.

'అబ్బే .... ఇప్పు డెందుకండీ' అన్నాడు.

'కాఫీ కేమండీ .... సర్వకాల సర్వావస్థలయందు సేవించవచ్చును' అంది విమల.

సమాధానంగా కాఫీ అందుకున్నాడు రమణ.

'ఒక పనిమనిషిని కనుక్కున్నాను....మీ ఇంట్లో పనిచేయటానికి వప్పుకుంది .... ' అన్నాడు రమణ.

'అయ్యో .... మాకు పనిమనిషి ఎందుకు నాయనా .... ఇంకోళ్ల యింట్లో పనిచేయకుండా అమ్మాయి నాకు తప్పించింది .... అదే పదివేలు నాకు' అంది యశోద.

'అదేమిటమ్మా ...' విమల విసుక్కుంది.

'సరే వస్తాను .... మళ్లీ ఇంటిదగ్గర కొంచెం పని ఉంది' అన్నాడు, రమణ. 'పొదురుగాన్లెండి' అని విమల అంటే కాస్సేపు కూర్చునేవాడే! ఇంటి దగ్గర ఏమంత ముఖ్యమైన పని లేదు.

రమణ వెళ్లిపోగానే 'ఈడొచ్చిన దానివి .... కాఫీ చేతి కందిస్తారుటే ఆయనకి .... కింద పెట్టాలి గాని' అంది యశోద. విమల ముఖం వెలవెలా బోయింది.

మర్నాడు ఆఫీసులో విమల కలవగానే 'మీ అమ్మ చాలా మంచిది' అన్నాడు రమణ.

'మీ కెట్లా తెలుసు' అని అడిగింది విమల.

'తెలుసుగా' అన్నాడు. మళ్లీ ఎందుకని విమల ప్రశ్నించలేదు.

విమలకు ఆఫీసు వాతావరణం అంతగా నచ్చ లేదు. అష్టకష్టాలు పడి తనకు చదువు చెప్పించిన తల్లిని గూర్చి తను ఇంతకంటె చేయగలిగిందేమీ లేదు. ఏదో నెలకు 'ఇంత' అని సంపాదించి తన తల్లిని పోషించి మాతృఋణం తీర్చుకుంటుంది. తన జీవితాని కంతే చాలు.

ఆఫీసులో పనిగురించి విమల ఎప్పుడూ బాధపడలేదు. పొద్దున్నమంచి సాయంత్రం దాకా ఫైళ్లు ముందర వేసుకుని ఏదో బ్రహ్మరాత వ్రాస్తూ, ఎందరి మెప్పుల కోసమో యాచిస్తూ, ఎందరినిగురించో భయపడుతూ అనామకంగా కాలం వెళ్లబుచ్చేస్తుంది. ఇండిటిదగ్గర యశోద గూడా ఈ క్రొత్త పద్ధతులకు అలవాటు పడింది. విమల ఆఫీసుకు పోగానే ఏ భారతమో, భాగవతమో ముందు వేసుకుని కూర్చుని సాయంత్రందాకా పద్యాలన్నీ వల్లిస్తుంది. వాటి అర్థం కోసం ఆమె ఎప్పుడూ తాపత్రయ పడలేదు. ప్రతిపదార్థం తెలియకపోయినా మూలభావం అర్థం అవుతున్నట్లుగా ఉంటుంది.

సాయంత్రం అయిదున్నర అయేటప్పటికి విమల వస్తుంది. యశోద మనసునిండా ఎన్నో ఆలోచనలు ముసురుతాయి. బాధపడుతుంది. సంతోషిస్తుంది. కళ్ల నీళ్లు పెట్టుకుంటుంది. తుడుచుకుంటుంది. ఆమె అనుభూతు లేమిటో, ఆమె గుండెలోని లోతు లేమిటో ఆమెకే తెలియాలి.

చీకటి పడుతుండగా రమణ వచ్చాడు. యశోద మెల్లిగా లాంతరు తెచ్చి ముక్కాల పీటమీద పెట్టి 'పట్టణం అంటే పదిచోట్ల తిరిగేవాళ్లకు గాని, వంటింట్లో ఉండేదానికి, నాకు మా వూరు, ఇక్కడా వక పేరకంగా ఉంది' అంది.

రమణ నవ్వాడు.

'నిజం ....' అంది యశోద.

పొరబాటు

(17-వ పేజీ తరువాయి)

'కాదని ఎవరన్నారు .... మీకు చూడాలని ఉంటే, రేపు ఆదివారం ఊరంతా తిరిగి రావచ్చు' అన్నాడు రమణ.

'ఆదివారం ఎప్పుడు వస్తుందా' అని ఎదురు చూసింది విమల. ఆదివారం వస్తున్నకొద్దీ 'వచ్చి వెళ్లిపోతుందేమో నన్న' ఆదుర్దా పడుతున్నాడు రమణ. ఆనాడు తనకెన్నో ప్రణాళిక లున్నాయి. అన్నీ పూర్తి చేసుకోవాలి.


ఆదివారం తొందరగానూ రాలేదు. ఆలశ్యంగానూ రాలేదు.

సరిగా ఆదివారం నాడే వచ్చింది.

విమల జార్జెట్టు చీరె తీసింది. లేత ఆకుపచ్చ రంగు. కాటుక పెట్టుకుంది. కళ్లకు రెండు పక్కలా ఆ కాటుకతోనే చేపతోకల్లా తీర్చిదిద్దింది. తిలకం తీర్చిదిద్దింది.

'నీపేరు మీనాక్షి పెడితే సరిపోయేది' అన్నాడు రమణ. యశోద అక్కడే ఉన్న సంగతి రమణకు ఒక్క క్షణానికి గాని తట్టలేదు. వెంటనే సంబాళించుకుని ' 'ఏమండీ .... మీ అమ్మాయి కళ్ళు చేపల్లాగా లేవూ .... మీరే చెప్పండి' అన్నాడు.

యశోద నవ్వి ఊరుకుంది.



''నాకు ఈ పట్టణం తెలియదు. మీ ఇష్టం ఎటువైపు పోదాం చెప్పండి''....అంటూ అడిగింది విమల. రమణ దారితీశాడు. ఊరంతా తిరిగారు. ప్రతిచోట రమణ డబ్బును నీళ్ల మాదిరిగా వాడేశాడు. యశోద చూసీ చూడనట్లు ఊరుకుంది. విమల చూసికూడా ''ఖర్చు పెట్టనీలె'' అనుకుంది.

రమణ చేతిలో డబ్బు చాలావరకు అయిపోయింది. అయిదు రూపాయల కాగితం మాత్రం ఉంది. ఆ డబ్బునుపెట్టి విమలను సినిమాకు తీసుకు వెళదా మనుకున్నాడు. ఇంటి దగ్గరకు వచ్చి రిక్షాలు దిగగానే మనీపర్సు తీసి ''నాదగ్గర చిల్లర లేదు'....అన్నాడు రమణ. విమల చిల్లర ఇచ్చింది. యశోద తలుపు తియ్యటానికి వెళ్లింది.

'ఆడవాళ్లడబ్బు ఖర్చు పెట్టిస్తే పాపం చుట్టుకుంటుంది' అంది విమల. రమణ తికమక పడ్డాడు. ''నిజంగా నేచిల్లరలేదు'' అన్నాడు.

విమల మర్నాడు ఆఫీసుకు పోగానే కొద్ది రోజుల పరిచయం ఉన్న సరళ వెంట నడుస్తూ ''రమణ మీకు బంధువా'' అని అడిగింది. 'బంధువు లాంటివాడు' అంది విమల.

'ఓహో'....అంటూ వ్యంగ్యంగా నవ్వుతూ వెళ్లిపోయింది సరళ.

విమల ఆ నవ్వులో అనేకార్థాలు చూచింది. ''ఎందు కట్లా నవ్వుతావు'' అని పిలిచి నాలుగు చివాట్లు వేయాలన్నంత ఆగ్రహం కలిగింది గాని ధైర్యం చాలక ఊరుకుంది.

ఆఫీసులోకి పోయి కూర్చుంది. ఆమె మనసులో మనసు లేదు. ఎన్నో ఆలోచనలు. సరళ నవ్వు పదేపదే తనను వెక్కిరిస్తున్నట్లు తోచింది. టేబులుమీద కాగితా లన్నీ దిగులుగా పడిఉన్నాయి.

అటూ యిటూ చూచి రమణ దగ్గరకు బయలుదేరింది. రమణ కుర్చీ చూపించాడు. విమల కూర్చుంది. రమణ ముఖం విప్పారింది. విమల చాలా విషయాలు చెబుదా మనుకుంది. ఆమె మనసుకు ఒకటీ స్ఫురించలేదు. రమణ విమల కళ్లల్లోకి సూటిగా చూశాడు. ఆమె శరీరం అంతా కుంచించుకు పోయింది. సరళ నవ్వుతున్నట్లు వినిపించింది. విమల ఉలిక్కిపడింది. రమణ పగలబడి నవ్వాడు.

'అట్లా ధడుచుకున్నావేమిటి' అని అడిగాడు. విమల సమాధానం చెప్పకుండా తిన్నగా వెళ్లిపోయింది. ఒంటరిగా కూర్చుని గతంలోకి, భవిష్యత్తులోకి తొంగి చూచింది. అంతా చీకటి. అంతా భయం. అంతా వెలుతురు. అంతా ధైర్యం. తను ఏకాకి. తన తల్లి ఏకాకి. ఈ ఉద్యోగంలో తనెందుకు చేరింది. తనీ పట్టణాని కెందుకు వచ్చింది. అమ్మ .... అమ్మకోసం వచ్చింది. ఈ విషయం కాదు తను ఆలోచిద్దా మనుకుంది. తనకు భయం వేసింది. తను రమణ జీవితంలోకి అనవసరంగా తొంగిచూస్తోందా? రమణలో నిజంగా ఆకర్షణేదన్నా ఉన్నదా! ఒంటరిగా కూర్చుంటే తోచదు. రమణ హాస్యంగా మాట్లాడతాడు. రమణ మాట్లాడుతుంటే తనెంతసేపయినా వింటూ కూర్చోగలదు. రమణ తన పక్కనుంటే తనకు ధైర్యం. ఛీ! ఏమిటి ఆలోచనలు అనుకుంది. తనకు తల్లి తప్పితే అయినవాళ్లంటూ ఎవరూ లేరు. తన బాగోగులు ఎవరు చూస్తారు. తనే చూసుకోవాలి. తన స్నేహితురాళ్ళు అనేకమందికి వివాహాలు అయినాయి. తను, స్వయంగా కొన్నింటికి వెళ్లింది కూడా. వాళ్ల తలిదండ్రులు మంచి సంబంధాలు ఏరి కోరి తెచ్చుకున్నారు. తన పెళ్లి కోసం తనే మాట్లాడుకోవాలా? తనతల్లి ఎవరితోనూ పోయి మాట్లాడలేదు. ''నన్ను పెళ్లి చేసుకుంటావా' అంటూ తాను స్వయంగా పోయి ఎవరిని అర్థిస్తుంది? మగదిక్కులేని కొంప. దిక్కు దిక్కు మంటూ' తను తన తల్లి, తను జీతంరాళ్లు తీసుకెళుతుంది. తల్లి నడుములు విరక్కొట్టుకుని ఇంట్లో చాకిరి చేస్తుంది. ఇద్దరూ అన్నాలు తింటారు. ఇద్దరూ పనిచేస్తారు. ఇద్దరూ నిద్రపోతారు. ఇదేనా జీవితక్రమం? ఇలాంటి నిరర్థకమైన బ్రతుకు నడిపేదానికంటే ఈ జీవితాన్ని అంతం చేసుకుంటే నయంకాదూ. తను లేకపోతే తల్లి ఎలా జీవిస్తుంది. తనకోసం తల్లి జీవిస్తోంది. తల్లికోసం తను. ఒకరికోసం ఒకరు జీవిస్తున్నారు. విమల ఒక ఇంటిదై చల్లగా కాపురం చేస్తూంటే చూడాలని తల్లి మనసులో ఉండి ఉంటుంది. కాని అదెలా సాధ్యం. తను వివాహం చేసుకుంటే ఉద్యోగం మానెయ్యవలసి రావచ్చు. తల్లి తనదగ్గరకు వచ్చిఉంటుందా? అంతకంటె అవమానకరమైన ఇంకొకటి ఏముంటుంది. అన్నీ సమస్యలే. విమల ముఖంమీద చిరుచెమట పట్టింది. కొంగుతో ముఖం తుడుచుకుంది. అప్పటికే అయిదు దాటింది. ఆఫీసులో వాళ్లంతా వెళ్లిపోయారు.

విమల ఒక్కతే మెల్లిగా అడుగులు వేసుకుంటూ బయటకు వచ్చింది. ఇంటికి వెళ్ళేటప్పటికి తల్లి ఎదురైంది.

'అట్లా ఉన్నావేమిటే' అంటూ అడిగింది. విమల

మెదలకుండా ఇంట్లోకి వచ్చి కూర్చుంది.

'ఇవ్వాళ సినిమాకు పోదాం' అంటూ రమణ వచ్చాడు.

'అనుకుంటూండగానే వచ్చావు .... రా .... నాయనా' అంటూ యశోద ఆహ్వానించింది.

"చాలా మంచి సినిమానండి ...." అంటూ రమణ సినిమాకు పోవలసిన ఆవశ్యకతను గూర్చి చెప్పబోయేటప్పటికి యశోద అందుకుని 'అట్లాగే పోయిరండి' నాయనా" అంది. రమణ నోరు కట్టుబడింది. విమల వెంటనే బయలుదేరింది. తన ఆలోచనల బరువునుండి ఈరకంగానైనా తప్పించుకోవచ్చు ననుకుంది.

ఇంగ్లీషు సినిమా అది. రెండు రూపాయల టిక్కెట్లకు వెళ్లారు.

విమల సినిమా చూస్తోంది. రమణ విమలను చూస్తున్నాడు. సినిమా అయిపోయింది.

'ఎట్లాఉంది' అని అడిగింది విమల.

'బావుంది' అన్నాడు రమణ. 'ఏది బావుంది' అన్న ప్రసక్తి రాలేదు. రమణ సినిమా చూడ లేదని విమల గ్రహించినా, తను గ్రహించి నట్లుగా కనబడదలచుకోలేదు.

"ఇంటికి పోదామా" అంది విమల.

'నీ యిష్టం' అన్నాడు రమణ. 'కాసేపు బజారులో తిరిగి వద్దాం' అంటే విమల 'సరే' అందా మనుకుంది. చంద్రుడు అప్పుడే పైకి వస్తున్నాడు. నక్షత్రాలు ఆహ్వానిస్తున్నాయి. చల్లటి గాలి వీస్తోంది. బరువుగా అడుగులు వేస్తూ ఇంటికి చేరుకున్నారు..

మర్నాడు ఆఫీసులో సరళ కలిసింది. సరళ నవ్వుతోంది. విమలకు అసహ్యంగా తోచింది.

'సినిమా ఎట్లా ఉంది' అని అడిగింది సరళ. విమల కంతా అర్థమయింది.

'బాగానే ఉంది' అంది విమల.

'అదృష్టవంతురాలివి .... బాగుండక ఏం చేస్తుందిలే' అంది సరళ. 'నోరు ముయి' అంది విమల ఆగ్రహం.

'ఎవరినోరు' అంటూ ఆగకుండా వెళ్లిపోయింది సరళ.

'నీ నోరు మూయిస్తాను .... చూస్తూఉండు' అంటూ పళ్ళు పటపట కొరికింది.

'కంగ్రాట్యులేషన్స్ రమణా' అన్నాడు జోగారావు.

'ఏమిటి విశేషం' అన్నాడు రమణ.

'ఏంలేదులే గాని .... సినిమా ఎట్లాఉంది ....'

రమణ అతనివంక తీక్షణంగా చూశాడు.

నేనేమన్నా గుడ్డికొంగనురా .... మాడిపోవటానికి. అట్లా చూస్తా రెందుకు.' అన్నాడు జోగారావు.

'ఇదే ఇంకోళ్లయితే దవడ పగులగొట్టేవాడిని.'

'నీచేత దెబ్బలు తింటానికి ఎవరూ తయారుగా లేరు గాని .... ఇదేం పోయేకాలంరా నీకు.'

సినిమాకు వెళితే మీరంతా ఇట్లాపడి ఏడుస్తా రెందుకు ...."

'మేమంతా సంతోషిస్తున్నాంరా నా తండ్రీ .... అహా .... ఏంలేదు .... అటు పోయేటప్పుడు కేక వేస్తే నేనుగూడా వచ్చేవాడినిగా ?

'ఈసారి పిలుస్తాలే ....'

'నువ్వు ఒక్కడవు వెళ్లేటప్పుడు కాదు .... విమల గూడా పక్కనుంటేనే ....'

రమణ ఏదో అనబోయాడు. విమల అక్కడకు రావడం చూచి ఆగిపోయాడు.

'నమస్కారమండీ' అన్నాడు జోగారావు గౌరవ చేసుకుని.

'ఈయన జోగారావుగారు .... నా స్నేహితుడు.' పరిచయం చేశాడు. 'నమస్తే' అంది విమల.

'సరే .... నేను వస్తాను' అన్నాడు జోగారావు. రమణ చికాకుపడ్డాడు.

'కూర్చోవోయి పోదువుగాని' అన్నాడు.

'కాదులే...' అంటూ వెళ్లిపోయాడు జోగారావు. అతను నవ్వటం విమల చూసింది.

సరళ అన్న మాటలనుగురించి మాట్లాడుదా మనుకుంది విమల. జోగారావుగురించి ప్రస్తావిద్దా మనుకున్నాడు రమణ.

ఒకళ్లను చూస్తూ ఒకళ్లు చాలాసేపు మవునంగా కూర్చున్నారు. ఇద్దరూ ఎంతో దగ్గరగా ఉన్నారు. ఎంతో దూరంగా ఉన్నారు.

'నా మనసెంతో ఆందోళనగా ఉంది.' అన్నాడు రమణ.

'నాకూ అట్లాగే ఉంది' అంది విమల.

కాగితాలు సర్దేసి ఇద్దరూ బయటపడ్డారు.



పొద్దు కూకుతోంది. కొండల వెనుకకు పోయిన సూర్యుని కిరణాలు మేఘాలమీద ప్రతిఫలిస్తుంటే ఆకాశమంతా తైలవర్ణ చిత్రంలాగా కనపడుతోంది. అవేవో పిట్టలు బారులుతీరి పోతున్నాయి. ఆ బారు వెనుక రెండు పిట్టలు మాత్రం కొంచెం దూరంగా ఎగురుతున్నాయి.

ప్రకృతి ప్రశాంతంగా ఉంది. చెట్ల ఆకులు నిశ్శబ్దంగా అటూ యిటూ కదులుతున్నాయి.

పార్కుకి వెళ్లారు. అంతా జనసమూహం. మూలగా వెళ్లి ఎవరూ లేనిచోట ఒక బల్లమీద కూర్చున్నారు. దగ్గరలో గులాబీ అంట్లున్నాయి. రమణ మెల్లిగా లేచి ఒక పువ్వు కోసుకుని వచ్చాడు. ముల్లు చేతికి గుచ్చుకుంది.

'ఈ పువ్వు నీకు బావుంటుంది.' అన్నాడు రమణ. మెల్లిగా పక్కకు వచ్చి కూర్చుని తలలో పెట్టాడు.

ఆ చెట్టుమీద ఉంటే పువ్వు కేమిటి అందం?' అన్నాడు రమణ. అతను నవ్వబోయాడు. అతని మనసులో కలిగిన ఉద్వేగం స్వచ్ఛంగా నవ్వనీయ లేదు. ముఖం కొద్దిగా కందింది. శరీరం అంతా గగుర్పాటు చెందింది.

'ఏమిటి ఆలోచిస్తున్నావు ....' రమణ అడిగాడు. విమల చేతిని తన చేతిలోకి తీసుకుని తామర పూలవంక చూస్తూ. గాలికి తామరపూలు ఒక పక్కకు జరిగిపోయి మళ్లా యధాస్థానానికి వస్తున్నాయి. ఏవో పురుగులు నడుస్తూంటే నీటి శరీరం జలదరించినట్లు కనిపిస్తోంది. ప్రశాంత తను భగ్నం చేస్తూ ఎక్కడో పిట్టలు అరుస్తున్నాయి.

'నువ్వంటే నాకు ఎంతో ఇది' అన్నాడు రమణ. విమల కళ్ళు చమరించినాయి. అతని హృదయం మీదికి వాలిపోయింది.

'నాకు భయంగా ఉంది' అంది.

'ఎందుకు భయం.'

'నాకు తెలియదు ....' విమల శిరస్సు తన గుండెలమీద బరువుగా ఉంది రమణకు. తలలో గులాబిరేకులు రెపరెప లాడుతున్నాయి.

'వాన కురుస్తుందా ....'

'ఉహూ ....'

'కురుస్తే బాగుండును."

'అవును.'

'ఇవాళ ఎండ బాగా కాసింది."

'నిజమే.'

రమణ మాటలకి పొడి సమాధానాలు చెప్పింది విమల. 'కుంభవృష్టి కురుస్తే బాగుండును' అను కుంది.

'ఇంటికి పోదామా ....'

'తొందరేముంది' అన్నాడు రమణ.

'అమ్మ ఎదురు చూస్తుంటుంది.'

'మీఅమ్మ నా గురించి ఏమనుకుంటోంది."

'దేనివిషయం....'

'నన్ను ఏమన్నా అనుమానంగా చూస్తోందా."

'అనుమానం ఎందుకు....'

ఆమె పెదిమల మలుపులో మెరుపులాగా వచ్చి పోయిన మందహాసం రమణ కళ్లదాకా రానేలేదు. విమల లేచి నిలబడింది. ఇద్దరూ బయటకు బయలుదేరారు. విమల నిరుత్సాహంతో నీళ్లు కారిపోయింది. ఆమె ఎన్నో విషయాలు మాట్లాడ వచ్చు ననుకుంది. ఆమె హృదయం మబ్బుల అంచుల్లో ఎగిరే పావురంలాగా ఊహించుకుంది. కాని ఆ విహంగం విహారానికే బయలుదేరలేదు. పార్కు బెంచిమీద నీళ్లు కారిపోతూ రెక్కలు కట్టేసుకుని పడిఉంది. 'రమణ చాలా పెద్దమనిషి' అంటూ విమల తల్లి ఎప్పుడో అన్న మాటలు గుర్తుకు వచ్చినాయి. 'మరీ ఇంత పెద్దమనిషేమిటి' అను కుంది విమల.

ఇద్దరూ నిశ్శబ్దంలో అడుగుల చప్పుడు చేస్తూ ముందుకు సాగిపోతూంటే కింద పరుచుకున్న వెన్నెలమీద నీడలు నడిచిపోతున్నాయి. గులాబి సౌరభం వెంటాడి వస్తోంది. ఇద్దరూ దిగులుగా ఉన్నారు. కాని రమణ మనస్సులో అదొక రకమైన 'శాంతి' లాంటి ఆవేశం ఆవహించింది. తను చూపిన నిగ్రహం ఇంకోళ్ళు చూపలేరు. విచ్చలవిడిగా మనస్సును, శరీరాన్ని వదిలి పెట్టడంకంటే ఆ దు పు లో ఉంచుకోవటంలోనే అందం ఉంది. తనలో ఉన్న ఆకర్షణ గూడా అదేనేమో ! రమణ గుండెసైజు పెరిగింది. తన హృదయం విశాలమైంది. దీర్ఘంగా గాలి పీల్చాడు. మనసు తేలికైంది. విమల గూడా దీర్ఘంగా గాలి పీల్చింది. హృదయం, మనసు బరువై మనిషి వంగి, వంగి నడుస్తోంది.

'అమ్మో' అంటూ కేక వినబడింది. పక్కనుంచే వచ్చింది ఆ కేక. అదిరిపడ్డారు ఇద్దరూ. పక్కనే గుబురుగా పెరిగిన పరివిచెట్లలో నుంచి

వచ్చింది అరువు. గబగబా అటువైపు వెళ్లారు. జోగారావు క్రిందపడి దొర్లుతున్నాడు. ఇద్దరూ ఒక్కసారే గుర్తుపట్టారు. 'పాము .... పాము ....' జోగారావు రొప్పుతున్నాడు.

'ఎక్కడ....'

'అటుపక్కకు పోయింది....'

రమణ ఆతృతగా 'అటుపక్కకు' చూశాడు.

కన్నం చివర తోకలాగా కనబడింది. జోగారావు కిందపడి దొర్లుతున్నాడు. చుట్టుపక్కల ఎవరూ లేరు. రమణ కేకవేసి చూశాడు. ఎవరూ పలకలేదు.

'కాలుమీద కరిచి పారిపోయింది' జోగారావు మడమ పట్టుకుని చూపించాడు. 'మా ఇల్లు చాలా దూరం .... మీ ఇంటికి తీసుకుపో రమణా .... మంత్రం వేస్తారేమో .... డాక్టరుని పిలుస్తావా.... మీ ఇల్లు ఎంతదూరం .... తొందరగా చెప్పు రమణా' జోగారావు ఆదుర్దా చూస్తుంటే రమణ అదుర్దా అంతకు నాలుగు రెట్లుగా ఉంది.

'రిక్షామీద పోదాం ....' అన్నాడు రమణ.

'మా ఇల్లు ఇక్కడేగదా .... అక్కడికి పోదాం' అంది విమల.

'ముందు రిక్షాదాకా పోవటం ఎట్లాగు' అన్నాడు జోగారావు. రమణ అతన్ని లేవదీశాడు. జోగారావు వేళ్లాడిపోతున్నాడు. షుమారు ఆరడు



గుల మనిషి. రమణ వీపుమీదకు ఎత్తుకోలేక పోయాడు.

'ఎట్లా .... ఆలస్యం అయితే ఏమవుతుందో' అంటున్నాడు జోగారావు. ఆపత్సమయం గుర్తించింది విమల. తను గూడా సాయం పట్టింది. ఇద్దరి భుజాలమీద చేతులు వేసుకుని కాళ్ళు వేళ్లాడేస్తున్నాడు జోగారావు. జోగారావు చేతిలో నలిగి పోతోంది విమల. అంత బరువు మోయలేదు. లేకపోతే ప్రాణానికే మోసం వస్తుందేమో! ఎవరన్నా చూస్తే! ఏమనుకుంటారు. సాటి ప్రాణాన్ని రక్షించటానికి ముందుకువచ్చిందనుకుంటారు. తను స్త్రీ!! స్త్రీ పురుష భేద ప్రసక్తి ప్రాణాపాయ సందర్భంలో రాదు. కాని తను మోయలేని బరువు అలాగే బలవంతాన గేటుదాకా వచ్చారు. విమల మనసు తేలికైంది.

'మా ఇల్లు దూరం .... మా ఇంటికే పోదాం' అంది విమల. రిక్షాలు మాట్లాడారు. ఇంటికి పోగానే యశోద ఖంగారు పడింది.

'రైలుస్టేషనుకు పోయి .... పాముల నరసయ్యగారో ఎవరో ఉంటారుట .... మంత్రం వేయించువాయనా' అంది యశోద.

'కాలికి కట్టు కట్టండి' అన్నాడు రమణ.

'ఆపని నేను చూస్తాను. ముందు మీరు స్టేషనుకు పదండి' అంది విమల. రమణ స్టేషనుకు పరుగెత్తాడు..

విమల కట్టు కట్టింది. యశోద వేన్నీళ్ళు కాగబెట్టటానికి దొడ్లోకి పోయింది. విమల మంచం దగ్గరకు వచ్చింది. జోగారావు ఆమెను ఒక్కసారిగా రెండు చేతుల్తోనూ పట్టుకుని మంచంమీద కూర్చోబెట్టాడు. విమల తత్తరపాటు సర్దుకుంది.

''నాకు భయంగా ఉంది....' అన్నాడు జోగారావు.

''మీకు భయంలేదు' అంది విమల.

''ఓదార్చటానికి అంటున్నారు .... బ్రతుకుతానని ఆశ లేదు, నాకు .... ఇలాంటి దుర్మరణం వస్తుందని ఎన్నడూ అనుకోలేదు. నా ఆశలన్నీ మొదట్లోనే తెగిపోతున్నయి..... అబ్బా' మూలుగుతున్నాడు జోగారావు.

'మీరు చదువుకున్నవారు .... అలా బెంబేలు పడితే ఎలా ? ధైర్యంగా ఉండాలి ....' విమల తన పిరికితనాన్ని కప్పిపుచ్చుకుంది.

'చదువుకీ, జీవన్మరణాలకి సంబంధం ఏమిటి ? ఇంకా కొన్ని నిముషాలు నా ఈ జీవితం .... చివరి ఘడియల్లో మీరు నాదగ్గ రున్నారు అంతేచాలు.'

'అంటే' తెల్లబోయింది విమల కొద్దిగా.

'నా మనసులో పూచిన పూలసౌరభం మీకు తెలియనే తెలియదు. మొదటిసారిగా మిమ్మల్ని చూచిననాడే .... మిమ్మల్ని గుర్తుపట్టాను నేను .... విమలా ....'

జోగారావు ఏకవచనంలో పిలిచినా విమల ఆశ్చర్యపడలేదు.

'విమలా .... ఇలా పిలుస్తున్నందుకు నన్ను క్షమించు. నువ్వు నా జీవితభాగస్వామివిగా గుర్తుపట్టాను. పెళ్లిళ్ళు స్వర్గంలోనే అవుతాయని నాకు తెలుసు. కాని విధి నన్ను ఈవిధంగా వేరు చేస్తోంది. విమలా .... నన్ను క్షమించు....నిన్ను నా దాన్నిగా చేసుకోలేకపోతున్నాను.''

విమల నోటివెంట మాట రాలేకపోతున్నది. ఆమె కళ్లవెంట అప్రయత్నంగా నీళ్లు కారటం మొదలుపెట్టింది.

'నీకుగూడా నేనంటే యిష్టమని తెలుసు. ఈ ఆఖరి క్షణాల్లో ఆమాట నీ నోటివెంట చెప్పు .... విమలా .... నీ సాన్నిధ్యంలో ఈ ఘడియల్లో నా బాధను మరచిపోతాను.''

విమల నిశ్చేష్టురాలైంది.

జోగారావు విమలను రెండు చేతుల్తో పొదివి పట్టుకున్నాడు. మూలుగును ఆపుకుంటూ కొంచెం పైకి లేచాడు. విమల శరీరం అంతా ప్రేమస్వరూపమై ఉవ్వెత్తున పొంగింది. జోగారావు కౌగిలిలో అమరిపోయింది, ఆమె హృదయం.

'ప్రభూ .... నేను నీదాన్ని .... ఇంతదాకా

ఆరోజురాత్రి నాటకం వేసిన నటుడు తన స్నేహితుడితో ఇలా చెబుతున్నాడు.

"నేను ఈనాటినుండి నాటకాల్లో వేషాలు వెయ్యడం మానుకుంటున్నాను. ఇవ్వాల్టినుండి పెద్ద చెప్పుల కంపెనీ పెట్టబోతున్నాను."

కర్లపాలెం మధుసూదనరావు.
(వేటపాలెం)

గుర్తించలేకపోయాను.' అని మూగధ్వనులు చేస్తోంది. జోగారావు మళ్లీ మంచంమీదకు వాలిపోయాడు. విమల అతని ముఖంమీదకు వంగబోయి, యశోద రావడం గమనించి అతని నుదుటిమీద చెమటను చీరె కొంగుతో తుడిచింది.

'రమణ ఇంకా రాలేదు' అంది యశోద.

'ఈపాటికి వస్తూవుండాలి' అంది విమల.

'నువ్వు పోయి లోపల కొంచెం కాఫీ పెట్టు' అంది, యశోద.

విమల కాఫీ పెట్టుకుని వచ్చింది.

'ఎట్లా ఉంది ....' విమల అడిగింది.

'నీ ప్రేమతో నేను మృత్యువుని జయించగలను' అన్నాడు జోగారావు. విమల ఆ మాటలకు పొంగిపోయింది. అంత విశేషమూంది కాబోలు. తను ఎట్లా చెప్పగలదు ? ఏమని చెప్పగలదు ?

'కాఫీ తీసుకోండి కొంచెం.'

'నాలో ఎందుకు ఇలా ఉత్సాహంగా ఉంది. నువ్వే కారణం.'

'అక్కడ స్టేషనులో మంత్రం పెట్టటం అయి ఉంటుంది ....'

'నీమీద ఉన్న నమ్మకం .... నాకు ఆ మంత్రాల మీద లేదు.....'

రమణ చెమటలు కక్కుకుంటూ వచ్చాడు.

'ఎట్లాఉంది' నోట్లోనుంచి మాటలు రాక మునుపే జోగారావు ముఖంలో కళకళ కనబడింది. 'మంత్రం పనిచేసింది' అన్నాడు.

'అవును.....' అంది యశోద.

విమల, జోగారావుల ముఖాల్లో ఆనందం మొలకలెత్తింది.

'ఒక రిక్షా పిలిచి నన్ను ఇంటికి పంపండి' అన్నాడు జోగారావు.

'వీల్లేదు .... ఈ రాత్రికి ఇక్కడే ఉండాలి మీరు. ఇంత ప్రమాదంనుండి తప్పి .... ఎట్లా వెళదామనుకుంటున్నారు ....' యశోద మందలింపుగా అంది. 'పోనీ మీ ఇంట్లోవాళ్లకి కబురు పంపుదాం' అంది.

'చెప్పి రమ్మంటావా ....' అయిష్టతగా అడిగాడు రమణ.

'అక్కడ ఎవరున్నారని .... ఒంటరిగాణ్ణి .... మావాళ్లంతా గ్రామంలోనే ఉన్నారు. ఇంత ప్రమాదం వచ్చి తప్పిందని వాళ్లకు తెలియదు...''

విషాదంగా నవ్వాడు జోగారావు. విమల వైపు చూశాడు. 'నువ్వు నాదానివి' అంటున్నాయిచూపులు.

విమల 'చూపులు 'నిజమే'....అంటున్నాయి.

జోగారావు పదిరోజుల తర్వాత శుభలేఖల కట్ట పట్టుకుని ఆఫీసుకు వచ్చాడు. రమణ శుభలేఖ చదివి నిర్ఘాంతపోయి తన ఆశ్చర్యాన్ని లోపలే కప్పిపుచ్చుకున్నాడు. 'కంగ్రాచులేషన్స్' అన్నాడు. 'వీడిలో ఏం చూసింది. విమలకోసం నేను ఏమయినా చేసేవాణ్ణి.... నావిలువ గ్రహించుకోలేకపోయింది' అనుకున్నాడు లోపల. 'ఈ జోగారావు గాడిలో ఏం చూసింది?' అన్న ప్రశ్న అతనిలోఅనేకసార్లు ఉదయించింది. విమల ఆఫీసుకురావటం మానేసింది. రమణ వాళ్లింటికి పోదలచుకోలేదు.

ఆరోజు విమల, జోగారావు, యశోద కలిసి రైలులో జోగారావు వాళ్ల ఊరు బయలుదేరారు. పెళ్లి అక్కడే జరిగే ఏర్పాటు.

రైలు బయలుదేరింది. రమణ ప్లాటుఫారం మీద నిలబడ్డాడు. రమణకు జరిగిన సన్నివేశాలు అనేకం గుర్తుకు వచ్చినాయి. ఆరోజు పార్కులో విమలతోపాటు వంటరిగా కూర్చున్నప్పుడు .... తనేమన్నా పొరపాటుగా ప్రవర్తించాడా ? అనుకున్నాడు. తను పిరికివాడిలాగా ఎందుకు మసిలాడు ? తను చేసిన పొరపాటు అదేనా !

జోగారావు పోతున్న రైలులో నుంచి చెయ్యి ఊపుతున్నాడు. అతని చేతిలో ఏమిటో వేళ్లాడుతోంది. తాడులాగా ఉంది. దూరం నుంచి పాము లాగా కనబడుతోంది.

'ఏమిటండి .... అది' అంది విమల కిటికీలో నుంచి బయటకు చూస్తూ. 'రబ్బరు పాము లాగా ఉందే ....' అంది.


'అవును.'

'మీ కెక్కడిది ....?'

'మరి నన్ను పార్కులో కరిచినపాము ఇదేగా ?' అన్నాడు జోగారావు. విమల నిస్తబ్ధురాలైంది. ఉక్రోషం వచ్చింది. అయితేనేం ఆ ఉక్రోషం మధురాతిమధురంగా ఉందివిమలకు. ☆



భరణీవారి 'బాటసారి'లో జానకి.



కె. పి. ఆర్ట్సువారి 'కన్నకొడుకు'లో కె. వి. ఎస్. శర్మ, కృష్ణకుమారి, రామకృష్ణ.

చిత్ర సమీక్ష :

కథ కాని కథ 'కన్నకొడుకు'

"పట్నంనుంచి రాంగానే, నాన్న చెప్పినట్లు బుద్ధిమంతుడుగా విని అమ్మబొమ్మకు దణ్ణం పెట్టాలి. తండ్రికోసం ఎన్నో త్యాగాలు చేయాలి. నాన్న తప్పు చెయ్యకపోయినా చేశాడనుకొని భ్రాంతి పడి, ఆ తప్పు తన నెత్తిన వేసుకొనేందుకు పారిపోవాలి. ఈ మాదిరి నీతి బోధలతో, మనోరంజక మైన సంగీతంతో, కడుపుబ్బ నవ్వించే హాస్యంతో కె. పి. ఆర్ట్సు ప్రొడక్షన్సు వారు నిర్మించిన "కన్న కొడుకు" చిత్రం విడుదలకు ముందుగా, విజయా స్టూడియోలో ప్రత్యేక ప్రదర్శనం ఇచ్చారు."

"గంగన్న విస్సన్న బాల్య మిత్రులు. సగుమతి వ్యాపారం చేస్తున్నారు. గంగన్నకు కుమారుడు మోహన్ (జగ్గయ్య) పట్నంలో డాక్టరు పరీక్షకి చదివి ఇంటికి తిరిగి వస్తాడు. మోహన్ మిత్రుడు ఇనస్పెక్టర్ కుమార్ (రామకృష్ణ) మోహన్ చెల్లెలు శారద (కృష్ణకుమారి)ని ప్రేమిస్తాడు. శారదా శారదా మోహన్‌ల వివాహం నిశ్చయమవుతుంది. ఈలోగా విస్సన్న (శివరామకృష్ణయ్య) గంగన్న (కె. వి. యస్. శర్మ) దగ్గరకువచ్చి శారదను తన కుమారుడు ఆనంద్ (రాజనాల) కు ఇచ్చి వివాహం చేయమని అడిగి విఫలుడవుతాడు. విస్సన్న కుమారుడు ఆనందు తన ఆఫీసుకు మేనేజరుగావుండి చేస్తున్న అక్రమాలన్నీ పసిగట్టిన గంగన్న ఈ విషయం ఒక రోజున భాగాల పంపిణీకోసం విస్సన్న రాగా దాఖలాలతోసహా విసన్నకు చెప్తాడు. రహస్యాలు వెల్లడించకుండా చేయటానికి దొంగచాటుగా వచ్చిన ఆనంద్ గంగన్నను చంపబోయి పొరపాటున విస్సన్ననే కాల్చివేస్తాడు. మేడమీద తన తండ్రికి విస్సన్నకు మధ్య జరుగుతున్న దగడ విన్న మోహన్ చేతిలో వున్న చిన్న తుపాకీతో సహా మేడ మీదకు పరుగెత్తుతాడు. తండ్రి చేతులలో కూడా ఒక పిస్తోలుండటం గమనించి, కోపోద్రేకం ఆపలేక తన తండ్రే విస్సన్నను కాల్చివుంటాడని నిశ్చయం చేసుకుంటాడు. సరిగా ఇదే సమయానికి చెల్లెలు శారద, ఇనస్పెక్టరు కుమార్ తన ఇంటికి రావటంచూసి తప్పించుకుపారిపోతాడు. ఇనస్పెక్టర్ కుమార్ తన ధర్మాననుసరించి పోలీసులకు తెలియచేస్తాడు. పోలీసులు డాక్టర్ మోహన్‌ను హంతకుడుగా అనుమానించి వెంబడిస్తారు. తనకుమారుడు హంతకుడు కాడని నమ్మిన గంగన్న మోహన్‌ను వెతుక్కుంటూ ఇల్లు వదిలిపోతాడు."

"పోలీసుల బాధనుంచి తప్పించుకు పారిపోతున్న మోహన్ ఒక కుగ్రామంలో పూలమ్ముకుని జీ



'కన్నకొడుకు'లో దేవిక.

ఉన్న అన్నా చెల్లెళ్ళు పార్వతి (దేవిక), గణపతి (రమణారెడ్డి)ల ఇంట్లో తలదాచుకుంటాడు. క్రమంగా పార్వతి మోహన్‌ల మధ్య విడరాని అనురాగబంధం ఏర్పడుతుంది.''

''ఇనస్పెక్టర్ కుమార్‌ను మోహన్ వుంటున్న వూరికి బదిలీ చేయటంతో శారదా, కుమార్లు ఆ వూరు వస్తారు. మోహన్‌ను వెతుకుతున్న గంగన్న కూడా ఆ వూరేవచ్చి దేవాలయంవద్ద స్పృహ తప్పి పడివుంటే శారద తన ఇంటికి తీసుకుపోతుంది. తనకు పూలు ఇవ్వటానికి వచ్చిన పార్వతికి తన తండ్రి అవస్థచెప్పి ఎవరైనా వైద్యుని పిలిపించమని శారద చెప్తుంది. పార్వతి తన ఇంట వుంటున్న మోహన్‌ను మారువేషంలోవెళ్ళి ఇనస్పెక్టరుగారి మామగారికి వైద్యం చెయ్యమని ప్రోత్సహిస్తుంది.''

మారువేషంలో తన తండ్రికి వైద్యం చేయటానికి వచ్చిన మోహన్ను శారద గుర్తిస్తుంది. తండ్రికి వైద్యం చేసేందుకు మోహన్ మారు వేషంలోనే చెల్లెలింటికి రాక పోకలు సాగిస్తాడు. అన్నా చెల్లెళ్ళ అన్యోన్యాన్ని ఇనస్పెక్టర్ కుమార్ పొరపాటుగా అపార్థం చేసుకుని అనుమానిస్తారు. ఇనస్పెక్టరు భార్యను ఇంటినుంచి వెళ్ళగొడ్తాడు. ఆమెతో గంగన్న కూడా బయలుదేరుతాడు. ఇంతలోగా ఆనంద్, తన తండ్రి విస్సన్నను హత్య చేసిన తుపాకి బావిలో పడవేస్తుండటం చూచిన ఆయా, తన భార్యను (ఆనంద్‌గుట్టుగా పెళ్ళి చేసుకొచ్చిన ఒక స్త్రీ) సరిగా ఏలుకోకపోతే హత్య విషయం వెల్లడిస్తానని ఆనందును బెదిరించి వెళ్ళిపోతుంది. ఆ రహస్యం బైట పడకుండా వుండేందుకని ఆనంద్ తన స్నేహితునితో కలిసి, ఆయాను తుపాకితో కాల్చి పారిపోతూ, దారిలో కన్పడ్డ గంగన్నను, శారదను తన నివాసానికి తీసుకువెళ్ళి గంగన్నను బంధించి, శారదను బలాత్కరిస్తాడు.''

''కుమార్ శారదను అనుమానించి అవమానించి నట్లు పార్వతివల్ల విని, తమ బాంధవ్యాన్ని పార్వతికి చెప్పి నిజం చెప్పేందుకు కుమార్ ఇంటికి వెళ్తాడు మోహన్. కుమార్ శారదను, గంగన్నను ఇంటి నుండి వెళ్ళగొట్టాడని నౌకరు చెప్తాడు. వారిని వెతుకుతూ నౌకరుతో బయల్దేరుతాడు మోహన్''

''కొన వూపిరితోవున్న ఆయావల్ల విస్సన్నను చంపిందెవరో తెలుసుకున్న కుమార్, తను అనుమానించింది తన బావనేనని పార్వతివల్ల తెలుసుకొని, శారదను రక్షించుకునేందుకు పార్వతితో బయల్దేరుతాడు.''

''శారదను బలాత్కరిస్తున్న ఆనంద్ తనను పట్టుకునేందుకు పోలీసులు వస్తున్నారని తెలిసి, బలాత్కారంగా శారదను తీసుకొని తన మిత్రునితో సహా కారులో పారిపోతాడు. ఆనంద్ నివాసం దగ్గరకువచ్చి మోహన్ బంధితుడై వున్న తన తండ్రిని కల్సుకుని శారదను ఆనంద్ ఎత్తుకుపోయిన సంగతి విని (డైరక్టరు సిద్ధపరచిన) మోటారు సైకిలుపై ఆనందును వెంబడిస్తాడు.''

''ఆనంద్, మోహన్‌ల మధ్య (ఎవరికీ దెబ్బ తగిలినట్లు కన్పించని) పెద్ద పోట్లాట జరుగుతుంది. ఆ పోట్లాటలో మోహన్ ప్రాణాపాయ దశలోవుండగా కుమార్, పోలీసులు వచ్చి ఆనందును, అతని స్నేహితుణ్ణి పట్టుకుంటారు. పదిమంది సహాయంతో పార్వతి తన ప్రియుణ్ణి (మోహన్ను) రక్షించుకుంటుంది. పార్వతి మోహన్‌ల వివాహంతో..... శుభం!''

''నటీ నటుల్లో జగ్గయ్య, దేవిక, రామకృష్ణ ప్రతిభావంతంగా నటించారు. కథకాని కథను కడుపుబ్బ నవ్వించే హాస్యంలో మరుగుపరచి చిత్రానికి మెరుగులు దిద్దిన జంటగా రమణారెడ్డి, ఛాయాదేవి ప్రశంసనీయంగా నటించారు.''

''చిత్రంలో మెచ్చుకోదగ్గది వినూత్న సంగీత దర్శకుడు కోదండపాణి సంగీతం. ఈ చిత్రంతో శ్రీ కోదండపాణి మంచి సంగీతదర్శకుల్లో స్థానం ఏర్పరచుకున్నారు. పాటలన్నీ ప్రశంసనీయంగానే వున్నా, అందాల నీకు సాటి ఆ చందమామ, జగమంతా జంటలే, పువ్వులు పాపలు దేవుని చిరునవ్వులే, పద్య జనాదరణీయాలు కావచ్చు. 'మంది ఎక్కువైతే మజ్జిగ పల్చన' అన్న సామెత సంగీతానికూడా వర్తించింది. ఈ చిత్రంలో పాటలు ఎక్కువ కావటం వల్ల సన్నివేశ పుష్టి తగ్గిపోవటమేగాక, నాల్గైదు కాపీ కన్యలు మేం కూడా వున్నామంటూ తొంగి చూచే అవకాశం కల్గింది.''

''నటునిగానేకాక, పద్యరచయితగా కూడా శ్రీ జగ్గయ్యను పరిచయం చేసిన కె. పి. ఆర్ట్సువారు నిజంగా ప్రశంసనీయులు. శ్రీ జగ్గయ్య రచన మృదుమధుర పదపుష్ప సంకలితసౌందర్యమాల అనుటలో అతిశయోక్తి వుండబోదు. ఈ పద్యాలకు దేవిక చూపిన అభినయం ఎంతైనా మెచ్చుకోదగ్గది.''

పుష్కలమైన హాస్యంతో మరొకమారు చూడాలనిపించే ఈ చిత్రానికి కథ : సదాశివబ్రహ్మం, మాటలు: శ్రీరామ్‌చంద్, సంగీతం : కోదండపాణి, ఛాయ : సత్యనారాయణ, మేకప్ : భద్రయ్య, కళ : అన్నామలై, దర్శకత్వం : కృష్ణరావు, నిర్మాతలు : కె. ప్రభాకరం, యం. యస్. బాబు. ★

''నాగరాజ్.''



విజయావారి 'జగదేకవీరుని కథ'లో బాల.



కె. పి. ఆర్ట్సువారి 'కన్నకొడుకు'లో జగ్గయ్య, దేవిక.

ఆదర్శాలు-ఆంతర్యాలు

(9-వ పేజీ తరువాయి)

"మహా గట్టివాడు" నరసింహప్ప లోపల అనుకున్నాడు. విషయం చెప్పడం ఎలాగా అని కొంతసేపు ఆలోచించాడు. ఇంకోడూ, ఇంకోడూ అయితే వెంటనే ఫలానా సంగతి అని చెప్పేసే వాడు. పోలాయితో జాగ్రత్తగా వ్యవహరించాలని ఏనాడో తెలుసుకున్నాడు నరసింహప్ప.

"సమయానికి మునసబు వస్తే ఎంత బాగుండేది ?" అని ఆయన మనస్సులో అను కున్నాడు.

ధొరవారు విషయం చెప్పడానికి అభిమాన పడుతున్నారని పోలాయి పసికట్టేశాడు.

ఒక ఉన్నతస్థాయిలో ఉన్నవాడు అల్పుడితో అవసరం వచ్చినప్పుడు ఆ అవసరాన్ని అపేక్షించే సహాయాన్ని ముఖాముఖిగా చెప్పడానికి కొంత అభి మానపడతాడు. మరో మధ్యవర్తిద్వారా తనపని నెరవేర్చుకోడానికి పూనుకుంటాడు. ఇప్పుడు అదే అవస్థ నరసింహప్పకు వచ్చింది. ఆ సమయానికి వస్తానన్న మునసబు రాకపోయేప్పటికి నరసిం హప్పకు మునసబుమీద చిరాకు కలిగింది. పోలా యిని ఏదో కబుర్లలోకి దింపి అసలు విషయం ఎత్తుదామనుకుంటే అందుకు పోలాయి అవకాశం యివ్వకపోయేటప్పటికి నరసింహప్పకు మరో ప్రసక్తి తేవడానికి ఏమీ తోచలేదు. వస్తుతః నరసింహప్ప మితభాషి. అందుకు తగ్గవాడే పోలాయి కూడా. అందువల్ల ఇద్దరి మధ్య వాతావరణం తాబేటిచర్మమైంది.

ఇంతలో మునసబు అక్కడకు రానే వచ్చాడు.

"నీకోసమే ఎదురుచూస్తున్నానయ్యా—ఇంత ఆలస్యమైందేం ?" కోపాన్ని అణచుకుంటూ ప్రశ్నిం చాడు నరసింహప్ప.

"దొరవారు మన్నించాలి. తీరా బయలుదేరే ప్పటికి పిల్లి యెదురైంది. ఎందుకైనా మంచి దని లోపలకు వెళ్ళి ఆంజనేయదండకం ఒకసారి పఠించి వచ్చేటప్పటికి కాస్త ఆలస్యమైంది .... ఏం పోలాయ్—పంతులు ఏమంటున్నాడు ?" అంటూ మునసబు ఒకేసారి నరసింహప్పకు సమా ధానం చెబుతూనే పోలాయిని ప్రశ్నించాడు.

పోలాయి ఒకసారి మునసబు ముఖంలోకి చూసి ఊరుకున్నాడు.

"మాట్లాడించినా పలుకడు—ఎంత పొగరు" అని మునసబు లోలోపలే అనుకున్నాడు. కాని సమయాసమయాలు, పోలాయి వ్యవహారమూ బాగా తెలిసినవాడు కాబట్టి ఎంతో శాంతంగా "మనమంతా ఒక్క ఊరివాళ్లం. ఊరి బాగో గులు మనకు తెలుస్తాయి కాని ఆ పంతులకేం తెలుస్తాయి" అన్నాడు మునసబు.

ప్రపంచ యాత్రికుడు ఎర్నెస్ట్ హెమింగ్వే క్యూబాలో ఉండగా ఒక ఉత్తరం వచ్చింది. 'ఎర్నెస్ట్ హెమింగ్వే; దేవుడెరిగిన దేశం' అని దానిమీద ఉన్న చిరునామా. "మీరు వ్రాసింది యదార్థమే. నేను ఉన్న దేశం దేవునికి తెలుసు" అని హెమింగ్వే ఆ లేఖకునకు సమాధానం పంపారు.

సమాధాన మేమిస్తాడో నని నరసింహప్ప కుతూహలంగా పోలాయివంక చూశాడు.

"ఈ ఊళ్లో పుట్టినాయనేగా .... ఇక్కడ ఉండటంలేదని పై ఊరిమనిషికింద లెక్క కడతారా ? అయినా అయిదు సంవత్సరాలనుంచి అందరితో మంచిగా ఉంటున్నాడు. ఆయన చేసిన చెడు ఏముంది ?" అన్నాడు పోలాయి.

ఒకసారి నరసింహప్ప మునసబుల చూపులు కలుసుకున్నాయి.

డొంక తిరుగుడుగా పోతే లాభంలేదనీ ఏదో విధంగా పని సానుకూలపరుచుకోవాలన్నట్టుగా వాళ్ళ చూపులు పోలాయికి పొడగట్టాయి.

"ఎన్నాళ్లని వాళ్ల పొలంలో వీళ్ల పొలంలో కూలీ చేసుకుని బ్రతుకుతావు పోలాయ్ ! దొరవా రికి నీవంటే ఎంతో అభిమానం. రెండెకరాల పొలం నీకు దొరవా రిద్దా మనుకుంటున్నారు. అది చేసుకోరాదూ ?" అన్నాడు మునసబు.

మునసబు మాటలు పోలాయిని సంభ్రమాశ్చ ర్యాలలో ముంచెత్తాయి. ఏదో సాధారణమైన ఎత్తు వేస్తా రనుకున్నాడే గాని, ఆ ఎత్తులో ఇంత దాతృత్వం ఉంటుం దనుకోలేదు పోలాయి.

"నా కెందుకు బాబూ ! .... నా ఒక్క పొట్టకు కూడు దొరక్కపోతుందా ?" అన్నాడు పోలాయి.

"నీవు ఉత్త అమాయకుడివిరా పోలాయ్ ! ఎప్పుడో ఒకప్పుడు పెళ్లి చేసుకోకపోవుగా. పెళ్లాం పిల్లలతో ఎంత కష్టం. నీవు ఊఁ అంటే దొర వారు నీ పేరుమీద పట్టా రాసేస్తారు." తన తెలికాన్నంతా ఉపయోగిస్తున్నాడు మునసబు.

ఇంకొక పాటివాడైతే దొరవారు, మునసబు వేసే ఉచ్చుల్లో ఎప్పుడో ఇరుక్కుపోయేవాడు. ఊరి పరిస్థితులు, పంతులు మూర్తి, మునసబు దుండగాలు, దొరవారి దౌర్జన్యం పోలాయి కళ్ల ముందు కదులాడాయి. లోగడ జరిగిన సంఘట నలు, నిస్సహాయులైన పేద రైతుల దైన్యం పోలాయి బుర్రలో సుళ్లు తిరిగాయి. అవన్నీ తలపునకు రావడంతో, కళ్లముందు కదులాడ డంతో పోలాయిలో కోపం ఘూర్ణిల్లింది. కాని దానినిప్పుడు ప్రదర్శించే సమయం కాదనీ, మర్యాద గానే తప్పుకోవడం భావ్యమనీ తలచి "దొరవారి దయకు నేను చాలా కృతజ్ఞుణ్ణి. కాని ...." నందే హంగా ఊరుకున్నాడు పోలాయి.

"నీ సందేహంకాని పోలాయ్, పొలమిచ్చిన దొరలు తతిమ్మా హంగులన్నీ ఏర్పాటు చేయరట్రా" అన్నాడు మునసబు.

"అదికాదండీ—నాకు దేవుడిచ్చిన కాళ్లు చేతు లున్నాయి. కష్టం చేసుకుని కడుపు నింపుకో గల శక్తి ఉంది. ఉత్తపుణ్యానికి నాకు భూమెందుకు ? పాపం ! కొయిలు ముసలాడు అయిపోయాడు. పిల్లాజల్లా ఉన్నవాడు. మొదటినుంచి దొరవారిని నమ్ముకొని ఉన్నాడు. అటువంటివాడికి ఆ రెండెకరాల పొలమిస్తే దేవుడు కూడా మెచ్చుతాడు." పోలాయి ఈమాటలు మనస్ఫూర్తిగానే అన్నాడు.

పోలాయి అభిప్రాయాన్ని నరసింహప్ప లోలో పలే మెచ్చుకున్నా, ఒకవేళ తమ పన్నుగడను పసిగట్టి పోలాయి ఇలా అంటున్నాడేమో అనుకున్నాడు.

"ఆ సంగతి దొరవారికి తెలియదనా, ఏదో నీమీద ప్రత్యేకాభిమానం ఉండబట్టిగాని" అన్నాడు మునసబు.

పోలాయి ఆలోచనలో పడ్డాడు.

"ఏమిటా ప్రత్యేకాభిమానం ? ఇన్నేళ్లనుంచీ లేని అభిమానం ఇవాళ పుట్టుకొచ్చిందే ! ఇదంతా ఆ పంతులుగారిని పడగొట్టాలనేగా ?" అనుకున్నాడు.

"తను ముఖాముఖిగా నాకు పొలం వద్దని చెప్పడంకంటే ఆ విషయాన్ని ఎటూ తేల్చకుండా కొన్నాళ్లపాటు ఉంచితే బాగుంటుం" దనుకున్నాడు పోలాయి.

"ఏమిటి ఆలోచిస్తున్నావు" అని నరసింహప్ప ప్రశ్నించాడు.

"దొరవారి మాటకు ఎటూ చెప్పలేకుండా ఉన్నాను. సరే—ఇప్పుడేం తొందరలేండి .... ఆలోచించి దొరవారికి మనవి చేసుకుంటాను" అంటూ పోలాయి లేచి నిలుచున్నాడు.

"సరే—ఆలోచించుకో" అంటూ నరసింహప్ప మునసబుతో నేత్రావధానం చేశాడు.

"పోలాయ్ .... సాయంత్రం మా ఇంటికి ఓసారి రా .... కొంచెం పనుంది" అన్నాడు మునసబు.

"దండాలు బాబు—వెళ్లొస్తా" అని పోలాయి బాణాకర్ర పట్టుకొని బయలుదేరాడు.

"మహా గట్టివాడు" అన్నాడు నరసింహప్ప.

"ఒక పట్టాన లొంగేఘటం కాడు ! దొర కావలసినవాడు" అన్నాడు మునసబు.

"ఏమిటా మాటలు ?" కోపంగా నరసింహప్ప గద్దించాడు.

"దొరవారు క్షమించాలి. మరో అభిప్రాయంతో అనలేదు. ఏదో వాడి హుందాతనానికి మనసుపడి అనేశాను."

"సరే...సాయంత్రం వాడికి నచ్చచెప్పు. వాడు మనవైపు మొగ్గితే—ఇక చూసుకో ....మన ... "

"వేరే చెప్పాలా—ఎం. ఎల్. ఏ అయిపోరూ" నవ్వుతూ నరసింహప్ప వాక్యాన్ని పూర్తిచేశాడు.

"అన్నీ కలిసొస్తే మంత్రినే కావచ్చు" అన్నాడు నరసింహప్ప.

"కావచ్చేమిటి—దొరవారు తలచుకోవాలేగాని" అంటూ మునసబు వంత పాడాడు.

"సరే—ఇంక నీవు వెళ్లవచ్చు. వ్యవహారం మాత్రం చాల జాగ్రత్తగా నడపాలిసుమా" అంటూ నరసింహప్ప హెచ్చరించాడు.

"దొరవారు వేరే చెప్పాలా .... మరి సెలవు" అంటూ మునసబు గుమ్మందాకా వెళ్లినవాడు ఏదో జ్ఞాపకం వచ్చినట్టు తిరిగి వచ్చాడు. 'ఏం ?' అన్నట్టు చూశాడు నరసింహప్ప.

"అడగడం మరిచిపోయాను—మాటల్లో పడి. ఒక వంద రూపాయలు జరూరుగా కావాలి. దొరవారు అనుగ్రహిస్తే మళ్లీ .... " అని నీళ్లు నమిలాడు మునసబు.

"సరే—గుమాస్తా నడిగి తీసుకువెళ్లు" అన్నాడు నరసింహప్ప.

ఏనుగు నెక్కినంత సంతోషంతో మునసబు గుమాస్తా గదివైపు గుమ్మం దాటాడు.

2

నరసింహప్ప నిన్న మొన్నటి వరకూ తెలంగాణాలో పన్నెండూళ్లకు దొరవారు. ఆసఫ్జాహి వంశస్థులైన నాల్గవ నవాబుగారు నరసింహప్ప పూర్వీకులకు ఆ పన్నెండు గ్రామాలు భరణంగా యిచ్చారు. అప్పటినుంచి ఆ పన్నెండు గ్రామాలకు ఏలికలై నరసింహప్ప వంశీకులు అనుభవిస్తూ వచ్చారు.

ఆ చుట్టుపట్ల గ్రామాలలో ఇతరు దొరలకంటే మంచి పేరే ఉంది నరసింహప్పకు.

నరసింహప్ప పితామహుడు హరప్పగారు ధర్మ

గుణ సంపన్నుడనీ, దయాశీలుడనీ ఆ ప్రాంతాలలో ఈనాటికీ చెప్పుకుంటారు.

నరసింహప్ప తండ్రి నారాయణప్ప కూడా మంచి వితరణశీలి అని ప్రతీతి. పండితులను ఆదరించేవాడు. కవులను సత్కరించేవాడు. స్వయంగా ఆయన ఒకటి రెండు కావ్యాలు

ఆదర్శాలు-ఆంతర్యాలు

రచించినట్టు, అవి చాలాభాగం చెదలు తినివేసి నట్టు నరసింహప్ప తన తాతముత్తాతల గుణగణా లను, ప్రతిభను చెప్పేటప్పుడు అంటూంటాడు.

నరసింహప్పకు ఏభై ఏళ్ళుంటాయి. విగ్రహ పుష్టి కలవాడు. తాత, తండ్రులకు గల వితరణ గుణం, రసజ్ఞత పుణికి పుచ్చుకున్నాడు. మొదటి భార్య కుమారు లిద్దరూ హైదరాబాదుల ఒకడు వైద్య కళాశాలలోను, రెండవవాడు ఇంజనీరింగు కళాశాలలోనూ చదువుతున్నారు. రెండవ భార్యకు ఇద్దరు ఆడపిల్లలు. మొదటి కూతురుకు పెద్ద



కట్నం యిచ్చి వైభవంగా వివాహం చేశాడు. అల్లుడు ఉన్నత విద్యకై అమెరికాలో ఉన్నాడు. రెండవ కూతురు పెళ్లీడు కెదిగింది.

భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన తరువాత కేంద్ర ప్రభుత్వంలో సంస్థానాలు విలీనం కావాలన్నప్పుడు హైదరాబాదు సంస్థానంలో ప్రారంభమైన "అజాద్ హైదరాబాద్" ఉద్యమానికి పరోక్షంగా తోడ్పడ్డ దేశముఖులు, జాగీర్దారుల ఫాయాలోనివాడే నరసింహప్ప కూడా.

ఆజాదు హైదరాబాదు ఉద్యమాన్ని అసంఖ్యాకంగా నిరసించిన హిందువుల్లాగే ఆ ఉద్యమం తగదని హెచ్చరించిన జాతీయ ముస్లింలు కూడా లేకపోలేదు. అలా వ్యతిరేకించిన వో ఉర్దూ పత్రిక సంపాదకుణ్ణి తమ మతానికి చెందినవాడైనప్పటికీ రజాకార్లు హత్య చేశారు. పారిపోకుండా మిగిలిన హిందువులకు ధైర్యం చెబుతూ కొంతమంది కాంగ్రెసు సేవకులు, నాయకులు ప్రాణాలకు తెగించి నిలిచారు. ఉపేక్షిస్తే లాభంలేదని కేంద్ర ప్రభుత్వానికి తంతులుమీద తంతులు పంపారు. దేశంలోని పత్రికలన్నీ అజాదు హైదరాబాదు ఉద్యమాన్ని తెగడుతూ కేంద్ర ప్రభుత్వాన్ని త్వరపడమని హెచ్చరించాయి.

పోలీసు చర్య తర్వాత చివరకు 'ఆజాద్ హైదరాబాదు' నినాదాలు గాలిలో కరిగిపోయాయి. ఉద్యమ నాయకుల కలలు కల్లలైనాయి. హైదరాబాదు సంస్థానం భారత ప్రభుత్వంలో విలీనం కావడం — బాధ్యతాయుతప్రభుత్వం ఏర్పడడం తప్పిందికాదు.

పోలీసు చర్య తరువాత తెలంగాణాలో ఒక నూతన చైతన్యం, వాతావరణం ఏర్పడింది. ముఖ్యంగా జంట నగరాలలో ఒక సంచలనం, వూనిక ఏర్పడ్డాయి. మిలటరీ గవర్నరు పరిపాలన కావడం వల్లను, ప్రజా ప్రతినిధులు మంత్రివర్గంలో కొన్ని స్థానాలు పొందడం వల్లనూ పరిపాలనలో కొన్ని మార్పులు వచ్చాయి. ఏ పదవీ అందుకోలేకపోయాననే అన్న విచారం నరసింహప్పకు అంటుజాడ్యంలా పట్టుకుంది.

మొదటి జనరల్ ఎన్నికల్లో నిలబడాలనే ఉద్దేశం నరసింహప్పకు కలగలేదు. ఆ ఎన్నికలతో అతిసామాన్యులు కూడా నెగ్గిరావావడంవల్ల తనంత పలుకుబడీ, డబ్బు కలవాడు సులభంగా ఎన్నికలలో నెగ్గగలడనే ధైర్యం, నమ్మకం నరసింహప్పలో ఏర్పడ్డాయి.

అందుకోసమే ఆయన ఈ తాపత్రయం.

కాని తెలంగాణాలో ఆంధ్ర మహాసభలు ప్రారంభం అయినప్పటినుంచి 'దొర' లంటే వెనుకటి భయమూ భక్తి కాస్త సన్నగిలుతూ వచ్చాయి. భారతప్రభుత్వం జాగీర్దారీ బర్బర విధానాన్ని రూపుమాపడానికి కంకణం కట్టుకోడం వల్ల జాగీర్దారులు, జమీందారులు, తుడిచిపెట్టుకు పోయారు. నరసింహప్ప వంటి 'దొర'లకు కూడా అంతే అయింది. జాగీర్దారులకు, సంస్థానాధిపతులకు నష్టపరిహారాలు ఏర్పాటు చేసి నట్టే ఈ దొరలకు కూడా ఏర్పాటు చేయడం వల్ల కోరలు పీకిన పాముల్లా అయిపోయారు. వెనుకటి దర్పం, అధికారం లేకపోయినా, డబ్బు ఉంది కాబట్టి పలుకుబడి పూర్తిగా పోలేదు.

దొరవారితనం పోయినా, పరిస్థితులనుబట్టి కొన్ని దుబారా ఖర్చులు తగ్గించుకున్నా ఆ వంశాన్ని అంటిపెట్టుకుని వస్తున్న సంప్రదాయానికి నరసింహప్ప పూర్తిగా స్వస్తి చెప్పలేక ఆశ్రయించిన వారికి అంతో ఇంతో సహాయం చేస్తూంటాడు.

నరసింహప్ప చాలా దూరదృష్టి కలవాడు కాంగ్రెసు సంస్థకు పదువేలు విరాళమిచ్చి సభ్యుడిగా చేరాడు. భూసంస్కరణల ప్రభావం ఏనాటికైనా తనమీద పడక తప్పదని వూహించి కొంత భూమిని అమ్మివేసి కొన్ని కంపెనీలలో వాటాదారుగా చేరాడు. కొంత భూమిని కొడుకుల పేర, కూతుళ్ల పేర, భార్య పేర పట్టాలు వ్రాయించాడు. తన ధర్మగుణాన్ని వ్యక్తం చేసేందుకు కొన్ని ఎకరాలు భూదానోద్యమానికి ఇచ్చాడు.

హైదరాబాదులో ఒక విశాలమైన భవనం కట్టించాడు. సకుటుంబంగా హైదరాబాదులో వర్షాకాలంలో ఉంటాడు. మిగతా రోజుల్లో కుటుంబం స్వగ్రామంలోనే ఉంటుంది. నరసింహప్ప నెలలో సగం రోజులు హైదరాబాదులోనే గడుపుతాడు.

నరసింహప్ప ఇద్దరు రక్కచెల్లెళ్లు కూడా మంచి ఫాయాలో ఉన్న కుటుంబాలలోనే మెట్టారు. ఆయన పినతండ్రి కొడుకు చలమయ్యదొర తప్పితే వేరే జ్ఞాతు లెవరూ లేరు. నరసింహప్ప చలమయ్య దొరల ఫాయిదా కుడిచెయ్యి, ఎడమ చెయ్యి వారగా ఉంటుంది. ఆస్తిపాస్తుల్లోను, సిరిసంపదలలోను నరసింహప్పదే కొంత పైచేయిగా ఉంటుంది.

3

మునేరు జలజలా పారుతున్నది. అస్తమిస్తున్న సూర్యకిరణాలు ఏటి నీటిలో పడి ఇంద్రధనుస్సులు విరుస్తున్నాయి.

ఏటి కావలిగట్టున ఉన్న కొండ కోనలలోకి దూకబోతున్నాడు సూర్యభగవానుడు. ఆవైపు ఆకాశంమీద ఎవరో ఆహ్వానిస్తూ కుంకుమ అర

కోసి రంగవల్లిక తీర్చారు.

ఏటిజలాలమీదుగా ఎగిరిపోతున్న పక్షి సంతతిని, నిరాడంబరంగా విలసిల్లుతున్న ప్రకృతిని తిలకిస్తూ కూర్చున్న రాజారావు మధ్య మధ్య ఎవరి కోసమో అన్నట్టు డొంకవైపు చూస్తున్నాడు.

కొండకు ప్రక్కగా ఉన్న డొంక ఎత్తుపల్లాలు లేక వంపులుతిరిగి ఉంది. డొంక కిరు

ఆదర్శాలు-ఆంతర్యాలు

ప్రక్కల తంగేడుచెట్లు, జిల్లేడు పిచ్చి పెసర చెట్లతో పచ్చపచ్చగా చూడముచ్చటగా ఉన్నాయి.

ఏటొడ్డున కూర్చున్నవారికి డొంక చివరి మలుపులోంచి వచ్చేవారు కనిపిస్తారు. రాజారావు అటువైపే చూస్తున్నాడు.

డొంక ఇరుపార్శ్వాలలో పొలాల పచ్చ తివాసీలు. ఏటి కివతలివైపు కొంత దూరంలో పెద్ద మామిడితోపు. వూరికి దక్షిణంగా ఉన్న మిల్లు గొట్టంలోంచి దట్టంగా వచ్చే పొ

ఆకాశంలో మబ్బులై పోతూఉంటుంది.

ఇసుకలో వ్రేలితో చైనా లిపి వ్రాస్తున్నట్లు గీతలు గీస్తూ కూర్చున్నాడు రాజారావు. "ఈ వూరు తనొచ్చి ఏమిటి సాధించినట్లు ?" అని ప్రశ్నించుకున్నాడు.

సమాధానం చిక్కలేదు.

"వూరును బాగుపరుద్దామనీ, పట్నాలలో లాగ పల్లెల్లో కూడా మనిషికీ మనిషికీ మధ్య ఇనుపతెరలు ఏర్పడకుండా చేసి, అవ్యాజమైన ప్రేమను, ఔదార్యాన్ని పునః ప్రతిష్ఠించి గ్రామాన్ని ఆదర్శప్రాయంగా చేద్దామనీ వచ్చాడు తను. కాని యిక్కడి వాతావరణం అందుకు విరుద్ధమై పోయిందే" అనుకున్నాడు రాజారావు.

పార్టీలు—కక్షలు !
కపటాలు—కార్పణ్యాలు !
స్వార్థాలూ—సంకుచితత్వాలు !
ఈర్ష్యలూ—అసూయలు !

వీటన్నిటితో నిండిన మానవుడిని మార్చడం ఎలా సాధ్యమవుతుంది ?

సత్యాన్ని ప్రేమించడానికి భయపడుతారు !
చచ్చిన పామునే చంపడానికి ప్రయత్నిస్తారు !
తప్పును ఒప్పుగా చెప్పగల సాహసికులు !
ముప్పులో కూడా అదుకోలేని స్వార్థపరులు !
పరపీడన పరాయణులు—పరవంచనా చింతకులు!
వీళ్ళా యీ మనుష్యులు !
వీళ్ళను మార్చడం ఎట్లా ?
ఎన్ని పుటాలు పెడితే వీళ్ళు మారుతారు ?

కరణం మాట మునసబుకు పొసగదు. మునసబు మాట కరణానికి కిట్టదు. వీళ్లకు ఆశ్రయమిచ్చినవాళ్లమధ్య వచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుంది. వీళ్ల కుట్రల్లో పడిన అమాయకులు సర్వనాశనం అవుతారు.

వీళ్లిద్దరినీ మించినవాళ్ళు నరసింహప్ప, చలమయ్య దొరలు.

చలమయ్య దొర అంటే అందరికీ హడలు !
కరణానికి ఆయన మాట వేదవాక్యం !
పూజారి గజగజ వణికిపోతాడు !
బేజారెత్తిపోతాడు షావుకారు !
ఆయన నడుస్తుంటే భూకంపమే !

ఆయనను అల్లంతదూరాన చూడగానే ఆడవాళ్ళు బెదురుతూ లోపలకు వెళ్లిపోతారు.

ఆయనకు ఎదురుగా నడవడానికి భయపడి మొగవాళ్ళు పక్కకు తొలగి చేతులు కట్టుకొని నిలబడుతారు.

పాలు కుడవబోతున్న లేగదూడ ఆయన గొంతు విని ఏ వాము చాటుకో పోయి నక్కుతుంది !

అయితే, ఆయన్ను ఎదిరించగలిగినవాళ్ళు నరసింహప్ప, ఆ తరువాత పోలాయి, ఆయన వలచి పూళ్ళోనే తెచ్చిపెట్టుకున్న అలివేణి. వీళ్ల ముగ్గురిని తప్ప చలమయ్య మరెవరినీ లెక్కచేయడు.

చలమయ్యకు నరసింహప్పంటే భయంలేదు కాని ద్వేషం ! పోలాయంటే విడమరచి వెళ్ల గ్రక్కలేని బెదురు.

నరసింహప్ప, చలమయ్యలు ఒకరినొకరు సాధించుకోవాలని ఎత్తులు వేస్తుంటారు.

పోలాయిని చేతిలో పెట్టుకొని తమ స్వార్థానికి, కక్షలు సాధించుకోడానికి ఉపయోగించుకోవాలని ఈ మూలవిరాట్టుల తాపత్రయం. కరణం, మునసబులు ఉత్సవవిగ్రహాలు.

నరసింహప్పను క్రూరుడూ, దుష్టుడూ అనడానికి వీల్లేదు.

ఏ స్త్రీనీ అవమానపరచినట్లు ఆ పరిసరాల్లో ఎవరూ చెప్పుకోరు.

ఆయనకు పట్నంలో ఒక ఉంపుడుకత్తె ఉందని ప్రతీతి. అంతమాత్రంతో ఆయన స్త్రీలోలుడనీ, కామాంధుడనీ అంటానికి వీలులేదు.

నరసింహప్ప పట్టుదలకు పెట్టింది పేరు. సాధారణంగా ఆయన ఎవరిమీదా కక్ష కట్టడు. ఎవరైనా తనమీద కక్ష కట్టినట్లు తెలిస్తే వెనక్కు తగ్గడు.

రైతు కష్టాలలో ఉండి పన్ను చెల్లించక పోతే బకాయీలు మాపు చేస్తాడు. కాని ఏవో దొంగ సాకులతో తనను మోసగించడానికి ప్రయత్నిస్తే మటుకు సహించడు. అటువంటివారిని నిర్దాక్షిణ్యంగా హింసించడానికి వెనుదీయడు. ఆయనలో భవిష్యత్తుకు సోపానాలు ఏర్పరచుకునే తెలివితేట లున్నాయి. కాని ఆయ నన్నడానికి వంత పాడేవా రుండాలి. ఆయనలో ఒకటి రెండు బలహీనతలూ లేకపోలేదు. అందులో వాదం ఒకటి. రెండవది మునసబు మాటల కిచ్చే విలువ.

పిల్లల చదువుల విషయం కాని, వూరి అభివృద్ధిని గూర్చి గాని వీళ్లల్లో ఎవరూ ఎప్పుడూ ఆలోచించలేదనే చెప్పవచ్చు. కరణం, మునసబుల చాణక్యనీతివల్ల కక్షలు పెరిగి కోర్టుల కెక్కడం సరదా అయిపోయింది.

ఇటువంటి పరిస్థితుల్లోనే రాజారావు ఆవూరు ప్రవేశించడం జరిగింది.

రాజారావు కృషి ఫలితంగానే అక్కడున్న మాధ్యమిక పాఠశాల ఉన్నత పాఠశాలగా మారింది. మరొక మాధ్యమిక పాఠశాల, ఒక గ్రంథాలయమూ వెలిశాయి.

ఆదర్శాలు-ఆంతర్యాలు

రాజారావుకూ ఆ వూరికీ కొంత అవినాభావ సంబంధ ముంది.

అతడు ఆ వూరిలోనే పుట్టాడు. రెండేళ్లు అక్కడే పెరిగాడు. ఆ తరువాత తండ్రి ఉద్యోగం చేసే వూళ్లల్లో తిరిగాడు. కాని తాతగారు మాత్రం ఆవూరినుంచి కదల్లేదు.

రాజారావు బి. ఏ చదువుతూండగానే సత్యాగ్రహోద్యమంలో పాల్గొని జైలుకు వెళ్లాడు. భారతదేశం స్వాతంత్ర్యం పొందినప్పుడు విడుదలై వచ్చాడు. కాని అతను మళ్లీ కళాశాల ముఖం

కూడలేదు. ప్రజాసేవలోనూ, సంస్కరణలోను ఎంతో ఉత్సాహంతో కృషిచేస్తూ వచ్చాడు.

పోసారి తాతగారు వ్రాసిన ఉత్తరంలో గ్రామంలోని పరిస్థితుల్ని వివరించాడు. అప్పటినుంచే తను ఆ గ్రామం వెళ్ళాలనీ, కల్మషపూరితమైన అక్కడి వాతావరణాన్ని మార్చడానికి కృషిచేయాలని ఉవ్విళ్ళూరేవాడు. కాని అప్పట్లో వీలు కలగలేదు.

తాతయ్యకు చాలా ప్రమాదంగా ఉందని తెలియడంతో అంతా బయలుదేరి స్వగ్రామానికి వచ్చారు.

తాతయ్య కళ్ళు మూశాడు. కర్మ అయిన తర్వాత ఎక్కడివాళ్లక్కడ బయలుదేరారు.

ఉన్న కొద్దిపాటి పొలంతో తా నక్కడనే ఉండి వ్యవసాయం చేయిస్తూ వున్నాడు రాజారావు. తండ్రి మొదట్లో ఒప్పుకోకపోయినా, రాజారావు పట్టుదల చూపడంతో ఆయనకు ఒప్పుకోక తప్పింది కాదు.

రాజారావు ఆవూరొచ్చిన మూడవనాడే పోలాయిని చూడటం సంభవించింది.

పోలాయిలోని చురుకుదనం, నిజాయితీ అతణ్ణి ఆకర్షించాయి.

ఆరోజునుంచే రాజారావుకు పోలాయంటే అభిమానం, నమ్మకం ఏర్పడ్డాయి.

"ఇంత చురుకుదనం, నిజాయితీ గల పోలాయికి చదువుంటే ఎంత రాణిస్తాడు" అనుకున్నాడు రాజారావు.

ఆరోజునుంచే పోలాయిని తన శిష్యునిగా చేసుకున్నాడు రాజారావు.

* * *

రాజారావు ఆలోచనల్లో ఆరోజు జరిగిన సంఘటన మసిలింది.

ఆరోజు ....

వాహ్యాళికి వెళ్లిన రాజారావు ఏటినుంచి ఇంటికి తిరుగుముఖం పట్టాడు.

సూర్యుడు అప్పుడే అస్తమిస్తున్నాడు.

రైతులు, కూలీలు పొలం పనులు ముగించుకొని వూళ్ళోకి పోతున్నారు. రైతాంగనలు గడ్డిమోపులు నెత్తిని పెట్టుకొని పల్లెపాటలు పాడుకొంటూ నడుస్తున్నారు.

రాజారావు డొంకదాటి కొంత దూరం వచ్చాడు. శబ్దించేస్తూ చీకట్లు ముసురుకుంటున్నాయి.

అతనికి అల్లంతదూరంలో ఒక పల్లెపడుచు గడ్డిమోపుతో సనసన్నగా ఏదో పాడుకుంటూ నడుస్తున్నది. ఆమెనడుస్తుంటే పాటకు లయగా కాలిమెట్టెలు ధ్వనిస్తున్నాయి.

ఆమె పాడే పాట స్పష్టంగా వినిపించక పోయినా ఆ పాట తీరు, కంఠంలోని మాధుర్యం రాజారావును ఆకర్షించాయి.

"ఏయ్ పిల్లా" అన్న కేక వినిపించింది.

కొస్త దూరంలో ఉన్న చిన్న మామిడితోపులోంచి ఎవరో బైటకు వచ్చినట్టు పసికట్టాడు రాజారావు.

ఆ పల్లెపడుచు వెనక్కు తిరిగిచూసి ముందుకు చకచక అడుగులు వేసింది.

అతను రెండు అంగల్లో వెళ్లి ఆమె చెయ్యి పట్టుకుని పెద్దపెట్టున నవ్వాడు.

ఆమె చెయ్యి విదిలించినట్టు గాజుల చప్పుడైంది.

"ఎందు కంత భయపడుతావ్ ! నేనేం పెద్దపులి ననుకున్నావా ?" అతని మాటలు కర్కశంగా వినిపించాయి రాజారావుకు.

"ఛీ .... పొడు .... నన్నొదిలెయ్" ఆమె అరిచింది.

"వదిలెయ్యటానికేనా నిన్ను పట్టుకుంది .... రా .... నా మాటవిను. నేను తలుచుకుంటే ఒళ్ళు బంగారమై పోతుంది !"

రాజారావు చకచక నడిచాడు.

ఆమె కేకలు పెడుతూ అతనితో పెనుగులాడుతున్నది.

"ఏమిటా దౌర్జన్యం .... వదులామెను" రాజారావు వాళ్లను సమీపించి గట్టిగా అరిచాడు.

"ఎవరు నువ్వు .... నీ దారిని నీవు పో."

"ముందామెను వదిలేసెయ్యి" అంటూ రాజారావు అతణ్ణి పట్టుకు లాగాడు.

"నన్ను ఎదిరించే మొనగాడవా నువ్వు !" అంటూ అతను ఒకచేత్తో ఆ పల్లెపడుచు చెయ్యి పట్టుకుని, రెండోచేత్తో రాజారావు చెంపను 'చెళ్ళు' మనిపించి దూరంగా నెట్టివేశాడు.

వూపుకు తట్టుకోలేక రాజారావు క్రింద పడిపోయాడు.

అతను వికటంగా నవ్వుతూ "ఎవడో కొత్త ముఖం—మన తడాఖా తెలియదు .... ఏయ్ పిల్లా .... మర్యాదగా నామాట విను" అంటూ తప్పించుకో పోతున్న ఆమె మీదకు ఉరికాడు.

"ఏయ్ .... ఆగు."

'ఆ గర్జనకు దిక్కులు ప్రతిధ్వనించాయి.

అతను ఆగిపోయాడు. వెనుకనుంచి వచ్చిన వ్యక్తిని చూచి పగలబడి నవ్వుతూ "వోరి నువ్వంటరా పోలాయ్ ! ఈపిల్ల చూడరా, మాట

వినకుండా ఉంది" అంటూ అతను మళ్లీ ఆమెను పట్టుకోబోయాడు.

"చలమయ్యదొరా, మిమ్మల్ని నమ్ముకొని మీ కొలువులో ఉన్న సీతన్నకు ద్రోహం చేస్తారా? పరాయి ఆడదాన్ని ఒంటరిగా పట్టుకోడానికి దొరలకు తగిందేనా? వదిలెయ్యండి దొరా—ఆమెను వదిలెయ్యండి" అన్నాడు పోలాయి.

"ఏడిశావులే పోరా—నీతులు చెప్పొచ్చావు, నీతులు" అంటూనే చలమయ్య ఆమె మీదకురికాడు.

"పోలాయన్నా—నచ్చి నీ కడుపున పుడతా—ఈ ముదనష్టపోడి నుంచి నన్ను కాపాడు" అని అరిచిందామె.

పోలాయి యిక భరించలేకపోయాడు. ఆ ఉద్రేకంలో చేతిలోని బాణాకర్రతో చలమయ్య నెత్తిమండలమీద విసురుగా కొట్టేప్పటికి "అమ్మబాబోయ్!" అంటూ చలమయ్యదొర కుప్పలా కూలిపోయాడు.

"ఈ దెబ్బ యాదికుంచుకో దొరా .... నడు సెల్లెమ్మా—ఇంక నీకేం భయంలేదు" అన్నాడు పోలాయి.

"ఆయ నెవరో పాపం, నన్నొదిలెయ్యమని సెప్పేతలికి సెంప పగలగొట్టిండు. ముదష్టపోడు" అంటూ ఆమె రాజారావును చూపించింది.

అంతవరకు పోలాయి రాజారావును చూడనేలేదు. రాజారావును చూడంగానే "దండాలండి బాబు—పోరు బాబు మీరో ?" అంటూ చేతులు జోడించాడు.

అదే పరిచయం—పోలాయితో రాజారావుకు.

ఆ పరిచయం బలీయమైపోయింది.

రాజారావంటే పోలాయికి వల్లమాలిన గురుభక్తి, ఎంతో విశ్వాసం.

(సశేషం)

లా:-ఏమోయి ఎలాగో నీ కేసు గెలిపించాను. మరి నా ఫీజుమాట ఏమిటి?

క్లయింటు:-అయ్యా! నేను బీదవాణ్ని. నేను బీదవాడ్నని మీరు నాకు చేసిన ఉపకారానికి నేను ఎప్పుడైనా తప్పక ప్రత్యుపకారం చేస్తాను.

లా:-నీ వృత్తి ఏమిటి?

క్ల:-అయ్యా! నేను కాటికాపరినండి.

ఎ. యాదగిరిరావు (హైదరాబాదు)

మనమూ—మన రాష్ట్రం

(18-వ పేజీ తరువాయి)

వీలైనంతవరకూ పాటించడం ఉచితంగా తోస్తోంది.

1. పదేళ్ళు గడువంటూ లేకుండా, 70 వ పడి దాటిన వృద్ధులను మినహాయించాలి. యువకులకు అవకాశం లభించకపోవడానికి కారణం దీర్ఘకాల పదవీత్వం కలిగిఉన్నా కాంక్ష వదలక ఈ వృద్ధ పితామహులు పదే పదే అభ్యర్థులుగా ముందుకు రావడం.

వీరు లేకపోతే ప్రభుత్వం దెబ్బ తింటుందను కొన్న కొందరికి ఈ సూత్రం వర్తింపచేయకుండా మినహాయించక తప్పదు.

2. సిద్ధాంతాలను గాలికి వదలి పదే పదే పార్టీలు మార్చేవారిని దగ్గరకు చేరనీయరాదు.

3. కాంగ్రెస్ అభ్యర్థులుగా నిర్ణయం కాక పోవడంతో ఎదురు తిరిగి పోటీ చేసి గెల్చేవారికి కాంగ్రెస్‌లో చోటుండరాదు. కాని స్థానికంగా పలుకుబడి గలిగి గెలిచే అవకాశం ఉన్నవారిని ఏదో నెపంపైన అభ్యర్థులుగా నిర్ణయించకపోవడం పొరపాటు అవుతుంది.

4. ఎన్నికలలో ఓడినవారిని తృప్తిపరచేందుకు గవర్నర్లుగా నియమించడం, కొంతకాలంపాటు గవర్నరుగా ఉంటూ పార్టీతో సంబంధం పోయిన వారిని తిర్గి కాంగ్రెస్ అభ్యర్థులుగా నిర్ణయించడం ఈ పద్ధతికి స్వస్తి చెప్పాలి.

5. అవినీతి ఆశ్రితపక్షపాతం ఇటువంటి ఆరోపణలు బహిరంగంగా, ప్రబలంగా వచ్చిన వారిని — అవి ఋజువైనవా లేదా అన్న దానితో నిమిత్తం లేకుండా సాధ్యమైనంతవరకు—అభ్యర్థులుగా పెట్టరాదు.

6. యువకుల నెన్నుకోనడంలో కేవలం యువకత్వమేగాక, విద్యావిజ్ఞానములు సామర్థ్యం. ఇవి ప్రధానంగా గణించాలి. ప్రస్తుతం శాసన సభలలో యువకులున్నారు కాని కొందరికి ఏ బిల్లు ఎటువంటిదో, దేని ఫలితాలు ఎలా ఉంటాయో తెలియదంటే అతిశయోక్తి కాదు. అందువల్ల కొంత న్యాయశాస్త్రపరిజ్ఞానం లోకజ్ఞత పరిశీలనా దృష్టి ముఖ్యం. ఇటువంటివాళ్ళను బయటనుంచి తెచ్చుకున్నా తప్పులేదు. ఇదివరలో శ్రీ చింతామణి దేశముఖ్ ను కాంగ్రెస్ అభ్యర్థిగా గెలిపించుకోలేదా.

7. అనుభవం ముఖ్యం కాబట్టి, అభ్యర్థుల నిర్ణయంలో స్థానిక సంస్థలలో ప్రజా ప్రతినిధులుగా పనిచేసినవారికి ప్రాధాన్యం ఇవ్వాలి.

అభ్యర్థుల నిర్ణయం ఏకగ్రీవంగా చేసినా, లేక మెజారిటీ నిర్ణయంతో ఏకీభవించి జరిగినా, ఈ పై సూత్రాలను పాటించినట్లయితే, గెలుపు ఓటములతో నిమిత్తం లేకుండా కాంగ్రెస్ గౌరవం ఇనుమడిస్తుంది. అంతేగాని ఏకగ్రీవత పేరుతో, భాగాలు పంచుకున్నట్లు మూఠా ప్రాతినిధ్యం ప్రధానంగా జరిగితే కాంగ్రెస్ గతి అధోగతే. ★

—కౌండిన్య.

న్యూఢిల్లీ లేఖ

(7-వ పేజీ తరువాయి)

ఒక్క మాటలో చెప్పాలంటే, భారత దేశానికి ప్రాతినిధ్యం వహించే ఢిల్లీ అనబడే మహానగరం, ఒక పెద్ద మురికివాడగా తయారవటంలో చాలా పురోగమిస్తోందన్నమాట. ఉదాహరణకి, గత పది హేనేళ్ళుగా చైనా రాయబారకార్యాలయంముందు కొన్ని మురికి కుటీరాలు వుంటున్నాయి. తనకు పార్లమెంటులో న్యూఢిల్లీనుంచి స్థానం పోతుం దేమోనన్న భయంవల్ల కాంగ్రెస్ ఆ మురికివాడ తొలగించలేకపోయింది. అయినా కాంగ్రెస్ కు ఆ సీటు దక్కలేదు.

న్యూఢిల్లీ జనాభా విపరీతంగా పెరిగిపోయినట్లు ఇటీవల లెక్కలవల్ల తేలింది. బహు భార్యాత్వం వున్నా కూడా ఇలాంటి పెరుగుదల అసంభవం. అసలు జరుగుతున్నదేమిటయ్యా అంటే, ఢిల్లీకి జనం విపరీతంగా వస్తున్నారు. నగటున నెలకు హీనపక్షంగా నాల్గువందల కుటుంబాలన్నా ఢిల్లీకి వస్తాయి. ఈ వచ్చిన వాళ్ళల్లో చాలా మంది కన్పించిన మైదానంమీదల్లా తిష్ఠ వేస్తారు. వీళ్ళను అదుపులో పెట్టే వాళ్ళు లేరు. శివది రోజులుగ గడిచాయో! ఇహ "మాకు వేరే స్థలం చూపించమని" కూర్చుంటారు.

కుతుబ్ రోడ్డుమీద, సఫదర్ జంగ్ ఆస్పత్రి దగ్గర కొంతమంది, కాయకూరల అమ్మకం ప్రారంభించారు. వీళ్ళ నెవ్వరూ పట్టించుకోలా. ఇంకా కొంతమంది చేరి ఈ రోజు ఆ ప్రాంతమంతా కుటీరాల్లోవున్న పళ్ళ కూరగాయల మార్కెట్ క్రింద తయారైంది. ఈ పళ్ళకొట్లలో చాలా భాగం, ఇతర చోట్లవున్న వాటికి శాఖ లన్నమాట. వీర్ని చూచి ఇంకా కొంతమంది ఆ దగ్గరి స్థలాల్లో తిష్ఠ వేశారు. వీరు ఒక పన్ను, అద్దె అంటూ చెల్లించరు. ఆరోగ్యం, పారిశుధ్యం వగైరా వగైరా సూత్రాలూ వీళ్ళు పట్టించుకోరు. అయ్యా! ఇదీ మన నెహ్రూగారి పిట్ల లాభపు ప్రజాస్వామ్యం.

కేంద్ర సచివాలయంలో రెండు బ్లాకులు ఒకప్పుడు నమూనాలుగా (పారిశుధ్యానికి) వుండేవి. ఈ రోజునో మంత్రులు కార్యదర్శులు ఉండే మధ్య అంతస్తు ఒక మోస్తరుగా శుభ్రంగా ఒక క్రమంగా వుంటుంది. ఇంక పై అంతస్తు, క్రింది అంతస్థులు మురికి గూడాలుగా తయారయ్యాయి. వాటి గోడలు కూడా నల్లగా తయారైనయ్!


పారిశుధ్యంలాంటి విషయాల్లో కాస్త శ్రద్ధ చూపాల్సిన మంత్రులు, కార్యదర్శులు, ఈ పరిశుభ్రత తమ చుట్టుపట్లలోవుంటే చాలనుకుంటారు. నడిచేటప్పుడు మాత్రం రెండు కళ్ళు గట్టిగా మూసుకు మరీ వెళ్తారు.

1849 లో భారతదేశాన్ని సందర్శించిన శ్లీమన్ ఆ రోజుల్లో లక్నో వున్న పరిస్థితిని ఇలా వివరించారు : "డబ్బు! సాలీనా కొన్ని వేల రూపాయలు జంతుప్రదర్శనశాలకుగాను ఖర్చు అవుతుంది. ఇది ఎవరికి లభిస్తోందో చెప్పలేనుగాని, పులులకు మాత్రం కాదు. లక్నోలో ప్రతి చోట ఇలాగే వుంది. చాలా ధనం భవనాలకు వెచ్చించారు. అవి కూలిపోయాయి. మసీదులకు వెచ్చించారు. దానికి చదివే వాళ్ళు, చదివించేవాళ్ళు, గ్రంథాలు, కార్యక్రమాలు ఏవీ లేవు. సమాధుల కోసం వెచ్చించారు. ఆ సమాధులపైనవుండేది మట్టిగాదు. పాతె గూళ్ళు మాత్రమే"

లక్నో పేర్లు మార్చి ఈ స్థితి ఢిల్లీకి వర్తింపజేసి చూద్దాం. కిటికీలు శుభ్రపరిచేందుకు ధనం వెచ్చించటం జరిగింది. ఆ కిటికీలు కొన్ని సంవత్సరాలుగా ఒక్క రోజున్నా తుడిచిన పాపాన పోలేదు. గదుల గోడలు, నేల శుభ్రంగా వుంచేందుకు ధనం వెచ్చించాం. ఆ ప్రదేశం నానాటికి కశ్మలంగా మారిపోతోంది. రోజుకు రోజు మరింత బూజుతో కలుషమైపోతున్న రిజర్వు బ్యాంకు దాకా ఈ అపరిశుభ్రత, మురికితనం పాకాయి. ప్రభుత్వ జమీని సంరక్షించేందుకు సాలీనా 2 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారన్నది గమనార్హం. సూపరింటెండెంట్లు పీవర్ట్పర్లు ప్రత్యేకంగా ఒక అదనపు చీఫ్ ఇంజనీరు ఈ పారిశుద్ధ్య కార్యక్రమానికి నియుక్తులయ్యారు. ధనం మాత్రమే దానిదోవన అది చేతులు తిరుగుతునే వచ్చింది.

★

గళ్ళనుడి కట్టు-61



అడ్డం


1. టర్కీదేశపువాడా ? గిరీశం 'డామిట్ ! కథ అడ్డం తిరిగింది' అనేవాడు.
3. అందం.
5. చక్కలిగింతలో శీతము.
7. మా బ్లాడేవాడు పిడే.
8. కోశ.
9. ఖేదము పొందినవాడు.
10. తిరగబడిన తామరతూడు విశేషం.
12. రవికూడా చూడనిది చూసేవా డంటారు.
14. నమో ! మురారీ ! అంటే ముఖం ఏది ?
15. లోపము కలుక్కు మన్నదాంట్లో తెలిసిందిట.
17. వేనలిని తిప్పి వ్రాయండి.
18. వాణ్యవిశేష మనతగదు. అన్నా వెతకండి.
19. వాయొక్క.
20. పీరు పెట్టం.
21. అయిపోయింది !
23. సేవకుడు దీనికేగా ?
24. ధైనందినవ్యాపారాలలో వృషభం అవసరం.
26. మొహంమీద ఉండేది.
28. చిందరవందర అయిపోయిన శరీరం రక్షించము.
29. చేతులు నరికితే పాలాలు.
30. సంవత్సరం.
31. అటునుంచి ఈవేళకు రండి.
33. దారి తప్పి దంచితే తప్పేగా ?
34. ఆయన తన కుమార్తెకోసం వెతికాడుట.

నిలువు

1. తుంపర.
2. చకచక చెప్పండి వెంట్రుక ఏదో.
3. అబ్బా ఏమిటి—
4. నీరు తోడేందుకు వాడేది : పొళంగా గదిలో పరిశీలించండి.
6. వ్రాయబడినది.
7. వాడు కలుగచేసుకొన్న అలవాట్లు.
8. పాయ.
11. సారంగము ఇదే.
13. ధూర్తలక్షణం అనుమానింప చేసేదా ?
14. కింశుకము (వాడుకలో)
16. కలగాపులగ మయిపోయిన ఇష్టం.
17. వయసండప్పులతో అయినప్పుడు మధ్యలో చిన్న పిల్లల ఆట తెలుస్తుందా ?
20. తోక మునుపే బిడ్డ.
22. మెట్టు—తంతినని యులుక తప్పదన్న వెతకాలి.
23. వ్యవసాయం చేసేవాడు.
25. అర్థం కాకపోతే పోయింది, ఇవిమాత్రం చూడకూడదు !
27. కొంచెం కలగాపులగమై పోయింది.
29. పక్కపాడి చేయునివారిలో ఒక స్త్రీ.
30. సామవేదం ఇటూ అటూ అన్నం.
32. నెయ్యడంలో నాయకుడు.

★

60-వ గళ్ళనుడికట్టుకు జవాబు



భారతి

1961 జూలై సంచిక

శ్రీయుతులు వేలటూరి రామదాసయ్యంగారు, కొత్త సత్యనారాయణ చౌదరి, పి. యస్. సుబ్రహ్మణ్యము, వఝల చిన సీతారామస్వామిశాస్త్రి, వేదుల సూర్యనారాయణశర్మ, కె. వి. రఘునారెడ్డి, జొన్నలగడ్డ సత్యనారాయణమూర్తి గారల వ్యాసాలు.


శ్రీయుతులు జి. ఖాను, సువర్ణశ్రీ, వాకాటి పాండురంగారావు గారల కథలు.

శ్రీ గొల్లపూడి మారుతీరావుగారి నాటిక

శ్రీయుతులు తుమ్మల సీతారామమూర్తి, శివగణ నరసింహస్వామి, ముదిగొండ వీరభద్రమూర్తి, బెల్లూరి శ్రీనివాసమూర్తి గారల కవిత.

ఒథెల్లో, మరుగుపడిన మాణిక్యాలు, తెనుగుమీరా, ఖానుమూర్తి కావ్యకుసుమాంజలి, బంగారుమామ పాటలు-గ్రంథ విమర్శనం.

వెల రు. 1-0-0



త్వరలో ప్రారంభం

'బియోవుల్ఫ్'

బాలసాహితి

సీరియల్ కథ.

వచ్చేవారం

ఆంధ్రసచిత్రవారపత్రిక

నుండి ప్రారంభం

ధ్రువతార

రచన

పెద్దిభొట్ల సుబ్బరామయ్య

'ధ్రువతార' అందరినీ ఆనందపరచగలిగే ఉదాత్తమైన సాంఘిక నవల. శ్రీ పెద్దిభొట్ల సుబ్బరామయ్యగారి కథలకు సుపరిచితులైన ఆంధ్రసచిత్ర వారపత్రిక పాఠకులు వారి చక్కని శైలి మరొకసారి చవిచూడ కలుగుతారు.

Edited, Printed and Published by S. Radhakrishna at the Andhra Patrika Press 6 & 7 Thambuchetty Street,